
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 27

శుక్రవారం 19-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జాతీయం..

ఆ 7 స్థానాల్లో బిగ్‌ఫైట్

- తమిళనాట డీఎంకే, బీజేపీ హోరాహోరీ
- కోయంబత్తూరులో అన్నామలైకి మొగ్గు
- డీఎంకే నేత రాజా ఎదురీత

- 11లో

తెలంగాణ

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- ఇప్పటికే కొందరిపై ఈసీ చర్యలు తీసుకుంది
- ప్రచారంలో పాల్గొనకుండా వారిపై నిషేధం విధించింది
- వెల్లడించిన సీఈఓ వికాస్‌రాజ్

- 10లో

ఆంధ్రప్రదేశ్

నన్ను చూడొద్దు.. ఎన్డీఏను చూడండి

- ప్రజాగళం సభల్లో చంద్రబాబు వేడుకోలు.. తన పాలనను చూసి కాకుండా.. ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని పిలుపు


- 12లో



శిల్పాశెట్టి దంపతుల ఆస్తుల అటాచ్

మనీ లాండరింగ్ కేసులో బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, రాజ్‌కుంద్రాకు చెందిన రూ.98 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.


- వివరాలు 6లో



బెయిల్ కోసం స్వీట్లు తింటున్నారు

ఒంట్లో చక్కెర స్థాయిలు పెంచుకోవడానికి కేజ్రీవాల్ జైలులో మామిడిపండ్లు, మిఠాయిలు తింటున్నారని ఈడీ ఆరోపించింది.

- వివరాలు 6లో



ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా జరగాలి

దేశంలో ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా జరగాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



పోలింగ్ @ 102 నేడే

లోక్‌సభ ఎన్నికల తొలిదశ పోరుకు సర్వం సిద్ధమైంది. 102 లోక్‌సభ, మరికొన్ని అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్ నిర్వహిస్తున్నారు.

- వివరాలు 6లో

అసెంబ్లీ రద్దు కావొచ్చు

లోక్‌సభ ఎన్నికలయ్యాక ఏడాదిలోపే జరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు

20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నాతో టచ్‌లో ఉన్నారు

పార్టీ శ్రేణులతో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్య



- కాంగ్రెస్‌లోకి వెళ్తే.. అంతా బీజేపీ కథ నడుస్తోందని వెళ్లిన వాళ్లంటున్నారు
- రేవంత్ వెంట బీజేపీలోకి వెళ్లేందుకు ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరు
- 20 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వస్తామన్నా.. వద్దని వారించా..
- ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు, మరో 3 చోట్ల అవకాశం
- ఈ నెల 22 నుంచి రెండు వారాలపాటు విస్తృతంగా బస్సు యాత్ర
- బీఎల్ సంతోష్‌పై కేసు పెట్టినందుకు.. కవిత అరెస్టుతో కక్ష సాధింపు
- ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని వ్యాఖ్య

"బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు బాధపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉందంటూ ఆ పార్టీలోకి వెళితే.. అక్కడంతా బీజేపీ కథ నడుస్తోందని ఓ నాయకుడు నాతో వాపోయారు. 20 మంది ఎమ్మెల్యేలను తీసుకుని రావాలా అని నన్ను సంప్రదించారు. కానీ ఇప్పుడు వద్దని వారించాను.."

గురువారం బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో పోచారం శ్రీనివాసరెడ్డి, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతతో కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఏడాదిలోపు అసెంబ్లీ రద్దయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతా బీజేపీ కథ నడుస్తోందని.. రేవంత్ బీజేపీలోకి వెళ్లినా ఆయన వెంట వెళ్లేందుకు కరుడుగట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. సుమారు 20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారన్నారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. "గతంలో బీఆర్‌ఎస్‌కు 104 మంది ఎమ్మెల్యేలతో పాటు ఏడుగురు ఎంఐఎం సభ్యులను కలుపుకొని 111 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేసింది. మనం అప్రమత్తమై అందులో భాగస్వాములైన స్వామీజీల కుట్రలను బట్టబయలు చేశాం. ప్రధాని మోదీ దుర్మార్గుడు. తెలంగాణలో 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ బతకనిస్తుందా? రేవంత్ బీజేపీలోకి వెళ్లినా, వెళ్లకున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చేందుకు బీజేపీ కచ్చితంగా ప్రయత్నిస్తుంది'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

ఎనిమిది చోట్ల గెలుస్తాం..: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో శరవేగంగా మార్పులు జరుగుతాయని.. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని కేసీఆర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ తరఫున ఎవరికి అసెంబ్లీ టికెట్ ఇచ్చినా సునాయాసంగా గెలిచే పరిస్థితులు ఉంటాయన్నారు. రాజకీయాల్లో తొందరపాటు ఆలోచనలు సరికాదని, కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు అక్కడి పరిస్థితులు చూసి తిరిగి వస్తామంటున్నారని చెప్పారు. కొందరు నాయకులు పార్టీ నుంచి వెళ్లినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదని, బుల్లెట్లలాంటి నాయకులను తయారు చేసుకుంటామని పేర్కొన్నారు. 'కొందరు నాయకులు వెళ్లినపుడు

మిగతా 2వ పేజీలో ▶

ఆ 106 ఎకరాలు అటవీ శాఖవే..

- ప్రైవేట్ వ్యక్తిది కాదన్న సుప్రీం
- తెలంగాణ హైకోర్టు తీర్పును పక్కనబెట్టిన ధర్మాసనం
- హైకోర్టు, రెవెన్యూ అధికారులు సదరు వ్యక్తులకు అనుకూలంగా చెప్పడంపై అసహనం
- అడవుల ప్రాధాన్యత గుర్తించడంలో మనుషులకు 'మతిమరుపు' ఉంటుందని ఘాటు వ్యాఖ్య
- ఆ భూముల ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.300 కోట్లు..



సాక్షి, న్యూఢిల్లీ/భూపాలపల్లి: అటవీశాఖకు ఓ వ్యక్తికి మధ్య చోటు చేసుకున్న భూ వివాదానికి 40 ఏళ్ల తర్వాత తెరపడింది. వరంగల్ జిల్లాలోని 106.34 ఎకరాల అటవీ భూమి ప్రైవేట్ భూమి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అత్యంత విలువైన ఆ భూమి అటవీ శాఖకు చెందినదేనంటూ గురువారం తీర్పునిచ్చింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనబెడుతూ న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన సుప్రీం ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తికి చెరో రూ.5 లక్షలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని జాతీయ న్యాయసేవల సంస్థ (నల్సా)కు రెండు నెలల్లోగా చెల్లించాలని ఆదేశించింది. వరంగల్ జిల్లా కొంపల్లిలోని

మిగతా 3వ పేజీలో ▶

నేను పని చేశాననుకుంటే మళ్లీ గెలిపించండి



తాను చేసిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- 'ప్రజలకు నివేదిక' సభలో కిషన్‌రెడ్డి
- కేంద్రమంత్రిగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం/చిక్కడపల్లి (హైదరాబాద్): సికింద్రాబాద్ ప్రజల ఆశీర్వాదంతో కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్ర, దేశాభివృద్ధికి తన వంతు కృషి చేశానని సికింద్రాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. 'నా సేవలను గుర్తించి, నేను పని చేశానని భావిస్తే మళ్లీ నాకే ఓటు వేసి గెలిపించండి..'అని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పింగళి వెంకటరామిరెడ్డి హాల్లో ఏర్పాటు చేసిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'ప్రజలకు నివేదిక'పేరుతో గత ఐదు సంవత్సరాలలో తాను చేసిన రూ.10 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, కాజీపేట్‌లో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్, వరంగల్‌లో ఏర్పాటు చేయబోతున్న పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కు, రామగుండంలో కొత్తగా నిర్మించిన ఎరువుల కర్మాగారం, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల గురించి చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద

మిగతా 2వ పేజీలో ▶

శ్రీరాముడి పేరు వింటేనే ఆ పార్టీలకు భయం

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై బండి సంజయ్ ధ్వజం

బీజేపీ బరాబర్ శ్రీరాముడి పేరుతోనే ప్రజల్లోకి వెళ్తుందని వెల్లడి

10లో

శ్రీరాముడి పేరు వింటేనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు భయపడుతున్నాయి. కేటీఆర్ రాముడిని మొక్కి.. బీజేపీని తొక్కాలంటున్నారు. రామభక్తులను తొక్కుతానంటే చూస్తూ ఊరుకుందామా?.. కాంగ్రెస్‌కు చేతనైతే బాబర్ పేరుతో జనంలోకి వెళ్లాలి.

- బండి సంజయ్



ఆ రెండు పార్టీలపై బీజేపీ చార్జిషీట్లు!

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వైఫల్యాలను పొందుపరచాలని నిర్ణయం

25న నామినేషన్ల ఘట్టం ముగిశాక వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం

10లో

నేడు నామినేషన్ వేయనున్న కిషన్‌రెడ్డి..



సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసిన నిందితుడు సతీశ్ (వృత్తంలో ఉన్న వ్యక్తి)ని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు



టీడీపీ నేత బొండా ఉమాతో నిందితుడు సతీశ్ (ఫైల్)

సీఎం జగన్‌ను హత్య చేసేందుకే..

- తలపై సున్నిత భాగంలో దాడికి పక్కా ప్రణాళిక
- కుట్రదారుల ప్రోద్బలంతో హత్యాయత్నానికి పాల్పడ్డ ఏ1 సతీశ్
- పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయితో సీఎంపై దాడి.. కుట్రను ఛేదించిన పోలీసులు
- రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి
- నిందితులిద్దరూ బొండా ఉమాతో కలసి దిగిన ఫొటోలు వైరల్

5లో

సుజనాచౌదరి దివాలా

సుజనా వ్యక్తిగత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి

స్ప్లెండిడ్ మెటల్ ప్రొడక్ట్స్ రుణం ఎగ్గొట్టిన కేసులో ఉత్తర్వులు

ట్రిబ్యునల్ తీర్పుతో బీజేపీ నేతకు షాక్



- బీజేపీ నేత, మాజీ ఎంపీ, ఎన్డీఏ కూటమి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి వ్యక్తిగత దివాలా ప్రక్రియకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

- 5లో

వివేకా హత్యపై దుష్ప్రచారం ఆపండి

- షర్మిల, సునీత, చంద్రబాబు, పవన్, పురందేశ్వరి, లోకేశ్‌లకు కడప కోర్టు ఆదేశం
- వీరు పరువు నష్టం కలిగించేలా మాట్లాడారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి
- పెండింగ్ కేసులపై మాట్లాడొద్దు
- ఇప్పటికే చేసిన వ్యాఖ్యలను మాధ్యమాల నుంచి తొలగించండి
- రాజకీయ మైలేజీ కోసమే సీఎం జగన్, అవినాశ్‌లపై దుష్ప్రచారం
- పార్టీలు, మీడియా తీర్పులు ఇచ్చేస్తున్నాయి.. ఇది న్యాయపాలనలో జోక్యం చేసుకోవడమే

- వివరాలు 5లో

గోదావరి పొడవునా.. ఉరకలెత్తిన జనం



బొమ్మూరు: చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తూ..

- అభిమాన నేతకు జైకొట్టిన గోదావరి జిల్లాలు.. 17వ రోజు సీఎం జగన్ బస్సు యాత్రకు పోటెత్తిన జనవాహిని..
- జనసంద్రమైన రావులపాలెం.. రాజమహేంద్రి.. రోడ్డుకు ఇరువైపులా మానవ హారాలు
- కడియపులంకలో సంక్షేమ సారథిపై పూల వర్షం.. వేమగిరిలో ఎడ్లబండ్లపై తరలి వచ్చిన రైతన్నలు
- బైక్ ర్యాలీలతో కదం తొక్కిన యువత..
- బొమ్మూరులో 108 గుమ్మడి కాయలతో దిష్టి తీసిన మహిళలు
- అందరి నుంచి విజ్ఞాపనలు స్వీకరించి అభయమిచ్చిన జననేత
- నుదుట గాయం బాధిస్తున్నా చెరగని చిరునవ్వుతో సీఎం జగన్ అభివాదం

12లో

45 డిగ్రీలు దాటేసింది



➤ భానుడి భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 45.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కాగా, శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

వడదెబ్బతో ఆరుగురు మృతి..

16లో

22న ఇంటర్ ఫలితాలు



➤ ఈ నెల 22న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. ఫలితాల విడుదలకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

- వివరాలు 3లో

సివిల్స్ హబ్.. హైదరాబాద్



➤ సివిల్స్ ప్రిపరేషన్స్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్, కరోల్‌బాగ్, ముఖర్జీ నగర్, లక్ష్మీనగర్. ఇది ఒకప్పటి మాట. నేడు హైదరాబాద్ నగరం సివిల్స్ కోచింగ్‌కు హబ్‌గా మారుతోంది. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు తుది ఫలితాల్లో మెరుస్తున్నారు.

- వివరాలు 7లో

ఇదండీ సంగతి



ఆ 'చిలక' ఒక్కటే గెలుస్తావని చెపుతుంది. ఆ ధైర్యంతో రోజూ వచ్చి అలా చెప్పించుకొని వెళ్తుంటారు!

మోదీతో విజయన్ రహస్య ఒప్పందం

కేరళ సీఎం కమ్యూనిస్టు కాదు కమ్యూనలిస్ట్: సీఎం రేవంత్ రెడ్డి

ఈడీ, ఐటీ కేసులు ఉన్నన్ని రోజులు ఆయన సీపీఎంను, కేరళ ప్రజలను మోసం చేస్తారు

జూన్ 9న రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణం చేస్తారు

వయనాడ్ పర్యటనలో సీఎం ప్రసంగం



వయనాడ్‌లో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాని మోదీతో కుమ్మక్కై, కేరళ ప్రజలనే గాక, సొంత పార్టీ సీపీఎంను కూడా మోసం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యులు అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. బంగారం స్మగ్లింగ్‌లో సీఎం, ఆయన కుటుంబసభ్యుల పాత్ర ఉండటం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. విజయన్‌పై ఈడీ, ఐటీ కేసులున్నప్పటికీ మోదీ చర్యలు తీసుకోవడం లేదని, ప్రధాని మోదీతో కేరళ సీఎం రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో పర్యటిస్తున్న రేవంత్ గురువారం అక్కడ జరిగిన రైతుల సమావేశంలో ప్రసంగించారు.

కమ్యూనిస్టు కాదు... కమ్యూనలిస్టు

రాష్ట్రాల ప్రయోజనాలు, రావాల్సిన నిధుల కోసం కేంద్రంతో పోరాటం చేయాలని, ఈ దిశగా తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు నిధుల కోసం

మిగతా 2వ పేజీలో ▶

రేవంత్‌రెడ్డీ.. ఇంటగెలిచి రచ్చ గెలువు



- కేరళలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలపై నోరు పారేసుకోవద్దు
- సీపీఎం పొలిట్‌బ్యూరోసభ్యుడు బీవీ రాఘవులు హితవు

- 2లో

3 విడతల్లో ముమ్మర ప్రచారం

14 సీట్లలో గెలుపుపై రేవంత్ దృష్టి
నేటి నుంచి మొదలుకానున్న రాష్ట్ర పర్యటన

- 2లో



జగదభిరాముడికి పట్టాభిషేకం

➤ మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ శంఖు, చక్ర, ధనుర్బాణాలు ధరించిన సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి పట్టాభిషిక్తుడయ్యాడు. భద్రాచలంలో జరిగిన ఈ పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు.

- వివరాలు 3లో

క్లుప్తంగా...

బీసీ ఉద్యోగులపై వివక్ష తగదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్ : ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ఉద్యోగులు అమలు చేస్తారని, లేనిపోని అనుమానాలతో బీసీ ఉద్యోగులపై వివక్షత తగదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్నారనే నెపంతో ఓసీ ఉద్యోగులను వదిలి బీసీ ఉద్యోగులను బలి చేయడం సమంజసం కాదని సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం ఓ ప్రకటనలో విన్నవించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేస్తారే తప్ప నిర్ణయాలు తీసుకునే అధికారం ఉండదని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. బీసీ ఉద్యోగుల మీద ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆయన కోరారు.

కల్లుగీత సొసైటీలపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి

తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం(హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత సొసైటీలపై నిర్బంధాన్ని ఎత్తివేయాలని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. గురువారమిక్కడ కమిటీ చైర్మన్ బాలగౌనీ బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. కల్లుగీత సొసైటీలపై పోలీసులు, రెవెన్యూ, ఎన్‌సీబీ బృందాలు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గీత కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడలకు ఒక్క ఎంపీ సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. జనగామ జిల్లాకు వెంటనే సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టి గెజిట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా ఇవ్వరా?

- అలాగైతే రాహుల్‌ను ప్రధాని ఎలా చేస్తారు?
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి మోత్కుపల్లి సూటి ప్రశ్న



అమీర్‌పేట: మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా ఇవ్వకుండా రాహుల్ గాంధీని ప్రధానిని ఎలా చేస్తారో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎంపీ సీట్ల విషయంలో అన్యాయం చేసిందని ఆరోపిస్తూ అమీర్‌పేటలోని తన నివాసంలో మోత్కుపల్లి గురువారం ఒక్కరోజు నిరశన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రేవంత్ నాయకత్వంలో మాదిగ సమాజానికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంలు పనిచేసిన మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి హయంలో మాదిగలకు గుర్తింపు దక్కిందన్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలతో గత పది రోజుల నుంచి సరిగ్గా తిండి కూడా తినడం లేదని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

3 విడతల్లో ప్రచారం

14 సీట్లలో గెలుపు లక్ష్య సాధనపై రేవంత్ దృష్టి

- పార్టీలో పట్టు నిరూపించుకోవాలనే పట్టుదలతో ముందుకు
- నేటి నుంచి మొదలుకానున్న రాష్ట్ర పర్యటన
- ఒకవైపు అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమానికి హాజరు
- మరోవైపు బహిరంగ సభల్లో పాల్గొనేలా షెడ్యూల్ ఖరారు!



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేయడంపై ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. 14 సీట్లు గెలుచుకోవడమే లక్ష్యమని చెబుతున్న సీఎం అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. లక్ష్యం మేరకు సీట్లను గెలుచుకోవడం ద్వారా పార్టీలో తన పట్టు నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్నట్లు చెబుతున్నారు. వచ్చే నెల 13న పోలింగ్ నేపథ్యంలో 11వ తేదీ వరకు ప్రచారం నిర్వహించుకునే వీలుంది. ఈ నేపథ్యంలో ప్రచార పర్వాన్ని మూడు విడతలుగా చేపట్టాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలోని 17 పార్లమెంటు సీట్లకు గాను మూడు దఫాల్లో 14 ప్రాంతాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. మధ్యలో జాతీయ నాయకులతో కూడా ప్రచారం చేయించే ఆలోచనతో ఉన్నారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న కేరళలోని వయనాడ్ నియోజకవర్గంలో రెండురోజుల పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన రేవంత్‌రెడ్డి శుక్రవారం నుంచే తన కార్యాచరణ ప్రారంభిస్తున్నారు. వీలైనంత మేరకు పార్టీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని భావిస్తున్నారు.

మహబూబ్‌నగర్ నుంచి మొదలు

తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానంలో పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి విజయాన్ని రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలకు 12 మంది కాంగ్రెస్ వారే ఉండడం, బీజేపీకి చెందిన మాజీ ఎంపీ జితేందర్ రెడ్డితో పాటు పార్లమెంటు పరిధిలోని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో భారీ మెజారిటీతో ఈ స్థానాన్ని దక్కించుకునేలా వ్యూహరచన చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం వంశీచంద్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. కాగా సాయంత్రం మహబూబాబాద్‌లో జరిగే బహిరంగసభలో సీఎం పాల్గొననున్నారు. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ కూడా శుక్రవారమే నామినేషన్ వేయనున్నారు.

వరుసగా సభలు

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మరో నియోజకవర్గం మెదక్. గతంలో కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానం నుంచి ఈసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పోటీ పడుతున్నారు. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధు బరిలో ఉన్నారు. కాగా 20వ తేదీన మధు నామినేషన్ కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తారు. అదే రోజు సాయంత్రం కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. 21న భువనగిరిలో పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక 22న ఉదయం ఆదిలాబాద్‌లో, 23న నాగర్‌కర్నూల్‌లో, 24న ఉదయం జహీరాబాద్, సాయంత్రం వరంగల్‌లో నిర్వహించే సభల్లో పాల్గొనడం ద్వారా పార్టీ ప్రచారం నిర్వహించనున్నారు.

గ్రేటర్‌పై స్పెషల్ ఫోకస్

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం కాంగ్రెస్ విఫలమైంది. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరితో పాటు సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో కూడా ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఈ నేపథ్యంలో ఈ మూడు నియోజకవర్గాలపై సీఎం రేవంత్ స్పెషల్‌గా ఫోకస్ పెట్టారు. ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకొని చేతిగుర్తుపై పోటీ చేయిస్తున్నారు. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకొని ఆయన సతీమణి సునీతారెడ్డికి మల్కాజిగిరి సీటిచ్చారు. ఇక సికింద్రాబాద్‌కు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈ మూడు సీట్లలో గెలుపు కోసం పలువురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. సికింద్రాబాద్ పరిధిలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆ పార్టీవర్గాలు చెబుతున్నాయి.

ఉత్తర తెలంగాణపై దృష్టి

మొదటి విడత ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే రెండో విడతలో గ్రేటర్‌లోని మూడు స్థానాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని స్థానాలపై దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థుల విజయం కోసం భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేసినట్లు తెలిసింది. అయితే ఇప్పటివరకు ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయకపోవడం గమనార్హం. కాగా రెండు, మూడు విడతల్లో పార్టీ కొంత బలహీనంగా ఉందని భావిస్తున్న నియోజకవర్గాలపై దృష్టి పెట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. పక్కన నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

కాంగ్రెస్ గెలవడం చరిత్రాత్మక అవసరం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

కోదాడ (సూర్యాపేట జిల్లా): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని మత ప్రాతిపదికన విభజించి దేశ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తోందని, ఈ సమయంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారం చేపట్టాల్సిన చరిత్రాత్మక అవసరం ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో గురువారం రాత్రి జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. గత పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీ హామీలను విస్మరించిందని విమర్శించారు. జూన్ 9న రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను నింపుతామని తెలిపారు. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కోదాడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, జైవీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డీ... ఇంటగెలిచి రచ్చ గెలువు



కేరళలో ఇండియాకూటమి భాగస్వామ్య పక్షాలపై నోరు పారేసుకోవద్దు

సీపీఎం పొలిట్‌బ్యూరోసభ్యుడు బీవీ.రాఘవులు హితవు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు ఫైర్ అయ్యారు. ముందు ఇంటగెలిచి రచ్చ గెలవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీభవన్‌లో ఆయన తెలుగులో అనువదించిన సీపీఎం ఎన్నికల ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవులు విలేకరులతో మాట్లాడుతూ 'కేరళలో కాంగ్రెస్, సీపీఎం ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నా.. బీజేపీ రాకుండా ఆపగలిగారు. ఈసారి అది జరుగుతుంది. బీజేపీ తెలంగాణలో అడుగుపెట్టడమే కాదు అధికస్థానాలు గెలవాలని వ్యూహాలు రచిస్తున్నట్టు మీడియాలో వస్తుంది. ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. రేవంత్‌రెడ్డి అక్కడకు వెళ్లి వ్యాఖ్యానించాల్సిన అవసరం లేదు. ఇక్కడ బీజేపీకి ఒక్కస్థానం రాకుండా ఆలోచిస్తే బాగుంటుంది. అది ప్రజలకు, దేశానికి, లౌకికవాదానికి మంచిది. అక్కడకు వెళ్లి ఇండియాకూటమిలో ఉన్న భాగస్వామ్య పార్టీలపై నోరుపారేసుకోవడం కన్నా బీజేపీపై నోరుపారేసుకుంటే బాగుంటుంది. మా కర్తవ్యం అదే. దానికి కాంగ్రెస్ తోడుకావాలి. ఇంకా బాగా ఫలితాలు వస్తాయి. ఆ పని మేం ఒక్కరమే చేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి రాకుండా రేవంత్‌రెడ్డి తగిన నిర్ణయం తీసుకోవాలి' అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇండియాకూటమి పార్టీలను కాంగ్రెస్ సంప్రదించడం లేదు: తమ్మినేని

ఇండియాకూటమిలోని భాగస్వామ్య పార్టీలను కలుపుకుపోయే పని ప్రధానపార్టీగా ఉన్న కాంగ్రెస్ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కానీ కాంగ్రెస్ అలాంటి ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. కలిసొచ్చే పార్టీలతో సంప్రదించే పనిచేయడం లేదన్నారు. ఈసారి భువనగిరిలో సీపీఎం పోటీ చేస్తుందని వివరించారు. తమ అభ్యర్థి ఎండీ జహంగీర్ బాల్యం నుంచి కమ్యూనిస్టు పార్టీలో ఉన్నారని, ఆయనకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

నేడు జహంగీర్ నామినేషన్: ఎస్ వీరయ్య

సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థిగా జహంగీర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య చెప్పారు. అనంతరం ప్రదర్శన, బహిరంగసభ ఉంటుందని, ఈ కార్యక్రమంలో రాఘవులు, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొంటారని వివరించారు.

మరోసారి వాయిదా కోరొద్దు

ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

- వివరాలివ్వడానికి సమయం కావాలన్న తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది
- ఇప్పటికే పలుసార్లు వాయిదా కోరారు
- ఎమ్మెల్యే ఆళ్ల తరపు న్యాయవాదులు
- జూలై 24కు విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు కోట్లు కేసులో విచారణను వాయిదా వేయాలని మరోసారి కోరొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కేసులో చంద్రబాబును ముద్దాయిగా చేర్చాలని.. విచారణను సీబీఐకు అప్పగించాలంటూ మంగళగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను గురువారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా తొలిసారి కేసు విచారణకు హాజరవుతున్నానని.. మరికొన్ని వివరాలు అందజేయాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి న్యాయస్థానానికి నివేదించారు. ఈ నేపథ్యంలో విచారణను మరో రెండు వారాలు వాయిదా వేయాలని కోరారు. దీనికి పిటిషనర్ ఆళ్ల రామకృష్ణారెడ్డి తరపు న్యాయవాదులు ఆర్.బసంత్, రమేశ్ అల్లంకి అభ్యంతరం తెలిపారు. చిన్న చిన్న అంశాలు సాకుగా చూపి ఇప్పటికే పలుసార్లు వాయిదా కోరారన్నారు. ఇదే ధర్మాసనం ముందు కూడా వాయిదా పొందారని గుర్తుచేశారు. పిటిషనర్ వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హైకోర్టులో ప్రతివాదులకు అనుకూలంగానే వచ్చిందని, ఇంకా అదనంగా వివరాలు అందజేయడానికి ఏముంటుందని ప్రశ్నించారు. ప్రతిసారి వాయిదా కోరడం సరికాదన్నారు. అనంతరం రెండు వారాలు వాయిదా వేస్తామని ధర్మాసనం చెప్పగా స్పష్టమైన తేదీని ప్రకటించాలని రామకృష్ణారెడ్డి తరపు న్యాయవాదులు కోరారు. ఈ సమయంలో చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకొని వేసవి సెలవుల అనంతరం కేసును విచారించాలని అభ్యర్థించారు. జూలైకు వాయిదా వేయడం అసలు సరికాదని మరోసారి ఆళ్ల తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. తమ వాదనలు ఇప్పుడే వినాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను జూలై 24న చేపడతామని ధర్మాసనం వాయిదా వేసింది.

చంద్రబాబు, రేవంత్ మరోసారి కుమ్మక్కు: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి కుమ్మక్కయ్యారని ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. విచారణను వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరడం చూస్తేనే ఈ విషయం అర్థమవుతోందన్నారు. ఓటుకు కోట్లు కేసు విచారణ అనంతరం గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఆదేశాల మేరకు నాడు టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి రూ.5 కోట్లకు బేరం కుదుర్చుకొని రూ.50 లక్షలు బయానాగా ఇచ్చిన విషయాన్ని ప్రజలందరూ చూశారన్నారు. సెక్షన్ 39 సీఆర్‌పీసీ ప్రకారం అనుకోని ఘటన, ప్రమాదం జరిగినప్పుడు ఏ పౌరుడైనా పోలీసుస్టేషన్, మేజిస్ట్రేట్ దగ్గరకు వెళ్లొచ్చని.. దీని ఆధారంగానే తాను కోర్టును ఆశ్రయించానని తెలిపారు. 2017లో సుప్రీంకోర్టును ఆశ్రయించానని, తనకు అనుగుణంగా ఆదేశాలు వచ్చినా అనేక సాకులతో చంద్రబాబు న్యాయవాదులు కేసును సాగదీస్తూ వచ్చారని ఆరోపించారు. ఈసారి తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాయిదా కోరడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వారికి బాబు న్యాయవాదులు వత్తాసు పలకడం చూస్తుంటే చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కుమ్మక్కైనట్టు తెలుస్తోందన్నారు. జూలై 24 నుంచి వాదనలు ప్రారంభమవుతాయని, వారిద్దరూ తప్పించుకోలేరని తేల్చి చెప్పారు. ఈ కేసులో చంద్రబాబుకు శిక్ష తప్పదన్నారు.

సాగర్‌లో మిగిలిన నీళ్లు తెలంగాణకు..

- ఏపీకి 5.5 టీఎంసీలు కేటాయించిన కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ
- ఇవిపోను లభ్యత జలాలను రాష్ట్రం వాడుకునేందుకు అనుమతి
- తాగునీటికి మాత్రమే వినియోగించాలని షరతు

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయంలో 500 అడుగుల నీటిమట్టానికి ఎగువన లభ్యతగా ఉన్న 14.195 టీఎంసీల జలాల్లో.. తాగునీటి కోసం ఏపీకి 5.5 టీఎంసీలను కేటాయిస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. అవిపోగా మిగతా జలాలను తెలంగాణ రాష్ట్రం వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చింది. హైదరాబాద్ నగరంతోపాటు పరిసర జిల్లాలకు వేసవిలో తాగునీటిని సరఫరా చేసేందుకు ఈ జలాలను వాడుకోవచ్చని పేర్కొంది. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన ఈ నెల 12న జలసౌధలో సమావేశమైన కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాల మేరకు పలు షరతులతో నీటి విడుదలకు ఆదేశిస్తూ.. కృష్ణాబోర్డు సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ, తెలంగాణ ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నిల్వలు పూర్తిగా అడుగంటిన నేపథ్యంలో.. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే న్యాయోచితంగా నీటిని వాడుకోవాలని స్పష్టం చేశారు. నీటి విడుదల తర్వాత తాగునీటి అవసరాలకే తరలించినట్టు నిర్ధారిస్తూ.. ఇరు రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు కృష్ణాబోర్డుకు సంయుక్త లేఖను సమర్పించాలని సూచించారు.

అసెంబ్లీ రద్దు కావొచ్చు



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్, సబిత , మహమూద్ అలీ, నామా నాగేశ్వర్‌రావు, పోచారం, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల

▶ మొదటి పేజీ తరువాయి

కొంత మంచే జరుగుతుంద'ంటూ కడి యం శ్రీహరి పార్టీ వీడటాన్ని ప్రస్తావించి విమర్శించారు. "2006 కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని పార్టీ మండల అధ్యక్షులు అందరూ కాంగ్రెస్‌కు అమ్ముడుపోయినా భారీ మెజారిటీ సాధించాం. డబ్బులు ఉంటేనే గెలుస్తామనే అభిప్రాయం సరికాదు. ఇప్పటివరకు అందిన సర్వే నివేదికల ప్రకారం రాష్ట్రంలో 8 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తాం. మరో మూడు చోట్ల గెలుపు అవకాశాలు ఉన్నాయి" అని కేసీఆర్ చెప్పారు.

బీఎల్ సంతోశ్‌పై కేసు వల్లే కవిత అరెస్టు..

"ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ఆయన ఆఫీసు దాకా వెళ్లారు. దీనిపై కక్ష సాధింపులో భాగంగా ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారు. కవిత తప్పు చేసినట్టు వంద రూపాయల ఆధారం కూడా చూపలేదు. బీఎల్ సంతోశ్‌పై మనం కేసు పెట్టకపోయి ఉంటే కవిత అరెస్టు ఉండేది కాదు. ఆమెను కుట్రపూరితంగా మద్యం విధానం కేసులో ఇరికించారు" అని కేసీఆర్ పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 400కుపైగా సీట్లతో గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందనే అతి ప్రచారాన్ని సృష్టించారని చెప్పారు. జాతీయ స్థాయిలో వివిధ పార్టీల నేతలతో తాను జరుపుతున్న సంభాషణల ప్రకారం.. మోదీ ప్రాభవం అంతగా లేదని స్పష్టమవుతోందన్నారు. మోదీకి వ్యతిరేకంగా బలమైన నేత లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి నెలకొందని చెప్పారు.

ఈ నెల చివరి వారం నుంచి బస్సు యాత్ర..

ఎన్నికల ప్రచారం కోసం ఈనెల చివరి వారం నుంచి బస్సు యాత్ర చేస్తానని.. సాయంత్రం సమయాల్లో ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు, మూడు చోట్ల రోడ్‌షోలు ఉంటాయని కేసీఆర్ తెలిపారు. రెండు, మూడు వారాల పాటు జరిగే ఈ బస్సు యాత్రలో భాగంగా ఉదయం పూట పంట పొలాలు, కల్లాలు, కొనుగోలు కేంద్రాల సందర్శనతోపాటు వివిధ వర్గాలతో భేటీ అవుతానని వెల్లడించారు. బస్సుయాత్రలో తన వెంట వచ్చే బృందానికి బస ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలకు సూచించారు. సిద్దిపేట, వరంగల్, ఖమ్మం , మహబూబ్‌నగర్‌లలో లక్ష మందితో మినీ సభలు కూడా ఏర్పాటు చేద్దామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ఇస్తే షెడ్యూలు ప్రకటిస్తానని నేతలకు సూచించారు. కేటీఆర్, హరీశ్ హైదరాబాద్ పరిధిలోని నియోజకర్గాల్లో రోడ్ షోలలో పాల్గొంటారని చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించలేదని.. మరో నాలుగు శాతం ఓట్లు అదనంగా వస్తే మెజారిటీ సీట్లు సాధిస్తామని తెలిపారు. ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని చెప్పారు.

ధాన్యం కొనుగోలు చేతకాదు..

"రేవంత్ సందూక్‌లో సరుకు లేదు. ధాన్యం కొనుగోలు, రుణమాఫీ సహా ఏదీ ఈ ప్రభుత్వానికి చేతకాదు. ధాన్యం కొనుగోలును గాడిలో పెట్టేందుకు మనం అధికారంలో వచ్చిన తర్వాత రెండేళ్లపాటు శ్రమించాం. ధాన్యం బహిరంగ వేలంలో అవకతవకలు జరిగాయి. ధాన్యం కొనడం చేతకాక మిల్లర్ల మీద కేసులు బనాయిస్తున్నారు. రైతు సమస్యలపై పార్టీ నాయకులు, కేడర్ ఎక్కడికక్కడ స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద రూ.500 బోనస్ కోసం డిమాండ్ చేయాలి. ధాన్యం కొనుగోలుపై సిద్దిపేట తరహాలో పోస్టుకార్డుల ఉద్యమాన్ని విస్తృతంగా చేపట్టాలి. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో లక్షలాది పోస్టుకార్డులపై ప్రభుత్వ హామీలను గుర్తుకు చేయాలి.." అని పార్టీ శ్రేణులకు కేసీఆర్ సూచించారు. గోదావరి నదిపై ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు కట్టి కర్నాటక, తమిళనాడుకు నీళ్లు తరలించుకుపోయి ఓట్లు దండుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకంగా వెళ్తున్న కేంద్రాన్ని అడ్డుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతేనన్నారు. మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యామ్ కట్టాలన్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తే పార్టీ యంత్రాంగం అంతా అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్త సల్వాజి మాధవరావుపై పెట్టిన అక్రమ కేసులపై తాను సభలో మాట్లాడితే 10వేల మంది సోషల్ మీడియాలో ఆ వీడియో పోస్ట్ చేశారని తెలిపారు.

అభ్యర్థులకు బీ ఫారాలు.. చెక్కుల పంపిణీ

తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కేసీఆర్.. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత పార్టీ లోక్‌సభ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలతో జరిగిన భేటీలో రాజకీయ పరిణామాలు, ఎన్నికల ప్రచార వ్యూహం, ఎజెండా, బస్సుయాత్ర వంటి అంశాలపై చర్చించి.. దిశా నిర్దేశం చేశారు. అనంతరం పార్టీ తరఫున పోటీ చేస్తున్న 17 మంది లోక్‌సభ అభ్యర్థులకు బీ ఫారాలను, ఎన్నికల ఖర్చు కోసం రూ.95లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక అభ్యర్థి నివేదితకు బీ ఫారం, రూ.45 లక్షల చెక్కును అందజేశారు.

..మళ్లీ గెలిపించండి

▶ మొదటి పేజీ తరువాయి

అందించిన నిధులు, సిద్దిపేట జిల్లా ములుగులో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వన విశ్వవిద్యాలయం, ములుగు జిల్లాలో ఏర్పాటు చేయబోతున్న సమ్మక్క, సారక్క గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం, బీబీనగర్ ఎయిమ్స్, హైదరాబాద్ ఐఐటీ, పశువుల ఔషధాలకు సంబంధించి పరిశోధనల కోసం నిర్మించిన దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్ తదితరాలను వివరించారు.

మరోసారి ఆశీర్వదిస్తే ఐదేళ్లు సేవ చేస్తా

సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడిగా తన నియోజకవర్గంలో, జంట నగరాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను కూడా కిషన్‌రెడ్డి తెలియజేశారు. మరోసారి ప్రజలు తనను ఆశీర్వదిస్తే మరో ఐదు సంవత్సరాలు ఇదే తరహా సేవలు అందిస్తానని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రజల కోసం తపన పడుతున్న కిషన్‌రెడ్డి వంటి నాయకులు ఈ సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. సంస్కారం ఉన్న వారికే ఓటు వేయాలన్నారు. తన ఓటు కిషన్‌రెడ్డికే వేస్తానని చెప్పారు. ప్రముఖ సామాజికవేత్త హనుమంత రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ మంత్రి కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోదీతో విజయన్ రహస్య ఒప్పందం

▶ మొదటి పేజీ తరువాయి

పోరాడుతున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే కేరళ సీఎం విజయన్ మాత్రం కేంద్రంతో పోరాటం చేయకుండా, మతతత్వ బీజేపీతో కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. పైకి సీపీఎం పార్టీకి చెందిన ముఖ్యమంత్రిగా, కమ్యూనిస్టు నాయకుడిగా కనిపిస్తున్న విజయన్ కమ్యూనిస్టు కాదని, కమ్యూనలిస్టు అని వ్యాఖ్యానించారు. వయనాడ్‌లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్‌కు విజయన్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఈడీ, ఐటీ కేసులున్నన్ని రోజులు సీపీఎం కోసం విజయన్ పని చేయరని దుయ్యబట్టారు.


వయనాడ్ ప్రజల అభిమానాన్ని చూసేందుకే వచ్చా..

కేరళ ప్రజలు కష్టపడే మనస్తత్వం కలిగిన వారని, తెలివైన వారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేరళ ప్రజల శ్రమ వల్ల దుబాయ్ లాంటి దేశాలు అభివృద్ధి చెందాయి కానీ కేరళ మాత్రం అభివద్ధి చెందలేదన్నారు. మణిపూర్‌లో వందలాది మంది క్రిస్టియన్లు బీజేపీ గూండాల చేతిలో చనిపోయారని, అయినా మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించలేదని మండిపడ్డారు. కానీ రాహుల్ గాంధీ అక్కడి బాధితులను కలిసి మాట్లాడారని గుర్తు చేశారు. జూన్ 9న రాహుల్ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని, వయనాడ్ ప్రజలు ఓటేసేది ఒక ఎంపీకి కాదని, దేశానికి కాబోయే ప్రధానికి అని అన్నారు. దేశంలో రెండు పరివార్‌ల మధ్య పోరాటం జరుగుతోందని, మోదీ పరివార్‌లో ఈడీ, ఈవీఎంలు, సీబీఐ, ఇన్‌కం ట్యాక్స్, అదానీ, అంబానీ ఉన్నారని పేర్కొన్నారు. అదే ఇండియా పరివార్‌లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు వయనాడ్ కుటుంబ సభ్యులున్నారన్నారు. ఇందిరా, రాజీవ్‌లు దేశం కోసం ప్రాణత్యాగం చేస్తే, సోనియా, రాహుల్ ప్రధాని పదవిని త్యాగం చేశారని చెప్పారు. వయనాడ్ ప్రజలు రాహుల్ గాంధీ వైపు ఉన్నారని, తాను ఇక్కడ ప్రత్యేకంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదని, కేవలం రాహుల్‌పై వయనాడ్ ప్రజల అభిమానాన్ని చూసేందుకే తెలంగాణ నుంచి వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ నుంచి పోటీ చేయాలని తాము రాహుల్‌ని కోరామని, కానీ ఆయన వయనాడ్ వైపే మొగ్గు చూపారని చెప్పారు. గత ఎన్నికల్లో వయనాడ్‌లో 65 శాతం ఓట్లు వచ్చాయని, ఈసారి 75 శాతం ఓట్లు రావాలని ఆకాంక్షించారు. వారణాసి వర్సెస్ వయనాడ్ మధ్య ఇప్పుడు పోరాటం జరుగుతోందని రేవంత్ వ్యాఖ్యానించారు.

జగదభిరాముడికి పట్టాభిషేకం

రాజలాంఛనాలతో ప్రత్యేక పూజలు

- సామ్రాట్ కిరీటధారిగా స్వామివారు
- వేడుకను తిలకించి పులకించిన భక్తజనం
- ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ రాధాకృష్ణన్



పట్టాభిషేకం అనంతరం దర్శనమిస్తున్న శ్రీరామచంద్రుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం యాగశాలలో చతుఃస్థానార్చన హోమం జరిపారు. 10 గంటలకు శంఖు, చక్ర, ధనుర్బాణాలు ధరించిన సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రమూర్తిని మేళతాళాలు, కోలాటం, భక్తుల జయజయ ధ్వానాల నడుమ పల్లకీ సేవగా తీసుకొచ్చి మిథిలా స్టేడియంలోని వేదికపై సింహాసనంలో కొలువుదీర్చారు. శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించేందుకు వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడులను వేద పండితులు వరింపజేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ ముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణపాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్రకిరీటాలను స్వామివారికి ప్రదానం చేశారు. లక్ష్మీదేవిని ఆవాహన చేసి రాజముద్రికను కుడిచేతి వేలికి తొడిగారు. ఆ తర్వాత పూర్తి రాజ లాంఛనాలతో సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి అలంకరించారు. రామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతాదేవికి, రామ మాడను లక్ష్మణుడికి అలంకరించారు. స్వర్ణఛత్రం నీడలో ఎడమవైపు రాజఖడ్గం, కుడివైపున రాజదండంతో శ్రీరాముడు దర్శనం ఇవ్వగా, తిలకించిన భక్తులు పులకించిపోయారు. అనంతరం మండపత్రయంలో మంత్రించిన జలాలను శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకాన్ని పూర్తి చేశారు. చివరగా ముత్యాల దండతో ఆంజనేయుడికి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకలకు హాజరైన గవర్నర్

పట్టాభిషేక వేడుకకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మొదట ఆలయానికి వచ్చిన గవర్నర్‌కు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకోగా పండితులు వేదాశీర్వచనం అందచేశారు. పట్టాభిషేకం పూర్తి కావడంతో.. ఈనెల 23 వరకు జరిగే వసంత పక్ష ప్రయుక్త తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టాలు ముగిశాయి.

రామరాజ్యమే ప్రతి ఒక్కరి ఆశయం కావాలి: గవర్నర్

రామరాజ్యం నిర్మించడమే ప్రతి ఒక్కరి ఆశయం కావాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. రామరాజ్యంలో ప్రతి ఒక్కరి హక్కులకు రక్షణ ఉంటుందని, తప్పులకు చోటులేదని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని చెప్పారు. సమాజంలో కుటుంబాలు మరింత ఐక్యంగా ఉండాలని, తద్వారా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, ఎవరికీ అన్యాయం చేయకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



ద్రోహంతోనే బస్తర్ ఎన్‌కౌంటర్

- మావోయిస్టు పార్టీ దండకారణ్యం ప్రతినిధి రామ్‌కో
- మరణించిన వారిలో 27 మంది పేర్లు ప్రకటన
- మరో ఇద్దరిపై స్పష్టత రావాల్సి ఉందని వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్ బస్తర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు ద్రోహం కారణమని మావోయిస్టు పార్టీ, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్, దండకారణ్యం ప్రతినిధి రామ్‌కో (రామ్‌కో హిచామీ) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే దీనిపై పెద్దగా వివరణ ఇవ్వలేదు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ప్రచారంలోకి వచ్చిన మృతుల పేర్లు సరైనవి కావని పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 29 మంది చనిపోగా, అందులో 27 మంది కామ్రేడ్స్ విషయమై స్పష్టత వచ్చిందంటూ వారి వివరాలు వెల్లడించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉందని రామ్‌కో హిచామీ పేర్కొన్నారు.

మృతులు వీరే..

మావోయిస్టు పార్టీ ప్రకటన ప్రకారం మృతుల వివరాలు ఇలా ఉన్నాయి. 1) శంకర్ (డీవీసీఎం), జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామం, 2) భద్రు(దక్షిణ బస్తర్, కారేగూడెం), 3) అనిత (ఈస్ట్ బస్తర్, ఖోండోస్), 4) వినోద్ (మన్పూర్), 5) రీటా (మన్పూర్), 6) రమేశ్ (బైరాంగఢ్), 7) బచ్చూ (గంగలూర్), 8) సురేఖ (సుదండపల్లి, గడ్చిరోలి జిల్లా), 9) కవిత (నెందూర్), 10) రజిత (ఆదిలాబాద్), 11) భూమే (దక్షిణ బస్తర్ గ్రామం), 12) కార్తీక్ (పశ్చిమ బస్తర్ గ్రామం), 13) రోషన్ (దర్భా డివిజన్) 14) దేవల్(గంగలూరు), 15) దిను (దుర్గా), 16) అన్వేష్ (దక్షిణ బస్తర్‌లోని ఉకుర్ గ్రామం), 17) జనీలా అలియాస్ మోడీ (కొవాడి బస్తర్ కొరెంజెడ్), 18) మడకం సంజీల (బస్తర్ కరక), 19) గీతా తకిలోడు (ఇంద్రావతి), 20) కురసం రాజు (ప్రకేలి), 21) షర్మిల (ఇంద్రావతి బత్వెడ), 22) సునీల (ఇంద్రావతి రేకవై), 23) శాంతిల (ఉత్తర బస్తర్, కుమ్మిగుండా), 24 పింటో (గటుం), 25) బజ్నాత్ (ఉత్తర బస్తర్, వాటేకల్), 26) శీలా (ఇంద్రావతి, ఉత్‌లా), 27) జైనీ (ఉత్తర బస్తర్ వాటేకల్)లు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా ఛోట్ బెటియా పోలీస్‌స్టేషన్ పరిధి బస్తర్ అటవీ ప్రాంతంలో ఈ నెల 16న ఎదురుకాల్పులు జరిగిన సంగతి తెలిసిందే.

రైతుల భూముల వేలం ఆపేశాం

- టెస్కాబ్ వెల్లడి ● మానవపాడులో రికార్డుల పరిశీలన

సాక్షి, హైదరాబాద్/మానవపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల భూముల వేలం ఆపేశామని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలకు సంబంధించి భూముల వేలాన్ని ఆపేసినట్లు టెస్కాబ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వెల్లడించారు. కాగా, ప్రస్తుతం జిల్లాల్లో రైతులకు లీగల్ నోటీసులు జారీ చేసిన అంశంపైనా, ఆ తర్వాత తదుపరి చేపట్టే చర్యలపైనా ఆ ప్రకటనలో స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. రుణాలు చెల్లించని రైతుల భూముల వేలానికి సంబంధించి సాక్షి దినపత్రిక గురువారం సంచికలో.. రైతుల 'వేలం'వర్రీ పేరిట కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. కాగా, గద్వాల జిల్లాలో అధికారులు ఈ కథనంపై స్పందించారు. మానవపాడు మండలం పెద్దపోతులపాడుకు చెందిన చంద్రకాంత్‌రెడ్డి కుటుంబం ట్రాక్టర్ కోసం తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ విషయాన్ని సాక్షి కథనంలో ప్రచురించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మానవపాడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని డీసీసీబీ బ్రాంచ్ మేనేజన్ జితేందర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఆ 106 ఎకరాలు అటవీ శాఖదే..

▶ మొదటి పేజీ తరువాయి

సర్వే నంబర్ 171/3 నుంచి 171/7 వరకు ఉన్న 106.34 ఎకరాలు తమవేనని అబ్దుల్‌ఖాసీం తదితరులు ప్రకటించుకున్నారు. ఈ మేరకు 1981లో జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించారు. జాయింట్ కలెక్టర్ నిరాకరించడంతో 1984లో ఆ భూమిని డీ నోటిఫై చేయాలంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. దీంతోపాటు వరంగల్ మెజిస్ట్రేట్ కోర్టుకు వెళ్లారు. అక్కడ అనుకూలంగా ఆదేశాలు వచ్చినప్పటికీ ఉమ్మడి హైకోర్టు ఆ ఆదేశాలను కొట్టివేసింది. అనంతరం ఆ వ్యక్తి రివ్యూ పిటిషన్ దాఖలు చేయగా.. తెలంగాణ హైకోర్టు ఆ వ్యక్తికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ సుందరేష్ ధర్మాసనం గురువారం ఆదేశాలు వెలువరించింది. భూమి తమదని చెప్పుకోవటానికి ఆ వ్యక్తులకు ఎలాంటి అర్హత లేదని స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్ సమయంలో తెలంగాణ హైకోర్టు, రెవెన్యూ అధికారులు సదరు వ్యక్తులకు అనుకూలంగా నివేదికలు ఇవ్వడం.. సుప్రీంకోర్టులోనూ అనుకూలంగా రిజాయిండర్ దాఖలు చేయడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. వాద, ప్రతివాదులకు జరిమానా విధిస్తూ అడవుల ప్రాముఖ్యత తెలుసుకోవాలని సూచించింది. అడవుల ప్రాధాన్యతను గుర్తించడంలో మనుషులకు 'మతిమరుపు' ఉంటుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. అడవులు నిస్వార్థంగా మాతృసేవ అందిస్తున్నప్పటికీ ప్రజలు నాశనం చేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. అడవులను పరిరక్షించడం మనుషుల బాధ్యత అని వాటి క్షీణత వల్ల తామే నష్టపోతామన్న విషయాన్ని గుర్తెరగాలని సూచించింది. పర్యావరణ కేంద్రీకృత విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలని తెలిపింది.

అఫిడవిట్లు దాఖలు చేసిన అధికారులపై చర్యలు: డీఎఫ్‌ఓ

ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా అఫిడవిట్‌లను దాఖలు చేసిన అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు డీఎఫ్‌ఓ వసంత తెలిపారు. ఈ కేసులో అటవీశాఖ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, ఏఓఆర్ శ్రావణ్‌కుమార్ వాదించారు. ఈ కేసులో సుప్రీంకోర్టులో వాదనలు జరిగిన సందర్భంగా అటవీశాఖ ఆ భూములు తమ శాఖకే చెందుతాయని వాదించగా, రెవెన్యూ శాఖ మాత్రం ఆ భూమిపై ప్రైవేట్ వ్యక్తికే హక్కులున్నాయని అఫిడవిట్లు దాఖలు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రం నుంచి రెండు ప్రభుత్వ శాఖలు విభిన్న వాదనలు వినిపించగా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒకే వాదనను దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని గత అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ దాఖలు చేసిన అఫిడవిట్‌లో సదరు 106.34 ఎకరాలను అటవీ భూమిగా స్పష్టంచేశారు. ఈ వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించి దాన్ని అటవీ భూమిగా గుర్తిస్తూ తీర్పు వెలువరించినట్లు వసంత తెలిపారు. ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.300 కోట్ల వరకు ఉంటుంది.

ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారింది

టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో గందరగోళం జరిగితే దానికి ఎన్నికల కమిషనే బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో నియమ నిబంధనల ప్రకారం మజీద్, దేవాలయాలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదని ఈసీ స్పష్టం చేసిందని, అయితే అయోధ్య రామ మందిరంలో జరిగిన ఘట్టం గురించి ఎన్నికల మీటింగ్‌లో మోదీ మాట్లాడారని తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని నిరంజన్ చెప్పారు.

మద్దికుంటకు జీఎస్ఐ అధికారులు

- నీటి, మట్టి నమూనాల సేకరణ



నీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మద్దికుంటలో క్యాన్సర్ బాధితులపై 'పల్లె కడుపున రాచపుండు'శీర్షికన ఫిబ్రవరి 5న 'సాక్షి'మెయిన్‌లో ప్రచురితమైన కథనంపై జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అధికారులు స్పందించారు. హైదరాబాద్ నుంచి జీఎస్ఐ సదరన్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కేవీ మారుతి ఆధ్వర్యంలో డైరెక్టర్ సంగ్రామ్ నాయక్, సీనియర్ జియాలజిస్ట్ జి.రమేశ్‌ల బృందం గురువారం మద్దికుంట గ్రామాన్ని సందర్శించింది. అక్కడి నీటి, మట్టి నమూనాలను సేకరించారు. వీటిని ల్యాబొరేటరీకి పంపి పరిశోధనలు నిర్వహిస్తామని 'సాక్షి'కి చెప్పారు. ఫలితాలు వెల్లడైన తర్వాతే వివరాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భజల శాఖ అధికారి సతీష్ యాదవ్‌ను కలిసి ఇక్కడి పరిస్థితులపై చర్చించారు. మద్దికుంటలో ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ సమస్యలతో పలువురు చనిపోవడం, మరికొందరు వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్న నేపథ్యంలో 'సాక్షి'కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి వెళ్లారు. తాజాగా జీఎస్ఐ అధికారులు రావడంతో గ్రామంలో ఈ పరిస్థితికి కారణాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు ఆశిస్తున్నారు.


కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు సుభిక్షం: వర్రె వెంకటేశ్వర్లు



జనగామ: కాంగ్రెస్ పాలనలోనే దేశ ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జనగామ జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వం జారీచేసిన జీఓలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా, ఆన్‌లైన్‌లో పెట్టేందుకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్‌కు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఈ చట్టం సమగ్రంగా అమలవుతుందని చెప్పారు.

నీటి వనరుల రక్షణకు ఏం చర్యలు చేపట్టారు?

- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి
- సుమోటో పిల్ విచారణలో ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నీటి వనరుల పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న భూ కబ్జాదారులను అడ్డుకునేందుకు తీసుకున్న చర్యలు, వాటి పరిరక్షణకు ఏం చేస్తున్నారో వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హోంశాఖ, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శులు, హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ మహానగరం దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, కుంటలను ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తూపోతున్నారని.. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని.. ఇది ఇలాగే కొనసాగితే త్వరలోనే నీటి వనరులు లేని నగరంగా హైదరాబాద్ మారే ప్రమాదం ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణ చేపట్టి యుద్ధప్రాతిపదిక ప్రభుత్వం నీటి వనరుల రక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నాలాలు, చెరువులు, కుంటల ఆక్రమణ, వాటి దుస్థితిని వివరించారు. ఈ లేఖను సీజే ధర్మాసనం సుమోటో పిల్‌గా విచారణ చేపట్టేందుకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

ఈ నెల 22న ఇంటర్ ఫలితాలు!

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22వ తేదీన ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఫలితాల వెల్లడిపై ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా తేదీని ప్రకటించనున్నట్టు బోర్డు కమిషనర్ శృతి ఓజా 'సాక్షి'ప్రతినిధికి తెలిపారు. ఆది, లేదా సోమవారం ఫలితాలను వెల్లడించాలనుకుంటున్నామని, ఎక్కువ శాతం సోమవారమే ఉండొచ్చని ఆమె చెప్పారు. ఫలితాలకు సంబంధించి అన్ని దశల్లోనూ పరిశీలన పూర్తయిందని, ఎలాంటి లోటు పాట్లు లేవని భావించిన నేపథ్యంలోనే ఫలితాల వెల్లడికి రంగం సిద్ధం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 10 లక్షల మంది హాజరయ్యారు. మార్చి 6వ తేదీ నుంచే మూల్యాంకన ప్రక్రియ మొదలు పెట్టారు. దాదాపు 60 లక్షల సమాధాన పత్రాల మూల్యాంకనను మార్చి నెలాఖరుతో పూర్తి చేశారు. ఈ నెల మొదటి వారంలో ఓఎంఆర్ షీట్ల డీ కోడింగ్ చేశారు. మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత అన్ని విధాలా పరిశీలన చేశారు. ఎలాంటి సమస్యలు లేకపోవడంతో అధికారికంగా విడుదల చేయడానికి రంగం సిద్ధం చేశారు.

సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్

సాక్షి, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ సత్తా చాటింది. తమ వద్ద కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో అయాన్ జైన్ 16వ ర్యాంక్, కేఏ.చందన 50వ ర్యాంక్ సాధించడంతోపాటుగా 104, 138, 155, 162, 196, 202, 260, 307, 444, 480, 649, 756, 780, 790, 833, 887, 892, 914 ర్యాంకుల్ని సొంతం చేసుకున్నారని స్టడీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ద్వారా సివిల్స్‌లో విజయం సాధించిన ఎంతో మంది ఉన్నతస్థానాల్లో ఉన్నారని వెల్లడించారు. సివిల్స్ ఫలితాల్లో విజేతలకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు దేశంలోనే రెండవ స్థానం

ఈడబ్ల్యూఐహెచ్ఈఆర్ ర్యాంకింగ్ విడుదల

రాయదుర్గం: ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్(ఈడబ్ల్యూ హెచ్ఈఆర్) 2024–25 ర్యాంకింగ్‌లో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు రెండో స్థానం దక్కింది. మొదటిస్థానంలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) పిలానీ నిలిచింది. 1998లో గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన ఈ ట్రిపుల్ ఐటీలో దేశంలోనే అత్యుత్తమ బోధన, ప్లేస్‌మెంట్లు, కోర్సుల నిర్వహణ, నూతన ఆవిష్కరణల వంటివి కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఆరుగురు పోలీసు అధికారుల సస్పెన్షన్

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో అలసత్వం చూపిన ఆరుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఎ.వి. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్‌ను తప్పించేందుకు పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్‌తో సంప్రదింపులు జరిపినట్లుగా హైదరాబాద్ సీపీ విచారణలో నిర్ధారణ కావడంతో బోధన్ ఇన్‌స్పెక్టర్ బీడీ ప్రేమ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేశ్ మద్యం సేవించి పోలీసు స్టేషన్‌కు రావడంతో విచారణ అనంతరం ఆయనను సస్పెండ్ చేశారు. మరో ఘటనలో జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీసు స్టేషన్‌లో నమోదైన గంజాయి కేసులో ఎస్ఐలు జి.మనోహర్‌రావు ఎ.తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ బి.రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ టి.నరేందర్ అలసత్వంతో వ్యవహరించినట్లు తేలడంతో వారిని సస్పెండ్ చేశారు.

మీ వైఖరేంటో చెప్పండి

- సాహిల్ పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ దాఖలు చేసిన పిటిషన్‌లో పంజగుట్ట పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జూన్ 11కు వాయిదా వేసింది. 'ప్రగతి భవన్ వద్ద రాత్రి ఫ్లైఓవర్‌కు అడ్డంగా బారికేడ్లు పెట్టారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. చీకటి కారణంగా డ్రైవర్ గమనించకపోవడంతో అనుకోకుండా కారు బారికేడ్లకు తాకింది. అంతే తప్ప ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారు. ముందుగా ఇద్దరిని నిందితులుగా పేర్కొని.. తర్వాత ఇష్టం వచ్చినట్లు నిందితులను (ఏ–3 నుంచి ఏ–13 వరకు) చేరుస్తూపోయారు. ఈ కేసులో నాపై నమోదు చేసిన సెక్షన్లు, ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధం'అని సాహిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. డిసెంబర్‌లో ప్రగతిభవన్ ఎదురుగా ఉన్న బ్యారికేడ్లను ఢీకొట్టిన కేసులో సాహిల్‌పై పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఇదే కేసులో దర్యాప్తు నిలిపివేయాలంటూ హనుమాన్ నాని దాఖలు చేసిన పిటిషన్‌లోనూ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

నేటి నుంచి 'విట్' ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు తమిళనాడులోని ప్రతిష్టాత్మక 'వెల్లూరు ఇంజనీరింగ్ టెక్నాలజీ'(విట్) శుక్రవారం నుంచి ఈ నెలాఖరు వరకు పరీక్షలు నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా 125 నగరాలతోపాటు దుబాయ్, మస్కట్, ఖతర్, కువైట్, సింగపూర్, కౌలాలంపూర్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు విట్ సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ 2024 విట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాయవచ్చని పేర్కొంది. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను మే 3వ తేదీన వెల్లడిస్తామని తెలిపింది.



వారితో అను: 'నిశ్చయంగా, నా ప్రభువు తాను కోరిన వారికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు. మరియు (తాను కోరిన వారికి) మితంగా ఇస్తాడు. కాని చాలా మంది ఇది తెలియదు.'

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 19 ఏప్రిల్ 2024

హర్షం నింపే వర్షపు వార్త!

దేశమంతటా ఎండలు మండుతూ, ఉక్కపోతతో జనం చమటలు కక్కుతున్న సమయంలో చల్లటి కబురు. ఈ ఏడాది నైరుతీ ఋతుపవనాలు సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం తెస్తాయట. జూన్‌లో వచ్చే ఋతుపవనాల గురించి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజాగా వెల్లడించిన తొలి అంచనా ఇది. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో దేశంలో సగటున 87 సెంటీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. కానీ, ఈ ఏడాది అదే సమయంలో అంతకన్నా 6 శాతం ఎక్కువగా వర్షం పడుతుందట! నీటిపారుదల వసతులు ఎంత మెరుగుపరిచినప్పటికీ, నైరుతీ ఋతుపవనాల సమయంలో వర్షాలు బాగా పడడం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయోత్పత్తికి చాలా కీలకం. అదను లేని వానలు, వర్షాభావ పరిస్థితుల వల్ల కొత్త చీడపీడలు, పంట తెగుళ్ళు వచ్చే ప్రమాదం ఉంటే, అందుకు భిన్నంగా మంచి వర్షాల వల్ల పంటలు బాగా పండి, ఉత్పత్తి పెరుగుతుంది. అధిక ఉత్పత్తితో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుతుంది. అధిక ధరలతో అల్లాడుతున్న సామాన్యుడికి ఊరట లభిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాదారుగా ఉన్న పేరును తగ్గించుకుంటూ, ఎగుమతులపై తరచూ నిషేధాలు విధిస్తున్న మన దేశానికి ఆ బాధ తప్పుతుంది. ఇన్ని కారణాల వల్లనే అధిక వర్షపాతపు ఐఎండీ ప్రాథమిక అంచనాతో అంతటా ఆనందం వెల్లివిరుస్తోంది.

గడచిన 2023లో దేశంలో ఋతుపవనాల ప్రభావం అంతంతమాత్రంగా సాగి, 5.6 శాతం మేర వర్షపాతం లోటు ఏర్పడింది. ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయి. ఈసారి వర్షానికి లోటుండదనీ, సాధారణం కన్నా ఎక్కువగానే వర్షాలు కురుస్తాయనీ అనడం సాంత్వన. మబ్బులు ఏర్పడకుండా చేసి, వర్షపాతాన్ని నిరోధించే ఎల్ నినో పరిస్థితులున్నాయనీ, వర్షాభావంతో కరవు రావచ్చనీ వినిపిస్తున్న సమయంలో ఐఎండీ అంచనా అన్ని వర్గాలకూ ఓ తీపికబురు. 'ఎల్ నినో' బలహీనపడ్డాక, దానికి పూర్తిగా వ్యతిరేకమైన 'లా నినా' పరిస్థితులు ఏర్పడడంతో భారత ఉపఖండంపై ఋతుపవనాలు బలంగా వ్యాపిస్తాయని ఆశిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో అనువైన డైపోల్ పరిస్థితులు (తూర్పు హిందూ మహాసముద్రంతో పోలిస్తే అరేబియా సముద్రంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవడం), ఉత్తరార్ధ గోళంలో సాధారణం కన్నా తక్కువ మంచు లాంటివి కూడా తోడై, వర్షపాతానికి సానుకూలంగా ఉంటాయట. అయితే చిన్న మెలిక ఏమిటంటే ఈ తొలి అంచనా ప్రకారం నైరుతీ ఋతుపవనాలు అన్ని ప్రాంతాలకూ ఒకే విధంగా విస్తరించకపోవచ్చు. ఈశాన్య, వాయవ్య, తూర్పు ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతమే నమోదు కావచ్చట!

హెచ్చుతగ్గులు ఎలా ఉన్నా మొత్తం మీద ఐఎండీ అంచనా నిజమై, ఋతుపవనాలు చురుగ్గా ఉండి, మంచి వర్షాలు పడితే అనేక విధాల లాభం. ఇప్పటికీ మనది ప్రధానంగా వ్యవసాయాధార దేశం. మన దేశంలోని శ్రామికశక్తిలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. ఒకవేళ నిరుటి లానే ఈ ఏడాదీ సరైన వర్షాలు లేకుంటే, ఇప్పటికే తగ్గిన గ్రామీణ ఆదాయాలు మరింత పడిపోతాయి. అదే గనక సమృద్ధిగా వర్షాలు కురిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. దేశంలో మొత్తం సాగునీటి పారుదలలో 60 శాతం బోరు బావుల ద్వారా జరుగుతున్నదే. అందులోనూ ఏటా నైరుతీ ఋతుపవనాల సమయంలోనే నూటికి 75 పాళ్ళు ఈ భూగర్భ జలాలు పుంజుకుంటాయి. అందుకే, ఈ వర్షాలు కీలకం. అలాగే, అధిక వర్షపాతంతో తాగునీటి కొరత తీరుతుంది. బెంగుళూరు నీటి కొరత లాంటి దృశ్యాలు కనిపించవు. రిజర్వాయర్లు నిండి జలవిద్యుదుత్పత్తి హెచ్చవుతుంది. అందువల్లనే ఈసారి వర్షాలు బాగుంటాయన్న అంచనా వెలువడగానే ఆశలు మోసులెత్తుతున్నాయి.

ప్రతిసారీ పరిస్థితులు ఆశాజనకంగా ఉండకపోవచ్చు. వ్యవసాయానికై అతిగా ఋతుపవనాల్ని నమ్ముకోవడమూ ఏటా అదృష్టపరీక్షే అవుతుంది. కాబట్టి, ఈసారి వర్షాలు బాగుంటాయి కదా అని ఊరుకోకుండా, వర్షపాతంలో ప్రాంతీయ మార్పులకు అతీతంగా పురోగమించడానికి చేయగలిగిందేమిటో ఆలోచించాలి. అలాగని భూగర్భ జలాల అతి వినియోగమూ నష్టమే. మన జలవినియోగ పద్ధతులపై పర్యాలోచన జరపాలి. అనూహ్య వాతావరణ మార్పులు సంభవిస్తున్న వేళ దీర్ఘకాలిక సవాళ్ళు తప్పవు. గత ఏడాది 365 రోజుల్లో 318 రోజులు దేశంలో ఏదో రకంగా భీకర వాతా వరణ ఘటనలు నమోదయ్యాయి. దాదాపు 22.1 లక్షల హెక్టార్ల పంట భూమి దెబ్బతింది. ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించింది. ఈ ఏప్రిల్ మొదటికి మన ప్రభుత్వం వద్ద 75 లక్షల టన్నుల గోదుమలే ఉన్నాయి. గడచిన 16 ఏళ్ళ కాలంలో ఈ సమయానికి ఇంత తక్కువ నిల్వలుండడం ఎన్నడూ లేదు. ఇలాంటి కారణాల వల్లనే... వచ్చే ఋతుపవనాలు, ఆపైన వచ్చే ఖరీఫ్ దిగుబడి కీలకమయ్యాయి.

లోటు వర్షపాతం వల్ల వ్యవసాయ రంగమే కాదు, సాధారణ జీవనమూ దెబ్బతింటుంది. గత ఏడాది వర్షాలు సరిగా లేక 2022తో పోలిస్తే రిజర్వాయర్లలో నీటిమట్టం 19 శాతం తగ్గింది. ఇది దశాబ్దకాలపు సగటు కన్నా 8 శాతం తక్కువ. ప్రస్తుతం దేశంలోని సగం ప్రధాన రిజర్వాయర్లలో నీటిమట్టం 40 శాతం కన్నా తక్కువే ఉందని కేంద్ర జలసంఘం చెబుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది దండిగా వానలు కురిస్తే ఆ వాన నీరు వృథా కాకుండా భూగర్భ నీటిమట్టాలు పెరిగేలా ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టాలి. జలాశయాలన్నీ నిండుకుండల్లా కళకళలాడేలా చూసుకోవాలి. ఏటేటా వర్షం కోసం ఆశగా ఆకాశం వైపు చూడడం కాకుండా, దీర్ఘకాలిక జలసంరక్షణ విధానాలను ఆశ్రయించడం మేలు. అధిక నీటి వసతి అవసరమయ్యే వ్యవసాయ పద్ధతుల నుంచి క్రమంగా పక్కకు జరగాలి. మరో నెలలో ఐఎండీ నుంచి రెండో అంచనా వెలువడుతుంది. దానితో ఈసారి వర్షంపై మరింత స్పష్టత వస్తుంది. ఈలోగా విధాన నిర్ణేతలు అన్నిటికీ సిద్ధం కావడం తెలివైన పని.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.8.45 వరకు, తదుపరి ద్వాదశి,
నక్షత్రం: మఖ ఉ.11.54 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.8.45 నుండి 10.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.14 వరకు,
అమృతఘడియలు: ఉ.9.16 నుండి 10.43 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.12
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

ముసుగులో గుద్దులాట కొనసాగేనా?

విశ్లేషణ



నవదీప్ సూరి

ఒకవైపు ఇజ్రాయెల్... మరోవైపు ఇరాన్, దాని భాగస్వాములు, ప్రచ్ఛన్న ప్రతినిధుల మధ్య సాగుతున్న ముసుగులో గుద్దులాటను ఒక స్థాయి వరకే కొనసాగించవచ్చు. ఏప్రిల్ 13 రాత్రి ఇజ్రాయెల్ వైపుగా కమికేజ్ డ్రోన్లు, క్షిపణులను ఇరాన్ ప్రయోగించడంతో ఆ తెర తొలగింది. తన 'జియోనిస్ట్ శత్రువు'కు వ్యతిరేకంగా నాలుగున్నర దశాబ్దాల ఆవేశపూరిత వాగాడంబరం సాగించిన ఇరాన్ నిజానికి ఇజ్రాయెల్ భూభాగంపై దాడి చేయడం ఇదే మొదటిసారి. దీంతో లక్ష్మణరేఖను దాటినట్లయింది. ఇజ్రాయెల్ ప్రతీకారదాడి ఈ ప్రాంతాన్ని అగాథంలోకి తోస్తుంది. కానీ నిజంగా పరిస్థితి అలా ఉందా? మనం చాలా కాలంగా చూస్తున్న ముసుగులో గుద్దులాట నాటకంలో సరికొత్త అంకాన్ని చూస్తున్నామా అనేది ప్రశ్న.

ప్రస్తుతం ఏడవ నెలలో అడుగుపెట్టిన గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం, ఏ సమయంలో అయినా విస్తృతమైన ప్రాంతీయ పెనుమంటగా మారే ప్రమాదాన్ని కలిగివుంది. అయితే, పాలస్తీనా సమస్య పరిష్కారానికి మద్దతుగా ఇరాన్ తరచుగా చేసే తీవ్రమైన బెదిరింపుతో కూడిన ఆగ్రహ ప్రకటనలు, ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్న ఒక అంతర్లీన వాస్తవాన్ని దాచిపెడుతున్నాయి. దాని అత్యున్నత నాయకుడైన అయతొల్లా అలీ ఖొమేనీ నేతృత్వంలోని ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం వాస్తవానికి చాలా జాగ్రత్తగానూ, ప్రమాదాన్ని కోరి ఆహ్వానించని తత్వంతోనూ సాగుతోంది. పైగా ముఖాముఖి ఘర్షణకు అది పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దాడి నిరోధం దిశగా ఇరాన్ ఇష్టపడే విధానం ఏమిటంటే, స్నేహపూర్వకంగా లేని దేశాలకు హెచ్చరికలను పంపడానికి తన ప్రతినిధుల (ప్రాక్సీలు) ద్వారా అసమాన యుద్ధంలో దాని అధునా తన సామర్థ్యాలను అమలు చేయడమే. ఒక పాత హిందీ పాటలోలా 'అర్థమయ్యేవాళ్లకు అర్థమైంది' అనేది దాని కార్యాచరణ సూత్రం.

టెహ్రాన్ లేదా దాని ఖుద్స్ బలగాలను హమాస్ దాడులతో అనుసంధానించడానికి తగిన నిర్ధారిత సాక్ష్యాధారం లేనప్పటికీ, అక్టోబరు 7న హమాస్ చేసిన దాడి వెనుక ఇరాన్ హస్తం ఉందని చాలామంది ఊహించారు. గాజాకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తన విధ్వంసక దాడిని ప్రారంభించినప్పుడు, లెబనాన్ నుండి ఇజ్రాయెల్ భూభాగాలను లక్ష్యంగా చేసుకోవడానికి హెజ్బొల్లాకు చెందిన యుద్ధంలో రాటుదేలిపోయిన క్యాడర్‌లను ఇరాన్ పంపుతుందనే ఆందోళన వాస్తవంగానే ఉండింది. అలాగే, గాజాలోని తన హమాస్ మిత్రపక్షానికి మద్దతు ఇవ్వడానికి ఇరాన్ రెండవ ఫ్రంట్‌ను ప్రారంభించవచ్చని కూడా భావించారు. ఏమైనప్పటికీ, ఆరు నెలల తరువాత కూడా, ఇరాన్, హెజ్బొల్లా రెండూ ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దులోని లెబనాన్‌లో తమ హద్దులలోనే కొనసాగుతూ అసౌకర్యమైన సమతౌల్యాన్ని కొనసాగించాయి. హెజ్బొల్లా వద్ద ఉన్న మారణాయుధాలు ప్రధానంగా ఉత్తర ఇజ్రాయెల్‌లో ఇప్పుడు జనాభా లేని గ్రామాలు, స్థావరాలకు వ్యతిరేకంగా ఉపయోగించబడ్డాయి. దక్షిణాన కొన్ని మైళ్ల దూరంలో ఉన్న సైనిక, పౌర లక్ష్యాలు హెజ్బొల్లా క్షిపణుల పరిధిలో ఉన్నప్పటికీ వాటిని తాకలేదు. వివాదాన్ని హెజ్బొల్లా తీవ్రతరం చేస్తే లెబనాన్‌పై భయంకరంగా స్పందిస్తానని ఇజ్రాయెల్ హెచ్చరించింది. లెబనాన్, సిరియాలోని అగ్రశ్రేణి హెజ్బొల్లా సముదాయం, సైనిక సంపత్తి లక్ష్యంగా వైమానిక దాడులు చేసింది. అయితే హెజ్బొల్లాపై నేరుగా దాడి చేయడానికి ఇజ్రాయెల్ సైతం దూరంగానే ఉంది.

సంవత్సరాల తరబడి ఇరాన్‌చే జాగ్రత్తగా పోషించబడిన మరొక ప్రచ్ఛన్న శక్తి యెమెన్‌లోని హౌతీలు. ఎర్ర సముద్రంలోని సముద్ర మార్గాలలో వాణిజ్య నౌకలతో విధ్వంస క్రీడ ఆడటానికి తమ డ్రోన్‌లను, క్షిపణులను హౌతీలు సానబెట్టారు. హౌతీల ఆయుధ నిల్వలు,



శిక్షణ, వ్యూహాల మూలాల గురించి పెద్ద సందేహమేం లేదు. అయితే రింగ్‌మాస్టర్‌గా ఉండటంలోనే ఇరాన్ సంతృప్తి చెందుతూ, పశ్చిమ దేశాలు తనపట్ల శత్రు వైఖరితో కొనసాగితే విఘాతం కలిగించగలిగే ప్రభావాన్ని నిశ్శబ్దంగా నొక్కిచెప్పింది.

అయితే, ఏప్రిల్ 1న డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన కాన్సులర్ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిపి... సిరియా, లెబనాన్‌లలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు చెందిన ఖుద్స్ బలగాల అధిపతి హసన్ మహ్దవీని చంపినప్పుడు ఆ పెఖసైన సమతుల్యత దెబ్బతింది. అత్యంత కచ్చితంగా తలపెట్టిన ఈ దాడి మహ్దవీతో పాటు ఆరుగురు స్వదేశీయులను కూడా మట్టుబెట్టడం, ఇరాన్ ప్రభుత్వాన్ని మండించింది. 2023 డిసెంబర్‌లో కూడా సిరియాలో ఇరాన్ సీనియర్ కమాండర్ అయిన సయ్యద్ రజీ మౌసావీని ఇజ్రాయెల్ హతమార్చింది. టెహ్రాన్ లోని అతివాదుల నుంచి తీవ్రమైన ఒత్తిడి పెరిగింది కాబట్టే నాయకత్వం చేసే తీవ్రమైన ప్రతీకార బెదిరింపులు ఇప్పుడు గట్టి చర్యతో సరిపోలాల్సి ఉంది మరి.

చివరికి ఏప్రిల్ 13న తాను తలపెట్టదలచిన సైనిక చర్య గురించి దాదాపు రెండు వారాల పాటు టెలిగ్రాఫ్ ద్వారా ఇరాన్ ప్రభుత్వం సూచిస్తూనే వచ్చింది. ఈద్-ఉల్-ఫితర్ ఉత్సవాలు ముగిసిన వెంటనే దాడి జరుగనున్నట్లు విస్తృతమైన అంచనాలు వెలువడ్డాయి. అలాగే జరిగింది కూడా. ఈ ప్రాంతంలోని దేశాలకు 72 గంటల నోటీసు ఇచ్చామనీ, విమానాలను నిలిపివేయడానికీ, వారి పౌరులకు హెచ్చరికలు జారీ చేయడానికీ భారత్ సహా ఇతర దేశాలకు తగినంత సమయం ఇచ్చామనీ ఇరాన్ ధ్రువీకరించింది. ఇరాన్ ప్రయోగించిన '99 శాతం' డ్రోన్లు, క్షిపణులను... బలీయమైన ఇజ్రాయెల్ ఐరన్ డోమ్, ఇతర వైమానిక రక్షణ వ్యవస్థలు, అలాగే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆఖరికి జోర్డాన్‌తో సహా అనేక మిత్రదేశాలు విజయవంతంగా అడ్డుకోవడంలో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. 80కి పైగా డ్రోన్లు, ఆరు బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ విడుదల చేసిన ప్రకటన ధ్రువీకరించింది. నెగెవ్ ఎడారిలోని ఒక ఇజ్రాయెలీ వైమానిక స్థావరంలో స్వల్పంగా నష్టం వాటిల్లింది. ప్రస్తుతానికి, ఈ దాడి ఇరాన్ సామర్థ్యాలకు నిజమైన ప్రతిబింబం కాదు లేదా ఇజ్రాయెల్ వైమానిక రక్షణకు నిజమైన పరీక్ష కాదు.

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహుకు ఇంతకంటే మంచి సమయం ఉండదు. గత వారాంతం వరకు, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి మిత్రదేశాలు గాజాలో జరుగుతున్న అనాలోచిత విధ్వంసం గురించీ, అక్కడి ప్రజల బాధల గురించీ తీవ్రంగా విమర్శిస్తున్నాయి. కానీ ఇరాన్ దాడి జరిగిన కొన్ని గంటల్లోనే, అమెరికా యంత్రాంగం ఇజ్రాయెల్‌కు తన 'గట్టి మద్దతు'ను పునరుద్ఘాటించింది. భవిష్యత్ ప్రమాదాలను నిరోధించడానికి బ్రిటన్, ఫ్రాన్స్ తమ నావికా సంపత్తిని మోహరించాయి. శత్రుదుర్భేద్యమైనదని పేరొందిన ఇజ్రాయెల్ రక్షణ శక్తుల ఖ్యాతి అక్టోబరు 7న హమాస్ దాడితో కాస్త దెబ్బ తిన్నప్పటికీ, తాజాగా ఇరాన్ ప్రయోగించిన డ్రోన్‌లను, క్షిపణులను అధిక సంఖ్యలో తటస్థీకరించడంలో విజయం సాధించడం ద్వారా మళ్లీ తన్ను తాను నిలబెట్టుకోగలిగింది. గాజా ప్రస్తుతానికి మీడియాలో పతాక శీర్షికలకు దూరంగా ఉంది. అంతేకదా! అమెరికా, భారత్, ఇతర దేశాలు తిరుగుదాడి పట్ల సంయమనం పాటించాలనీ, లేకుంటే అది మరింతగా పెరుగుతుందనీ హెచ్చరించడంతో నెతన్యాహు మళ్లీ కేంద్ర స్థానంలోకి చేరుకున్నారు.

తన షాడో-బాక్సర్లు బలంగా పంచ్‌లు విసిరినందున, దాడుల నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నాననీ, అయితే ఇజ్రాయెల్ ప్రతీకార చర్యలకు దిగినట్లయితే తాను గట్టిగా ప్రతిస్పందిస్తాననీ ఇరాన్ సూచించింది. ఇక, ఇజ్రాయెల్‌లో రాజకీయ పార్టీలు నిలువునా చీలిపోయాయి. ప్రమాదకరమైన గీతను దాటినందుకు ఇరాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని రైట్ వింగ్ నాయకులు కోరుతున్నారు. ఇజ్రాయెల్ ప్రతిఘటనను ప్రారంభించడానికి 'వెంటనే కదలాలి' అని జాతీయ భద్రతా మంత్రి బెన్-గ్విర్ సూచించారు. మధ్యప్రాచ్యంలో భావితరాలు కూడా గుర్తుంచుకునేలా ఇజ్రాయెల్ గట్టిగా ప్రతిస్పందించాలని ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ పిలుపునిచ్చారు. బెన్నీ గాంట్జ్, రక్షణ మంత్రి యోవ్ గాలంట్ వంటి మితవాదులు తీవ్రమైన ప్రతిచర్యకు వ్యతిరేకంగా సలహా ఇచ్చారు. బదులుగా ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం పెంచుకోవాలని సూచించారు. దేశ రాజకీయాలకు వ్యతిరేకంగా అమెరికా పెడుతున్న ఒత్తిడిని బేరీజు వేసుకుని, తీవ్ర పర్యవసానాలు కలిగివుండే ఒక ప్రతిస్పందనను నెతన్యాహు రూపొందించనున్నందున రాబోయే కొద్ది రోజులు కీలకం కానున్నాయి.

వ్యాసకర్త ఈజిప్ట్, యూఏఈల్లో భారత మాజీ రాయబారి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మన ఘనత



ఇవాళ (ఏప్రిల్ 18) ప్రపంచ వారసత్వ దినోత్సవం. ఇవాళ మనం భారతదేశ అద్వితీయ సంస్కృతి, ఘన చరిత్రను ఉత్సవం చేసుకుంటున్నాం. అలాంటి వారసత్వ సంస్కృతిలో భాగం అయినందుకు గర్వంగా భావిస్తున్నాను.

– సైనా నెహ్వాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

అమ్మలంతే!



తొమ్మిది నెలల తర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. అమ్మకు బాగా సంతోషం కలిగించిన విషయం ఏమిటంటే, ఆఫీసులో భోజనం వాళ్లే ఉచితంగా పెట్టడం. అంతేతప్ప, నా కెరియర్ గానీ, జీతం గానీ కావు.

– కావ్య, ఉద్యోగిని


విధిస్తే మాత్రం?



కోరలు లేని యూరోపియన్ యూనియన్ శుష్కచర్యల్లో దిట్ట. ఎలాంటి వివరాలు విడుదల చేయకుండానే... ఇరాన్ డ్రోన్, క్షిపణి కార్యక్రమాల మీద తన ఆంక్షలను ప్రకటించింది. నిజం ఏమిటంటే, కఠినమైన పాశ్చాత్య ఆంక్షలు ఉన్నప్పటికీ డ్రోన్, క్షిపణి వ్యవస్థల్లో ఇరాన్ వేగంగా అభివృద్ధి సాధించింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

చదవాల్సినవి చదవాలి!



మంచి సమర్థత ఉండీ, మంచి జ్ఞానం ఉండీ, బాగా చదవగలిగీ పరీక్షల్లో మంచి మార్కులు రాని విద్యార్థితో రాహుల్ గాంధీని పోల్చవచ్చు. ఎందుకంటే అతడికి సిలబస్ మీద ఫోకస్ లేదు.

– గుర్చరన్ సింగ్, ఆర్థికవేత్త

అదో ప్రదర్శన



నేను ఇటీవల బోస్టన్ (యూఎస్)లోని ఒక ధనిక ప్రాంతం మీదుగా ప్రయాణించాను. మొత్తం శ్రామిక వర్గపు నల్లవాళ్ల ప్రాంతంలో కనబడినన్ని 'బ్లాక్ లైవ్స్ మ్యాటర్' జెండాలు ఈ ఒక్క వీధిలోనే కనిపించాయి. వీళ్లంతా తెల్లవాళ్లని అనుకుంటే, వీళ్లెటూ తమ బుడగల్లోంచి బయటకు రారు. కానీ వాళ్ల సామాజిక వర్గంలో తమ హోదాను పెంచుకోవడానికీ, తమ భావజాలాన్ని విశ్వసించనివారి నుంచి ప్రత్యేకంగా చూపుకోవడానికీ ఈ జెండాలు పనికొస్తాయనిపించింది.

– ఆడమ్ బి. కోల్‌మాన్, రచయిత

స్లిప్ ఇస్తే చాలు!



కాంగ్రెస్ గెలుస్తుందా, బీజేపీ గెలుస్తుందా అన్నదానితో నాకు సంబంధం లేదు. కానీ ప్రతీ ఓటరుకూ ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ స్లిప్ ఇవ్వాలని మాత్రం కోరుకుంటాను. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడమే ప్రతి ఒక్కరూ కోరుకునేది!

– సూర్యకాంత్ వాగ్‌మోర్, రచయిత

అదే నైపుణ్యం



చాలా భిన్న రంగాల్లోని నిపుణుల్లో కొట్టొచ్చినట్టు కనబడే ఒకానొక గుణం... వాళ్లు తమ సహజ జ్ఞానాన్ని నమ్ముకుంటారు. కానీ ఇలాంటిదాన్ని మిగతావాళ్లు నేర్చుకోలేరు. వాళ్లకు అది ఎలా పనిచేస్తున్నదంటే... దానిక్కారణం వాళ్లు 'నిపుణులు' కావడమే!

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

ఇన్ బాక్స్

జయోస్తు! దిగ్విజయోస్తు!




అదిగదిగో వస్తున్నాడు జగనన్న...
మనూరి కొస్తున్నాడు జగనన్న
పేదలకు, అన్నార్తులకు దేవుడన్న,
కాలకూటముల కుహనా రాజకీయాలకు
అదరని బెదరని ఉక్కుమనిషి మన 'అన్న'
నవరత్న వజ్ర సంకల్ప సంధాత!
బడుగు బ్రతుకుల్లో వెలుగు ప్రదాత,
వస్తున్నాడదిగో... జనహృదయనేత,
సహృదయ హృదయవిజేత.
జనసాగర తరగలపై తేలియాడుతూ,
మధ్యందిన మార్తండుని కిరణకాంతుల్ని ముద్దిడుతూ,
అవ్వా తాతలు, అక్కచెల్లెళ్ళు, అన్నాతమ్ముళ్ళ కన్నీళ్ళు తుడుస్తూ,
వస్తున్నాడదిగో జన జనార్దనుడు, జనమేజయుడు.
అవ్యాజకరుణ, ప్రేమరసార్ద్రజనజ్యోత,
అందుకో అడుగడుగున మా మనోల్లాస జోత.
ఈ యుగానికి మాకై అరుదెంచిన మహామనిషివి నీవన్నా.
కర్తవ్య దీక్షలో రాజీపడని రాజీవుడ వన్నా
రాజకీయ వినీలాకాశంలో రేచుక్కలు ఎన్ని వున్నా
వెండి వెలుగు జిలుగుల పున్నమి చంద్రుడు నీవే నన్నా.
కుట్రలు, కుహకాలు ఎన్ని పొంచి వున్నా
రేపటి విజయం నీదే నన్నా
అందుకో జన నీరాజనం నీదే నన్నా
ప్రతి పట్టణం, ప్రతి పల్లె జనం నీతోనే నన్నా
ఎవరు అవునన్నా, కాదన్నా
ఆధునిక దీనజనబంధు నీవన్నా,
ఆంధ్రమాత ముద్దుబిడ్డవి జగనన్నా...
నీవే మా అన్న... జగనన్నా!

– శారద శృంగేరి । 94902 6111

నిర్లక్ష్యం తెచ్చిన కరవు పరిస్థితులు

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

గత సంవత్సరం జల వనరులన్నీ కళకళలాడాయని నివేదికలు చెబుతుండగా... ఏడాది తిరగకుండానే తెలంగాణలో కరవు పరిస్థితి కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు గల కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ భయానకంగా మారిపోతుంది. సుదీర్ఘ కాలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం కారణంగా ఉపరితల, భూగర్భ జలాలు క్షీణించినప్పుడు నీటి కరవు ఏర్పడుతుంది. నేలలో తేమ, భూగర్భజలాల లభ్యత పంటల కనీస అవసరాలను తీర్చలేనంతగా పడిపోవడంతో వ్యవసాయానికి నష్టం వాటిల్లినప్పుడు వ్యవసాయ కరవు ఏర్పడుతుంది. ఆహారం, పశుగ్రాసం, తాగునీరు వంటి నిత్యావసర వస్తువుల సరఫరా అందుబాటును బట్టి సామాజిక, ఆర్థికపరమైన కరువు వచ్చినట్లు భావిస్తారు.

ఉపరితల నీటి వనరుల నిలువలు పూర్తిగా తగ్గిపోవడం, భూగర్భ జలాల క్షీణత వల్ల రైతులకు వ్యవసాయానికి నీరు అందడం లేదు. అనేక వేల ఎకరాలలో పైర్లు ఎండిపోయినాయి. ఇది కరవులో మొదటి దశగానే భావించాలి. రెండు నెలలు, ఏప్రిల్, మే దాటినాక జూన్‌లో వర్షాలు పడితే కరవు తగ్గినట్లే. కాని ఆహారం, తాగు నీటి సమస్య అప్పటికే తీరకపోవచ్చు. జూన్ మాసంలో వర్షాలు పడకుంటే కరువు తీవ్రదశలోకి చేరవచ్చు. సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఉంటాయి. వాతావరణంలో ఎల్‌నినో పరిస్థితుల వల్ల రాబోయే వర్షాకాలం వర్షపాతం మీద అనుమానాలు ఉన్నాయి. పట్టణాలలో పేద ప్రజలు నీటి కొరకు నిత్యం కనీసం సగం రోజు వెచ్చించే పరిస్థితి వచ్చింది. ఇప్పటికైతే, తెలంగాణలో కొనుక్కునే కనీస స్థోమత ఉంటే నీరు దొరుకుతున్నది.

తెలంగాణలో సాధారణ వర్షపాతం 906.3 మి.మీ. 2022 జూన్ 1 నుండి 2023 మే 3 వరకు 1387.8 మిమీ వార్షిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో (2022 జూన్ 1 నుండి సెప్టెంబరు 30 వరకు) రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 52 శాతం అధికం. 2023 జూన్ నుంచి 2024 ఏప్రిల్ మధ్య 6 జిల్లాలలో అధిక వర్షపాతం, 3 జిల్లాలలో లోటు, మిగతా 24 జిల్లాలలో



సాధారణ వర్షపాతం నమోదు అయ్యింది. గద్వాల్, నాగర్ కర్నూల్, నల్గొండ జిల్లాలలో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. మరి ఇప్పుడు నీటి కరవు ఏర్పడడానికి కారణం ఏంది? వర్షపాతం సాధారణంగా ఉన్నప్పుడు ప్రభుత్వం కరవుగా కూడా ప్రకటించ లేదు.

2023లో ఒక ఏడాది వ్యవధిలో, తెలంగాణ అసాధారణ వాతావరణ సంఘటనలను చవిచూసింది. జూలై, డిసెంబర్లలో అధిక వర్షాలు, అక్టోబర్‌లో తీవ్ర వర్షాభావం, ఏప్రిల్లో అనేక వడగళ్ల వానలు! ఈ విపరీతమైన విలక్షణమైన సంఘటనలకు ప్రధాన కారణాలు: మారుతున్న వాతావరణ ద్రోణులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వాతావరణ మార్పులు, జలవాయు పరివర్తనం వంటివి. ఎండాకాలంలో పడే వర్షాలు 2024లో ఇప్పటివరకు పడలేదు. కామారెడ్డి, నిజామాబాదు, సిద్దిపేట, మెదక్ జిల్లాలలో ఒక పెద్ద వర్షం వచ్చి పంటలకు నష్టం అయ్యింది. జనవరి, ఫిబ్రవరి నెలలలో వర్షం పడింది చాలా తక్కువ. వేడి ఎక్కువగా ఉండే మార్చి-మే నెలల మధ్య ఇప్పటి వరకు పడిన వర్షం సాధారణం కంటే చాలా తక్కువ. అక్టోబరు నుండి డిసెంబరు వరకు గత సంవత్సరాల్లోని డేటా ప్రకారం, ఈశాన్య రుతుపవనాల సగటు సాధారణ వర్షపాతం 113.20 మి.మీ. అయితే విఫలమైన రుతు పవనాల కారణంగా ఈ ప్రాంతంలో 52.70 మి.మీ. వర్షపాతం నమోదై, వర్షపాతంలో 53.45 శాతం లోటు ఏర్పడింది.

కొన్ని నివేదికల ప్రకారం తెలంగాణలో భూగర్భ జల మట్టం గత 10 సంవత్సరాలలో 56 శాతం అసాధారణంగా పెరిగింది. 2013–23 కాలంలో 83 శాతం మండలాలలో భూగర్భ జల మట్టం 4 మీటర్లకు పైగా పెరిగింది. ఇది దేశంలోనే అత్యధికం అని అప్పట్లో ఢంకా మోగించారు. ఉపరితల నీటి వనరులు పెరిగాయి కనుక భూగర్భ జలాల ఉపయోగం 2013లో 58 శాతం నుండి 2023లో 39 శాతానికి పడిపోయింది అని కూడా చెప్పారు. 'మిషన్ కాకతీయ' కార్యక్రమం కింద వాగులతో పాటు 27,472 చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల, చెరువులను పెద్ద, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులతో అనుసంధానం చేయడం వల్ల, 1,000 చెక్ డ్యామ్‌ల నిర్మాణం వల్ల ఇది సాధ్యం అయిందని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది.

అయితే, ఫిబ్రవరి 2023లో 7.34 అడుగులు ఉన్న సగటు భూగర్భజల మట్టం ఫిబ్రవరి 2024 నాటికి 8.70 అడుగులకు పడిపోయింది. ఒకటే సంవత్సరంలో ఇంతటి భూగర్భ జల వనరులు ఎట్లా తగ్గిపోయాయి? వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం, "2024 మార్చి 27 నాటికి అన్ని ప్రధాన రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వ 287.06 టీఎంసీలు. గత సంవ త్సరం ఇదే రోజున 432.13 టీఎంసీలతో పోలిస్తే ఇది చాల తక్కువ". కేంద్ర జల సంఘం 4 ఏప్రిల్, 2024 నాడు ఇచ్చిన నివేదికలో తెలంగాణలో గమనిస్తున్న 7 రిజర్వాయర్లలో నీటి నిలువ గత సంవత్సరంతో పోలిస్తే 15 శాతం మాత్రమే తగ్గింది. ఈ 7 రిజర్వాయర్లలో మొత్తం నీటి నిలువ సామర్థ్యంలో ఏప్రిల్ మాసం నాటికి 40 శాతం గత సంవత్సరంలో ఉంటే, ఈ సారి 25 శాతం మాత్రమే ఉన్నది. గత ఐదేళ్ళలో నీటి లభ్యతలో, నిలువ లలో తీవ్రమైన హెచ్చుతగ్గులు గమనిస్తే, నీటి భద్రత అనిశ్చితంగా ఉండడం ఆశ్చర్యం కలిగించాలి.

జలశక్తి మంత్రిత్వ శాఖ చేసిన 6వ నీటి వనరుల గణన నివేదిక ప్రకారం, తెలంగాణలో మొత్తం 64,056 చెరువులు ఉన్నాయి. వీటిలో 98.5 శాతం గ్రామీణ ప్రాంతాల్లో, 1.5 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. మొత్తంగా 24.4 శాతం చెరువులు 10 వేల క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ నీటి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇప్పుడు ఒక మూడు నెలలు వర్షం పడకపోయే సరికి నీటి కరవు వచ్చింది. పడిన వర్షం, నిలువ చేసిన నీళ్ళు, పెరిగిన భూగర్భ జల మట్టం రెండు–మూడు నెలలు వర్షం లేకపోతేనే ఎట్లా తగ్గినాయి?

తెలంగాణలో నదులు, వాగులు, చెరువులు పరివాహక ప్రాంతాల మీద అధ్యయనం చెయ్యాలి. చిన్న నీటి వనరుల ధ్వంసం పట్ల నిర్లక్ష్యం విడనాడాలి. అడవులు, చెట్ల నరికివేతను పూర్తిగా నివారించాలి. దీర్ఘకాలిక ప్రణాళికలు తయారు చేసుకోవాలి. సామాజిక, ఆర్థిక, ప్రకృతి కోణాలను పరిగణనలోకి తీసుకుంటూ, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర, సుస్థిర అభివృద్ధి వ్యూహాల మీద దృష్టి పెట్టాలి. విస్తృత సంప్రదింపుల ప్రక్రియలను పాలనలో పూర్తిగా, శాశ్వతంగా సమ్మిళితం చెయ్యాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

బొండా బ్యాచ్ స్కెచ్..
సీఎం జగన్‌ను హత్య చేసేందుకే..

తలపై సున్నిత భాగంలో దాడికి పక్కా ప్రణాళిక

కుట్రదారుల ప్రోద్బలంతో హత్యాయత్నానికి పాల్పడ్డ ఏ1 సతీశ్

- పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయితో సీఎంపై దాడి... శాస్త్రీయ ఆధారాలతో కుట్రను ఛేదించిన పోలీసులు
- ఏ2తోపాటు తెరవెనుక కుట్రదారుల పాత్రపై కొనసాగుతున్న దర్యాప్తు
- రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి
- నిందితులిద్దరూ బొండా ఉమాతో కలసి దిగిన ఫొటోలు వైరల్



నిందితుడు వేముల సతీశ్‌కుమార్‌ను కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు



టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమాతో సన్నిహితంగా ఉన్న వేముల సతీశ్‌కుమార్

సాక్షి, అమరావతి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హత్య చేయాలన్న పక్కా కుట్రతోనే ఆయనపై పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయితో దాడికి పాల్పడ్డారు. కుట్రదారులు పక్కా పన్నాగంతో నిందితుడు వేముల సతీశ్ కుమార్‌ను ప్రేరేపించి ముఖ్యమంత్రి జగన్‌పై దాడికి పాల్పడేలా పురిగొల్పారు. విజయవాడలో 'మేమంతా సిద్ధం'యాత్ర సందర్భంగా వివేకానంద పాఠశాల వద్ద దాడికి పాల్పడి సీఎంను హతమార్చాలన్నది కుట్రదారుల పన్నాగం. ముఖ్యమంత్రి జగన్ తలపై సున్నిత భాగంలో పదునైన రాయితో బలంగా దాడి చేయడం ద్వారా హతమార్చాలన్నది ప్రణాళిక'అని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. విజయవాడ వడ్డెర కాలనీకి చెందిన వేముల సతీశ్ కుమార్ ఈ హత్యాయత్నానికి పాల్పడినట్టు ఆధారాలతో సహా గుర్తించారు. సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడైన వేముల సతీశ్ మాజీ ఎమ్మెల్యే, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ నేత బొండా ఉమాతో సన్నిహితంగా ఉంటూ పలు కార్యక్రమాల్లో పాల్గొన్న దృశ్యాలు వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక ఈ కేసులో ఏ 2గా ఉన్న నిందితుడు కూడా బొండా ఉమాకు ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. ముఖ్యమంత్రిని హత్య చేసేందుకు కుట్రదారుల పన్నిన పన్నాగాన్ని పోలీసులు ఆధారాలతో వెలికితీశారు. హత్యాయత్నానికి పాల్పడిన వేముల సతీష్‌ను ప్రధాన నిందితుడు (ఏ1)గా పేర్కొంటూ గురువారం విజయవాడ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించింది. సీఎం జగన్‌పై హత్యాయత్నానికి సతీశ్‌ను ప్రేరేపించిన మరో కీలక నిందితుడిని ఏ 2గా పేర్కొంటూ, ఈ కుట్ర కోణాన్ని మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని పోలీసులు న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదికలో పేర్కొన్నారు. కాగా, ఏ2 గా ఉన్న నిందితుడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమాకు ప్రధాన అనుచరుడు. సెంట్రల్ నియోజవర్గ టీడీపీ బీసీ సెల్‌లో కీలక నేత. అంతేగాక సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా విభాగంలోనూ కీలక నేత కావడం గమనార్హం. రిమాండ్ నివేదికలోని ప్రధానాంశాలు ఇవీ....

గతంలోనూ నేర చరిత్ర..

ముఖ్యమంత్రి జగన్‌ను హత్య చేయాలని కుట్రదారులు పన్నాగం పన్నారు. మేమంతా సిద్ధం యాత్రలో ఆయనపై దాడికి పాల్పడి హతమార్చాలన్నది వారి కుట్ర. ముఖ్యమంత్రి తలపై సున్నిత ప్రదేశంలో పదునైన రాయితో దాడి చేసి అంతం చేయాలని పథకం రూపొందించారు. అందుకు విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారు. ముఖ్యమంత్రిపై దాడి చేసేందుకు వేముల సతీశ్ కుమార్‌ను ఎంపిక చేశారు. గతంలో నేర చరిత్ర కూడా ఉన్న అతడు ఏ2కి కీలక అనుచరుడు. ముఖ్యమంత్రిపై దాడి చేసి హత్య చేయాలని సతీశ్‌ను ఏ2 ప్రేరేపించాడు.

ముందే చేరుకుని మాటు వేసి..

కుట్రదారుల పన్నాగాన్ని వేముల సతీశ్ అమలు చేశాడు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం'యాత్ర ఈ నెల 13న విజయవాడలోని అజిత్‌సింగ్‌లోకి ప్రవేశించక ముందే అక్కడికి చేరుకున్నాడు. సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయిని సేకరించి జేబులో వేసుకుని వివేకానంద స్కూల్ వద్దకు చేరుకుని మరి కొంతమందితో కలసి మాటు వేశాడు. ఆ రోజు రాత్రి 8.04 గంటలకు సీఎం జగన్ తన వాహనంపై నిలబడి యాత్ర నిర్వహిస్తూ అక్కడికి చేరుకున్న సమయంలో వేముల సతీశ్ తన ఫ్యాంట్ జేబులోని పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయిని తీసి సీఎం వైఎస్ జగన్‌పై బలంగా విసిరి దాడికి పాల్పడ్డాడు. అదృష్టవశాత్తూ ఆ సిమెంట్ కాంక్రీట్ రాయి సీఎం తలపై సున్నిత భాగంలో కాకుండా ఎడమ కన్ను పైభాగంలో తగలడంతో ప్రాణాపాయం తప్పింది.

సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు

ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తులో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజీలు, సీఎం బస్సు చుట్టూ ఏర్పాటు చేసిన కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాలు, స్థానికులు తమ సెల్‌ఫోన్లో తీసిన వీడియోలు, కాల్ డేటా తదితర ఆధారాలను విశ్లేషించారు. ఆ ఆధారాలన్నీ హత్యాయత్నం కుట్రలో ఏ1 వేముల సతీష్, ఏ 2 పాత్రను నిర్ధారించాయి.

మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్

దర్యాప్తు బృందాలు ఈ నెల 17 సాయంత్రం 5 గంటల సమయంలో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌ను విజయవాడ రాజరాజేశ్వరిపేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నాయి. ఈ కేసులో ఇద్దరు ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అతడి కదలికలపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్న అనంతరం మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేశారు. నిందితుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సతీష్ ఇంట్లో సోదాలు జరిపి హత్యాయత్నానికి పాల్పడిన రోజు అతడు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భద్రతా కారణాల దృష్ట్యా సతీశ్‌ను అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి లాకప్‌లో ఉంచారు. నిందితుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతోపాటు సీఆర్‌పీసీ 50 కింద నోటీసులు కూడా జారీ చేశారు.

తెరవెనుక కుట్రదారులపై దృష్టి

ఈ కుట్ర కోణంపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు న్యాయస్థానానికి నివేదించారు. మరి కొందరు సాక్షులను విచారించడంతోపాటు సాంకేతికపరమైన డేటాను మరింత విశ్లేషించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏ 2తోపాటు తెరవెనుక ఉన్న ప్రధాన కుట్రదారులపై పోలీసులు దృష్టి సారించారు. కుట్రదారులు ప్రేరేపించడంతోనే వేముల సతీశ్ ముఖ్యమంత్రిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నిర్ధారించారు. అతడిని ప్రేరేపించిన ఏ2ని కూడా గుర్తించారు. ఏ2 పాత్రకి సంబంధించి మరింత సమాచారంతోపాటు అతడి వెనుక ఉన్న కీలక కుట్రదారుల హస్తాన్ని పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చేందుకు పోలీసులు దర్యాప్తులో దూకుడు పెంచారు. ఈ కేసులో త్వరలోనే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి రానున్నట్లు స్పష్టమవుతోంది. కీలక వ్యక్తుల సహకారం లేకుండా ఈ కుట్రను ఇంత పకడ్బందీగా అమలు చేయడం సాధ్యం కాదని పోలీసులు పేర్కొంటున్నారు.

సుజనా చౌదరి దివాలా

సుజనా వ్యక్తిగత దివాలా ప్రక్రియకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి
స్పెండిడ్ మెటల్ ప్రొడక్ట్స్ రుణం కేసులో ఉత్తర్వులు
ట్రిబ్యునల్ తీర్పుతో బీజేపీ నేతకు షాక్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎంపీ, ఎన్డీఏ కూటమి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి వ్యక్తిగత దివాలా ప్రక్రియకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దివాళా పరిష్కారకర్త (రెజల్యూషన్ ప్రొఫెషనల్)ను నియమిస్తూ.. ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆయన ఆస్తుల క్రయవిక్రయాలను నిలిపివేసింది. దివాలా ప్రక్రియకు వెళ్లిన స్పెండిడ్ మెటల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎస్‌బీఐలో రూ. 500 కోట్లకు రుణం తీసుకుంది. దీనికి సుజనా చౌదరి వ్యక్తిగతంగా గ్యారెంటీ ఇచ్చారు. దీంతో సుజనా చౌదరి వ్యక్తిగత దివాలా ప్రక్రియ ప్రారంభించి, పరిష్కారాన్ని చేపట్టాలని ఎస్‌బీఐ 2021లో ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసింది. ఆయన ఆస్తుల మదింపు చేపట్టి, వేలం ద్వారా ఎస్‌బీఐ రుణాలను చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. ఈ పిటిషన్‌పై ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యుడు రాజీవ్ భరద్వాజ్, టెక్నికల్ సభ్యుడు సంజయ్ పూరి బెంచ్ విచారణ జరిపి, తాజా ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వీపీఎస్ఎస్ రాజు వాదనలు వినిపించారు. రుణదాతకు ఏదైనా కంపెనీ, వ్యక్తులు రుణాన్ని ఎగివేసినప్పుడు దానికి వ్యక్తిగతంగా గ్యారెంటీ ఉన్న వాళ్లు బాధ్యత వహించాలని చట్టం చెబుతోందన్నారు. గతంలో సుప్రీం కోర్టు కూడా ఈ విషయాన్ని పలు తీర్పుల సందర్భంగా చెప్పిందన్నారు. హామీదారుగా ఉన్న సుజనా చౌదరి తప్పకుండా బాధ్యత వహించేలా ఆదేశాలివ్వాలని కోరారు. సుజనా తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు పూర్తికావడం, మధ్యంతర పరిష్కార ప్రక్రియ (ఐఆర్‌పీ) ఇచ్చిన నివేదికను పరిశీలించిన బెంచ్.. సుజనా వ్యక్తిగత దివాలా ప్రక్రియకు అనుమతించింది. దీంతో బీజేపీ నేతకు షాక్ తగిలినట్లయింది. దీని ప్రకారం దివాలా ప్రక్రియను ప్రారంభించేందుకు పరిష్కారకర్తను నియమిస్తారని, ఆయన సుజనా అప్పులు, ఆస్తులను పరిశీలించి, ఆయా రుణదాతలకు ఇవ్వాల్సిన నిష్పత్తి మేరకు పరిష్కారాన్ని సూచిస్తారని సమాచారం.

నిందితుడికి 14 రోజుల రిమాండ్..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఎం వైఎస్ జగన్‌పై నిందితుడు విసిరిన పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయి కనుబొమపై కాకుండా ముఖ్యమంత్రి తలపై సున్నిత ప్రదేశంలో తగిలి ఉంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడేదని పోలీసులు తమ దర్యాప్తు నివేదికలో తేల్చిచెప్పారు. ఈ విషయం నిర్ధారణ అయినందునే ఐపీసీ 307 కింద హత్యాయత్నంగా కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొనడంతో అందుకు న్యాయస్థానం ఏకీభవించింది. దీంతో నిందితుడు వేముల సతీశ్‌కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం పోలీసులు అతనిని నెల్లూరు సబ్‌జైలుకు తరలించారు. అంతకుముందు.. ఈ కేసులో నిందితుడిని విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరిచినప్పుడు ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదనలు వాడివేడిగా సాగాయి.



దళితులపై పెత్తందారీ
తోడేలు దొంగ ప్రేమ

- దళితుల భూములు లాక్కుని ఫిలిం సిటీ నిర్మించింది రామోజీయే
- ఇప్పుడు వాళ్లపై ప్రేమ ఉన్నట్లు నాటకాలు
- చంద్రబాబు హయాంలో దళితులపై దాడులు, అవమానాలు.. సీఎంగా ఉండగా దళితులను హేళన చేసిన చంద్రబాబు
- దళితులకు రాజకీయాలెందుకురా అంటూ తూలనాడిన చింతమనేని
- వారి దగ్గర కంపు కొడుతుందంటూ ఈసడించుకున్న అప్పటి మంత్రి ఆదినారాయణ రెడ్డి
- ఇలా ఆదిమ సమాజపు భావజాలంతో దళితులను అవమానిస్తున్న బాబు బ్యాచ్
- అయినా చంద్రబాబు బ్యాచ్‌కే మద్దతు పలికిన రామోజీరావు
- దళితులను అక్కున చేర్చుకుని, వారి ఉన్నతికి పలు పథకాలు, పదవులు ఇస్తున్న సీఎం జగన్
- నేడు గౌరవంతో తలెత్తుకొని బతుకుతున్న దళితులు.. అయినా సీఎం జగన్‌పై అభాండాలు వేస్తున్న రామోజీ

'మంగళగిరి'లో
టీడీపీ దాష్టీకం

- ఓటమి భయంతో బరితెగించిన లోకేశ్ అనుచరులు.. ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి
- ఆపై ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన టీడీపీ దుండగులు.. వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనర్‌కు తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం.. 24 గంటలు గడిస్తే తప్ప చెప్పలేమంటున్న వైద్యులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వివేకా హత్యపై దుష్ప్రచారం ఆపండి

షర్మిల, సునీత, చంద్రబాబు, పవన్, పురందేశ్వరి, లోకేశ్‌లకు కడప జిల్లా కోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిలపైన దుష్ప్రచారం చేయొద్దని కడప జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేశ్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి తదితరులకు విస్పష్ట ఆదేశాలు జారీ చేసింది. సీఎం వైఎస్ జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డిల పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేయొద్దని కోర్టు తేల్చిచెప్పింది. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి మాట్లాడొద్దని సూచించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడే మాట్లాడాలని కుండబద్దలు కొట్టింది. ప్రజలను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు పద్ధతిగా మాట్లాడాలని హెచ్చరించింది. ఇప్పటికే చంద్రబాబు, లోకేశ్, షర్మిల, సునీత తదితరులు తాము చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను పత్రికలు, టీవీలు, సోషల్ మీడియా మాధ్యమాల నుంచి తొలగించాలని ఆదేశించింది. వీరు సీఎం వైఎస్ జగన్, వైఎస్ అవినాశ్‌రెడ్డిలపై దుష్ప్రచారం చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని కోర్టు తెలిపింది. రాజకీయంగా మైలేజీ కోసమే దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజకీయ పార్టీలు, మీడియా పబ్లిక్ కోర్టుగా అవతరించి న్యాయపాలనలో జోక్యం చేసుకుంటున్నాయని కడప జిల్లా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు కడప ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీదేవి రెండు రోజుల క్రితం తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోపణలు, వక్రీకరణలు ఆపండి..

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ధ్రువీకరణ కాని ఆరోపణలతో, వక్రీకరణలతో వ్యక్తిగత దాడులు, విమర్శలు చేయడం మానాలని కాంగ్రెస్, టీడీపీ, జనసేన నేతలను, వారి పార్టీల క్యాడర్‌ను కడప జిల్లా కోర్టు ఆదేశించింది. వైఎస్ వివేకా హత్య కేసు విచారణ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉందని కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో వైఎస్ అవినాశ్‌రెడ్డిని హంతకుడిగా ఆరోపిస్తూ మీడియా, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని ఆయా పార్టీల అధినేతలను, అనుచరులకు కోర్టు విస్పష్ట ఆదేశాలు జారీ చేసింది. అవినాశ్‌రెడ్డిని వైఎస్ జగన్ రక్షిస్తున్నారంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ఆపాలని తేల్చిచెప్పింది. వ్యక్తిగత విమర్శలు మాని తమ పార్టీల ఎజెండాలపైన, ఇతర పార్టీల వైఫల్యాలపైన దృష్టి సారించాలని వారికి కోర్టు హితవు పలికింది. వివేకా హత్య కేసులో జగన్ నిందితుడు కాదన్న విషయాన్ని గుర్తెరగాలంది. రాజకీయ మైలేజీ కోసమే జగన్, అవినాశ్‌లపై.. షర్మిల, చంద్రబాబు, లోకేశ్ తదితరులు వ్యాఖ్యలు చేశారంది. ఆ వ్యాఖ్యలు ఖచ్చితంగా పరువు నష్టం కలిగించేవేనని తేల్చిచెప్పింది.

తప్పుడు ప్రచారంపై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం..

చంద్రబాబు ప్రోద్బలంతో వైఎస్ వివేకా హత్యపై షర్మిల, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్, సునీత తదితరుల దుష్ప్రచారంపై విసిగిపోయిన వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటానికి దిగింది. తమ పార్టీతో పాటు సీఎం వైఎస్ జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డి, తదితరులపై పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎలాంటి తప్పుడు ప్రచారం, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా షర్మిల, చంద్రబాబు, సునీతలను నిరోధించాలంటూ కడప జిల్లా కోర్టులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.శ్రీదేవి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున ఎం.నాగిరెడ్డి, కె.ఎస్.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. చంద్రబాబు, షర్మిల, సునీత తదితరులు చేసిన దుష్ప్రచారానికి సంబంధించిన డాక్యుమెంట్లను, తప్పుడు ఆరోపణల వీడియోలను న్యాయవాదులు కోర్టు ముందుంచారు.

దుష్ప్రచారాన్ని ఆపండి..

ఎన్నికల ప్రచారంలో షర్మిల తదితరులు వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డిని సీఎం జగన్ కాపాడుతున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. అవినాశ్‌రెడ్డిని ఏకంగా హంతకుడంటూ తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి తప్పుడు ప్రకటనలు, వ్యాఖ్యలు చేస్తున్నారని నివేదించారు. చంద్రబాబు కూడా ప్రొద్దుటూరు సభలో వివేకాను హత్య చేసిన వ్యక్తిని ఎంపీగా నిలబెట్టారంటూ దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇక లోకేశ్ అయితే నేరుగా ముఖ్యమంత్రి జగనే తన బాబాయి వివేకాను హత్య చేశారని ఆరోపించారన్నారు. పురందేశ్వరి, పవన్ కళ్యాణ్ తదితరులు కూడా ఇలాగే దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. వివేకా హత్య కేసు సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసులో జగన్, అవినాశ్, వైఎస్సార్‌సీపీపైన ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయా పార్టీల అధినేతలను, క్యాడర్‌ను నిరోధించాలన్నారు.

అందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి..

వాదనలు విన్న జిల్లా జడ్జి శ్రీదేవి పిటిషనర్ వాదనలతో ఏకీభవించారు. వాక్ స్వాతంత్ర్యం సహేతుక పరిమితులకు లోబడి ఉంటుందన్న సుప్రీంకోర్టు తీర్పును ఉదహరించారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ ముసుగులో ఓ వ్యక్తి ప్రతిష్టను, మంచితనాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీయడం ఆ స్వేచ్ఛపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. 'వైఎస్ వివేకా హత్య కేసు ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా షర్మిల, చంద్రబాబు, లోకేశ్ ప్రజల ముందు వైఎస్సార్‌సీపీ, దాని అధినేత వైఎస్ జగన్, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తదితరులపై తప్పుడు, పరువు నష్టం కలిగించేలా మాట్లాడుతున్నారనేందుకు, అసభ్యంగా పరిహాసం చేస్తున్నారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి. వారి మాటలను, వ్యాఖ్యలను పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాలు పదే పదే ప్రచురించాయి, ప్రసారం చేశాయి. ముఖ్యంగా అవినాశ్‌రెడ్డిని హంతకుడిగా పేర్కొన్నారు. ఆయనను సీఎం జగన్ రక్షిస్తున్నారని పేర్కొన్నాయి.' అని జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోర్టు ప్రొసీడింగ్స్‌లో మీడియా, రాజకీయ పార్టీలు జోక్యం చేసుకుంటున్నాయి..

'రాజకీయ పార్టీలు మీడియా ద్వారా పబ్లిక్ కోర్టుగా అవతరించాయి. అటు మీడియా, ఇటు రాజకీయ పార్టీలు సొంతంగా దర్యాప్తు చేసేస్తున్నాయి. తద్వారా కోర్టు ప్రొసీడింగ్స్‌లో జోక్యం చేసుకుంటున్నాయి. నిందితుడు, దోషికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విస్మరించాయి. దోషిగా నిర్ధారణ అయ్యేవరకు నిరపరాధే అనే సూత్రాన్ని కూడా పట్టించుకోవడం లేదు. కోర్టులు కేసును విచారణకు స్వీకరించడానికి ముందే నిందితులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలుస్తున్నాయి. ఇది ప్రజలపై, జడ్జీలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తత్ఫలితంగా అమాయకుడైన నిందితుడిని నేరస్తుడిగా చూడాల్సి వస్తోంది. నిందితుల హక్కులు, స్వేచ్ఛను పట్టించుకునే పరిస్థితి ఉండటం లేదు. ట్రయల్‌కు ముందు ఓ అనుమానితుడు, నిందితుడు విషయంలో మీడియా సాగించే పరిమితికి మించిన ప్రతికూల ప్రచారం ట్రయల్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. తద్వారా అతడే నేరం చేశాడని భావించాల్సి వస్తోంది. ఇలా చేయడం న్యాయ పాలనలో జోక్యం చేసుకోవడమే అవుతుంది' అని జడ్జి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఇతరులు సొంత తీర్పులివ్వరాదు..

'పౌర హక్కుల దురాక్రమణను నిరోధించడానికి, నిందితుల హక్కులను కాపాడేందుకు, మీడియా ప్రవర్తనకు అడ్డుకట్ట వేసేందుకు న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించే విషయంలో సరైన నిబంధనలు లేవు. ఓ వ్యక్తి అరెస్ట్ సమయంలో అతడిని దోషిగా నిర్ధారించే ట్రెండే ప్రస్తుతం కొనసాగుతోంది. రాజకీయ నేతలు, రాజకీయ పార్టీలు, మీడియా ఉన్నది ప్రజలకు వాస్తవాలను తెలియజేసేందుకే తప్ప, తమ ఇష్టాఇష్టాలకు అనుగుణంగా తీర్పులు ఇచ్చేందుకు ఎంతమాత్రం కాదు. ప్రస్తుత కేసులో ఈ కోర్టు ముందుంచిన డాక్యుమెంట్లు, వీడియోలు, పత్రికా కథనాలను విశ్లేషిస్తే.. బహిరంగంగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని హంతకుడిగా ప్రచారం చేస్తున్నారు. అలాగే ఆయనను వైఎస్ జగన్ రక్షిస్తున్నట్లు కూడా ప్రచారం చేస్తున్నారు. ఓ కేసు కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నప్పుడు.. ఎవరూ కూడా తమ సొంత తీర్పులు ఇవ్వడానికి వీల్లేదు. ఆ అధికారం ఎవరికీ లేదు. అలాంటి కేసులో ఉన్న వ్యక్తిని తమ ఇష్టానుసారం హంతకుడిగా, దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. నిష్పాక్షిక ట్రయల్ నిర్వహించి నిందితుడిని దోషిగా నిర్ధారించేంత వరకు ఆ వ్యక్తి అమాయకుడే అన్నది న్యాయ సూత్రం. ఓ వ్యక్తి నేరాన్ని నిరూపించాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్‌పైన మాత్రమే ఉంది. పెండింగ్‌లో ఉన్న కేసు గురించి మూడో వ్యక్తి ఎవరూ కూడా తమ తప్పుడు ప్రయోజనాల కోసం బహిరంగంగా మాట్లాడటం, వ్యాఖ్యలు చేయడం, తీర్పులిచ్చేయడానికి ఎంతమాత్రం వీల్లేదు' అని జడ్జి శ్రీదేవి తేల్చిచెప్పారు.

రాజకీయ మైలేజీ కోసమే సీఎం జగన్, అవినాశ్‌పై వ్యాఖ్యలు..

'ప్రస్తుత కేసులో షర్మిల, సునీత, చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్, బీటెక్ రవి వారి రాజకీయ మైలేజీ కోసం వైఎస్సార్‌సీపీపై, వైఎస్ జగన్, ఎంపీ అవినాశ్‌రెడ్డి పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసులో జగన్ ఎన్నడూ కూడా నిందితుడు కాదు. కాబట్టి వివేకాను జగన్ చంపారంటూ ప్రజలందరి ముందు లోకేశ్ చేసిన ప్రకటన పరువు నష్టం కలిగించేదే. సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుంటూ.. ఈ కోర్టు ఈ కేసులో తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఉత్తర్వుల వల్ల షర్మిల, చంద్రబాబు, లోకేశ్ తదితరులకు ఎలాంటి నష్టం వాటిల్లదు. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే వైఎస్సార్‌సీపీ, జగన్, అవినాశ్ రెడ్డిలకు తీరని నష్టం కలుగుతుంది. ఇదే సమయంలో షర్మిల, చంద్రబాబు, లోకేశ్ తదితరులు పదే పదే పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తారు. ఎన్నికల వేళ ఇది వైఎస్సార్‌సీపీ, ఎన్నికల్లో పోటీ చేసే ఆ పార్టీ అభ్యర్థులకు తీరని నష్టం కలిగిస్తుంది. అందుకే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నాక ఈ కేసులో తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని నిర్ణయించా' అని జిల్లా జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలింగ్ @102 నేడే!

21 రాష్ట్రాల పరిధిలో జరగనున్న ఎన్నికలు

అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్	1.87 లక్షల పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

నేతల భవితవ్యం తేల్చనున్న 16.63 కోట్ల ఓటర్లు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్న సీఈసీ



గురువారం జమ్మూకశ్మీర్‌లో దోడాలో పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది

సాక్షి, న్యూఢిల్లీ: అతిపెద్ద ప్రజాస్వామ్య పండగ అయిన లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోరుకు సర్వం సిద్ధమైంది. తొలి విడత ఎన్నికల్లో భాగంగా శుక్రవారం 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. వీటితోపాటే అరుణాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 60, సిక్కింలోని మొత్తం 32 అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుంది. స్థానిక పరిస్థితులను బట్టి పోలింగ్ వేళల్లో మార్పులుచేర్పే అవకాశముంది. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్ సుఖ్‌బీర్‌సింగ్ సంధూ పోలింగ్ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఈసీ రాజీవ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

తొలి దశలో బరిలో నిల్చిన నేతలు..

కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ(నాగ్‌పూర్ నియోజకవర్గం), కిరెన్ రిజిజు(అరుణాచల్ వెస్ట్), సంజీవ్ భలియా(ముజఫర్‌నగర్), జితేంద్ర సింగ్(ఉధమ్‌పూర్), అర్జున్ రామ్ మేఘ్వాల్(బికనీర్), ఎల్.మురుగన్(నీలగిరి), శర్బానంద సోనోవాల్(దిబ్రూగఢ్), భూపేంద్ర యాదవ్(అల్వార్) శుక్రవారం నాటి పోరులో తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, అరుణాచల్ మాజీ సీఎం నబాం టుకీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్‌కుమార్ దేవ్, కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్, డీఎంకే నాయకురాలు కనిమొళి, బీజేపీ తమిళనాడు చీఫ్ కె.అన్నామలై, మధ్య ప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ తనయుడు నకుల్‌నాథ్, లోక్ జనశక్తి పార్టీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, బీజేపీ నేత జితిన్ ప్రసాద, నితిన్ ప్రామాణిక్, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం, కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ పోటీచేస్తున్న స్థానాల్లోనూ శుక్రవారమే పోలింగ్ జరుగుతోంది.

భారీగా ఏర్పాట్లు

తొలి దఫా పోలింగ్ కోసం 18 లక్షల మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. పోలింగ్, భద్రతా సిబ్బందిని తరలించేందుకు 41 హెలికాప్టర్లు, 84 ప్రత్యేక రైళ్లు, లక్ష వాహనాలు సమకూర్చారు.

తప్పకుండా ఓటేయాలి: సీఈసీ రాజీవ్

ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోసందేశం విడుదలచేశారు. ''భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు అనేవి అత్యంత రమణీయమైన భావన. ఇందులో ఓటింగ్‌కు మించింది లేదు. భారతీయ ఓటర్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి ఈ ఎండ వేడిమినీ అధిగమిస్తుంది. ఎన్నికలు మీవి. ఎవరిని ఎన్నుకోవాలనేది మీ ఇష్టం. మీ ప్రభుత్వాన్ని మీరే నిర్ణయించుకోండి. మీ కుటుంబం, పిల్లలు, పల్లె, గ్రామం.. అంతెందుకు దేశం కోసం మీరు వేస్తున్న ఓటు ఇది' అని రాజీవ్ వ్యాఖ్యానించారు. 85 ఏళ్లు పైబడినవారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నాడు ఈ 102 సీట్లలో 45 చోట్ల యూపీఏ గెలుపు

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ 102 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 45 చోట్ల యూపీఏ కూటమి విజయం సాధించింది. 41 స్థానాలను ఎన్‌డీఏ కూటమి కైవసం చేసుకుంది. ఈ 41లో బీజేపీ గెలిచినవే 39 ఉన్నాయి.

సమస్యాత్మక బస్తర్‌లోనూ..

మావోల దాడులు, పోలీసు బలగాల ఎదురుకాల్పుల మోతలతో దద్దరిల్లే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలోనూ శుక్రవారమే పోలింగ్ జరుగుతోంది. బస్తర్‌లోని కాంకేర్ జిల్లాలో ఈనెల 16న జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది నక్సల్స్ మరణించిన నేపథ్యంలో ఈసీ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఎన్నికలు నిర్వహిస్తోంది. బస్తర్‌లో 61 పోలింగ్‌బూత్‌లు సున్నితమైన ప్రాంతాల్లో, 196 బూత్‌లను సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. బస్తర్ నుంచి కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ నేత కవాసి లఖ్మా బరిలో నిలిచారు. ఈయనకు పోటీగా మహేశ్ కశ్యప్‌ను బీజేపీ నిలిపింది. భద్రతా కారణాల రీత్యా కొన్ని బూత్‌లలో పోలింగ్‌ను మధ్యాహ్నం మూడు గంటలవరకే అనుమతిస్తారు. 191 'సంఘ్ వారీ' బూత్‌లను మహిళా సిబ్బంది నిర్వహిస్తారు. 42 'ఆదర్శ్', 8 'దివ్యాంగ్‌జన్', 36 యువ బూత్‌లనూ ఏర్పాటుచేశారు.

తొలి విడత 102 స్థానాలు

జనరల్ 73 | ఎస్టీ 11 | ఎస్సీ 18

తొలిదశ పోలింగ్ మొత్తం అభ్యర్థులు	1,625
పురుషులు	1,491
మహిళలు	134
మొత్తం ఓటర్లు	16.63 కోట్లు
పురుషులు	8.4 కోట్లు
మహిళా ఓటర్లు	8.23 కోట్లు
థర్డ్ జెండర్	11,371
తొలిసారి ఓటేస్తున్నవాళ్లు	35.67 లక్షలు
పోలింగ్ స్టేషన్లు	1.87 లక్షలు

పార్టీల వారీగా అభ్యర్థులు	
బహుజన్ సమాజ్ పార్టీ	86
బీజేపీ	77
కాంగ్రెస్	56
ఏఐఏడీఎంకే	36
డీఎంకే	22
సమాజ్‌వాదీ పార్టీ	7
తృణమూల్ కాంగ్రెస్	5
ఆర్జేడీ	4
ఇతరులు (స్వతంత్రులతో కలిపి)	1,332

కొన్ని ఎంపీ స్థానాలకు పోలింగ్ జరిగే రాష్ట్రాలు	
రాజస్తాన్	12
ఉత్తరప్రదేశ్	8
మధ్యప్రదేశ్	6
అస్సాం	5
మహారాష్ట్ర	5
బిహార్	4
పశ్చిమబెంగాల్	3
మణిపూర్	2
త్రిపుర	1
జమ్మూకశ్మీర్	1
ఛత్తీస్‌గఢ్	1

2019లో అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలో పార్టీల బలాబలాలు	
అరుణాచల్ మొత్తం స్థానాలు	60
బీజేపీ	41
జేడీ(యూ)	7
నేషనల్ పీపుల్స్ పార్టీ	5
కాంగ్రెస్	4
పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్	1
స్వతంత్రులు	2
సిక్కింలో మొత్తం స్థానాలు	32
సిక్కిం క్రాంతికారీ మోర్చా	17
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్	15
బీజేపీ	0
కాంగ్రెస్	0

అన్ని ఎంపీ స్థానాలకు పోలింగ్ జరిగే రాష్ట్రాల్లో... 2019లో ఎవరికెన్ని సీట్లు

తమిళనాడులో మొత్తం స్థానాలు	39
డీఎంకే	24
కాంగ్రెస్	8
సీపీఐ	2
సీపీఐ(ఎం)	2
అన్నాడీఎంకే	1
ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్	1
విదుతలై చిరుథైగల్ కచ్చి	1

ఉత్తరాఖండ్‌లో మొత్తం స్థానాలు	5
బీజేపీ 5 : కాంగ్రెస్ 0	
అరుణాచల్‌లో మొత్తం స్థానాలు	2
బీజేపీ 2 : కాంగ్రెస్ 0	
మేఘాలయలో మొత్తం స్థానాలు	2
బీజేపీ 0 : కాంగ్రెస్ 1	
నేషనల్ పీపుల్స్ పార్టీ	1

అండమాన్‌లో మొత్తం స్థానాలు	1
బీజేపీ 0 : కాంగ్రెస్ 1	
మిజోరంలో మొత్తం స్థానాలు	1
మిజో నేషనల్ ఫ్రంట్ 1 : కాంగ్రెస్ 0	
నాగాలాండ్‌లో మొత్తం స్థానాలు	1
నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ	1
కాంగ్రెస్	0

సిక్కింలో మొత్తం స్థానాలు	1
సిక్కిం క్రాంతికారీ మోర్చా	1
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్	0
లక్షద్వీప్‌లో మొత్తం స్థానాలు	1
నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ	1
కాంగ్రెస్	0
పుదుచ్చేరిలో మొత్తం స్థానాలు	1
కాంగ్రెస్	1



ఎన్నికల వి-చిత్రం

యమధర్మరాజు వేషంలో పోజిచ్చిన ఈయన రామ్ గైక్వాడ్. మహారాష్ట్రలోని మాధా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగారు. గురువారం నామినేషన్ వేసేందుకు మద్దతుదారులు వెంటరాగా ఆయన ఇలా అట్టహాసంగా బయలుదేరారు.

ఎలక్షన్ బీట్

ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా జరగాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల ప్రక్రియ పవిత్రంగా జరగాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించడానికి తీసుకున్న చర్యలను వివరించాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎన్నికల విధానంలో పవిత్రత ఉండాలని, ఎటువంటి అనుమానాలు, అపోహలకు ఆస్కారం ఉండొద్దని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థలో ఓటర్ల సంతృప్తి, విశ్వాసం అనేవి చాలా ముఖ్యమని వెల్లడించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో(ఈవీఎంలు) నమోదైన ఓట్లను వీవీ ప్యాట్ స్లిప్పులతో క్రాస్–వెరిఫికేషన్ చేయాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)తోపాటు మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఏడీఆర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఈవీఎంలు, వీవీప్యాట్లపై అనుమానాలు వ్యక్తం చేశారు. ధర్మాసనం స్పందిస్తూ.. అన్నింటికీ అనుమానించవద్దని సూచించింది. పిటిషన్లపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది.

ముహూర్తం మించిపోయింది...

నవ్‌సారి(గుజరాత్): 'గురువారం మధ్యాహ్నం 12 గంటల 39 నిమిషాలు. దివ్యమైన ముహూర్తం. సరిగ్గా ఈ సమయానికి ఏది ప్రారంభించినా విజయం ఖాయం'ఇది పూజారి జిగర్ జానీ చెప్పిన మాట. ముహూర్త బలాన్ని బలంగా నమ్మే గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్ నవ్‌సారి లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేయాలనుకున్నారు. సీఎం భూపేంద్ర పటేల్ తదితర ప్రముఖులు వెంటరాగా నవ్‌సారిలోని పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉదయం రోడ్ షోతో కలెక్టరేట్‌కు బయలుదేరారు. కార్యక్రమానికి భారీగా జనం తరలిరావడంతో అనుకున్న సమయానికి ఆయన కాన్వాయ్ కలెక్టరాఫీసుకు చేరుకోలేకపోయింది. విజయ ముహూర్తం మించిపోవడంతో పాటిల్ నామినేషన్ వేయకుండానే వెనుదిరిగారు. మళ్లీ అదే పూజారి నిర్ణయం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం అదే 12.39 గంటలకు పాటిల్ నామినేషన్ దాఖలు చేస్తారని సన్నిహితులు తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై దాదాపు 6.89 లక్షల ఓట్ల తేడాతో పాటిల్ ఘన విజయం సాధించారు.

శ్రీకృష్ణుని గోపికను నేను: హేమమాలిని

మథుర(యూపీ): గోపాలకృష్ణుని 16 వేల గోపికల్లో ఒకరినంటూ సినీ నటి హేమమాలిని తనను తాను అభివర్ణించుకున్నారు. మథురలో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన హేమమాలిని గురువారం మీడియాతో మాట్లాడుతూ..'గోపికల్లో ఒక గోపికగా నన్ను నేను ఊహించుకుంటాను. మథుర చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన బ్రిజ్‌వాసులంటే శ్రీకృష్ణునికి ఎంతో ప్రేమ, అభిమానం. అందుకే బ్రిజ్‌వాసులను ఇష్టంతో సేవిస్తే కృష్ణ భగవానుని ఆశీస్సులు లభిస్తాయని నా నమ్మకం. అందుకే వారికి విశ్వాసంతో సేవ చేస్తున్నా'అని ఆమె అన్నారు. పేరు, ప్రఖ్యాతుల కోసమో, మరే ఇతర భౌతిక లాభాపేక్షతోనో రాజకీయాల్లోకి రాలేదన్నారు. మథుర చుట్టుపక్కల 84 కోసుల పరిధి(252 కిలోమీటర్లు)లోని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని చెప్పారు.

'అమేథీ నుంచి పోటీ చేసే ధైర్యం లేదు'

పత్తనంతిట్ట(కేరళ): 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ నుంచి ఓటమి పాలైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఈ దఫా మళ్లీ అక్కడి నుంచి పోటీ చేసే ధైర్యం లేదని బీజేపీ నేత రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. యూపీలోని అమేథీలో పరాజయం పాలైన రాహుల్ అక్కడ్నుంచి కేరళలోని వయనాడ్‌కు వలసవచ్చారని ఎద్దేవా చేశారు. అయితే, మరోసారి ఆయన్ను ఎంపీగా చేయరాదని ఇప్పటికే వయనాడ్ ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిసిందన్నారు. కేరళలోని పత్తనంతిట్ట లోక్‌సభ నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాజ్‌నాథ్ ప్రసంగించారు.

మోదీపై ఫిర్యాదు: సీతారాం ఏచూరి

కోజికోడ్: ప్రధాని మోదీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ప్రకటనలు చేస్తున్నారని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. శ్రీరాముడి అంశంపై ప్రజలను మతపరంగా సంఘటితం చేసేలా పలు ప్రకటనలు చేశారని, దీనిపై తాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశానని తెలిపారు. కోడ్‌ను ఉల్లంఘించేలా మోదీ మాట్లాడిన మాటలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఏచూరి గురువారం కేరళలోని కోజికోడ్‌లో మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం అలుపెరుగని పోరాటం చేస్తోందని పేర్కొన్నారు.

దక్షిణాదిన అత్యుత్తమ ఫలితాలు: అమిత్ షా

అహ్మదాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ అత్యుత్తమ ఫలితాలను సాధించనుందని హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. 'బీజేపీకి ఉన్న అనుకూల వాతావరణాన్ని బట్టి 400 పైగా సీట్లు సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈదఫా ఎన్నికల్లో దక్షిణాదిన మొదటిసారిగా అత్యధిక స్థానాలు సాధించుకుంటాం'అని అమిత్ షా చెప్పారు. దీన్ని బట్టి ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎన్ని సీట్లు దక్కుతాయో ఊహించుకోవచ్చునన్నారు.

బెయిల్ కోసం కేజ్రీవాల్ మామిడి పండ్లు, స్వీట్లు తింటున్నారు

- ఢిల్లీ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వాదనలు
- నివేదిక ఇవ్వాలని తిహార్ జైలు అధికారులకు కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై, ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ కోసం మరో ప్రయత్నం మొదలుపెట్టారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరోపించింది. టైప్–2 డయాబెటిస్ బాధితుడైన కేజ్రీవాల్ ఒంట్లో చక్కెర స్థాయిలు పెంచుకోవడానికి ఉద్దేశపూర్వకంగా జైలులో నిత్యం మామిడి పండ్లు, మిఠాయిలు, బంగాళదుంప పూరీలు తింటున్నారని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా దృష్టికి తీసుకొచ్చింది. తద్వారా మెడికల్ బెయిల్ పొందడానికి లేదా చికిత్స పేరిట ఆసుపత్రిలో చేరడానికి ఒక కారణం సృష్టించుకుంటున్నారని తప్పుపట్టింది. తన ఒంట్లో చక్కెర స్థాయిల్లో తరచుగా హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని, తన రెగ్యులర్ డాక్టర్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతిరోజూ సంప్రదించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ తరఫు లాయర్ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ టైప్–2 డయాబెటిస్ బాధితుడు అయినప్పటికీ అధికంగా చక్కెర పరిమాణం ఉన్న ఆహారం తీసుకుంటుండడం బెయిల్ కోసమేనని పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక జడ్జి కావేరి బవేజా స్పందిస్తూ.. కేజ్రీవాల్ నిత్యం తీసుకుంటున్న ఆహార పదార్థాల జాబితాతో కూడిన నివేదికను శుక్రవారం కల్లా అందజేయాలని తిహార్ జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. మరోవైపు ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ నేత మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 26 దాకా పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

కేజ్రీవాల్ హత్యకు కుట్ర: అతిశీ

అరవింద్ కేజ్రీవాల్ తీసుకుంటున్న ఆహారంపై ఈడీ పచ్చి అబద్ధాలు చెబుతోందని ఢిల్లీ కేబినెట్ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిశీ మండిపడ్డారు. కేజ్రీవాల్ హత్య చేయడానికి పెద్ద కుట్ర జరుగుతోందని అన్నారు. జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు ఇంటి నుంచి భోజనం అందించకుండా ఈడీ ద్వారా బీజేపీ కుతంత్రాలకు తెరతీసిందని ధ్వజమెత్తారు. డయాబెటిస్ బాధితుడైన కేజ్రీవాల్‌కు తిహార్ జైలు అధికారులు ఇన్సులిన్, ఔషధాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.

శిల్పాశెట్టి దంపతుల రూ.98 కోట్ల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ: క్రిప్టో ఆస్తుల పోంజీ స్కీమ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భాగంగా బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త అయిన వ్యాపారవేత్త రాజ్ కుంద్రాలకు చెందిన రూ.98 కోట్ల స్థిరచరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. బిట్‌కాయిన్ల పేరుతో పెట్టుబడిదారులను మభ్యపెట్టి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్న ఉదంతంలో ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్న సంగతి తెల్సిందే. ఇందులో భాగంగా ముంబై జుహూలో శిల్పాశెట్టి పేరిట ఉన్న ఫ్లాట్, పుణెలోని ఒక బంగ్లా, రాజ్‌కుంద్రా పేరిట ఉన్న ఈక్విటీ షేర్లను జప్తుచేసినట్లు ఈడీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''బిట్‌కాయిన్లలో పెట్టుబడులు పెడితే నెలకు 10 శాతం లాభాలు కళ్లజూడొచ్చని చెబుతూ వేరియబుల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ 2017లో సాధారణ జనం నుంచి రూ.6,600 కోట్ల విలువైన నిధులను బిట్‌కాయిన్ల రూపంలో సేకరించింది. ఈ కంపెనీ ప్రమోటర్లు సహా పలువురు మల్టీలెవల్ మార్కెటింగ్ ఏజెంట్లు ఈ నిధులను సేకరించారు. ఈ నిధులను బిట్‌కాయిన్ల మైనింగ్, పెట్టుబడికి వాడతామని నమ్మబలికారు. కానీ ఆ బిట్‌కాయిన్లను ప్రమోటర్లు తమ ఆన్‌లైన్ వాలెట్లలో దాచుకున్నారు. వీటిలో 285 బిట్‌కాయిన్లు రాజ్‌కుంద్రా వద్ద ఉన్నాయి. వాటి విలువ రూ.150 కోట్లపైమాటే'' అని ఈడీ ఆరోపిస్తోంది.



తమ ఓటరు గుర్తింపు కార్డులను చూపిస్తున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు

అక్కా చెల్లెళ్ల 'నిశ్శబ్ద' విప్లవం

లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఓటేయనున్నారు..

గ్రామానికే స్ఫూర్తిదాయకంగా నిలిచారు..

గందోహ్(జమ్మూకశ్మీర్): ఆరోగ్యంగా ఉండి కూడా ఓటేయడానికి బద్ధకించే పౌరులున్న దేశం మనది. అలాంటిది పుట్టుకతోనే చెవుడు, మూగ సమస్యలతో ఇబ్బందులు పడుతూ కూడా ఓటేయడానికి ముందుకొచ్చి మొత్తంగా గ్రామానికే ప్రేరణగా నిలిచిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల స్ఫూర్తిదాయక గాథ ఇది.

గ్రామంలో సగం కుటుంబాలకు సమస్యలు

జమ్మూకశ్మీర్‌లోని డోడా జిల్లాలోని భద్రవాహ్ పట్టణానికి 105 కిలోమీటర్ల దూరంలోని కొండప్రాంతంలో దధ్‌కాయ్ గిరిజన గ్రామం ఉంది. గ్రామంలో కేవలం 105 కుటుంబాలే నివసిస్తున్నాయి. ఇందులో సగానికి పైగా అంటే 55 కుటుంబాలను దశాబ్దాలుగా ఆరోగ్యసమస్యలు చుట్టుముట్టాయి. ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరైనా మూగ, చెవిటివారిగా మిగిలిపోతున్నారు. ఇలా గ్రామంలో 84 మంది ఉన్నారు. వారిలో 43 మంది మహిళలు, పదేళ్లలోపు 14 మంది చిన్నారులు ఉన్నారు. ఎక్కువ మంది మాట్లాడలేని కారణంగా ఈ గ్రామానికి సైలెంట్ విలేజ్ ఆఫ్ ఇండియా అనే పేరు పడిపోయింది. రేహమ్ అలీ ముగ్గురు కూతుళ్లు రేష్మా బానో(24), పర్వీన్ కౌసర్(22), సైరా ఖాటూన్(20)లకూ ఏమీ వినిపించదు. మాట్లాడలేరు కూడా. అయితే ఓటేసి తమ హక్కును వినియోగించుకోవాలనే కోరిన ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లలో బలంగా నాటుకుపోయింది. ఈసారి ఎలాగైనా ఓటేస్తామని ముగ్గురూ ఘంటాపథంగా చెబుతున్నారు. వీళ్లు ఓటేస్తుండటం ఇదే తొలిసారికావడం విశేషం. బీజేపీ నేత జితేంద్రసింగ్ పోటీచేస్తున్న ఉధమ్‌పూర్ ఎంపీ నియోజకవర్గం పరిధిలోనే ఈ గ్రామం ఉంది. శుక్రవారం జరగబోయే పోలింగ్‌లో ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నామని తమ ఊరికొచ్చిన మీడియా వాళ్లకు ఈ అక్కాచెల్లెళ్లు తమ ఓటర్ ఐడీ కార్డులు చూపించిమరీ చెబుతున్నారు. 'మొదటిసారిగా ఓటేయనున్న మ్యూట్ మహిళల ఉత్సాహం ఊరి జనం మొత్తానికి స్ఫూర్తినిస్తోంది' అని పొరుగింటి వ్యక్తి జమాత్ దానిష్ ఆనందం వ్యక్తంచేశారు. ''ఔత్సాహిత యువ మహిళా ఓటర్లను చూసి మొత్తం గ్రామమే గర్వపడుతోంది. ప్రతి ఇంట్లో ఇదే చర్చ. ఈ సారి ఇక్కడ 100 శాతం పోలింగ్ నమోదైనా ఆశ్చర్యపోనక్కర్లేదు '' అని గ్రామ మాజీ వార్డు సభ్యుడు మొహమ్మద్ రఫీక్ వ్యాఖ్యానించారు.

బీజేపీని విమర్శిస్తే దూషిస్తారా?

- మీడియా సంస్థలపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బీజేపీ విధానాలు ప్రజలకు శాపంగా మారాయని విమర్శ



కన్నూర్: కేంద్రంలోని అధికార బీజేపీ విధానాలను, సిద్ధాంతాలను విమర్శించినందుకు కొన్ని మీడియా సంస్థలు నిత్యం తనను దూషిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విమర్శించడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. గురువారం కేరళలోని కన్నూర్, పాలక్కాడ్, కొట్టాయంలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడారు. బీజేపీ తీరుపై నిప్పులు చెరిగారు. ఆ పార్టీ విధానాలు దేశ ప్రజలకు శాపంగా మారాయన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై తాను పోరాటం సాగిస్తున్నానని చెప్పారు. అందుకు దూషణలు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన మీడియా చానళ్లు తనను లక్ష్యంగా చేసుకొని రోజంతా తిట్లదండకం వల్లిస్తున్నాయని ఆక్షేపించారు.

బీజేపీతో పినరయి విజయన్ లాలూచీ

భారతదేశం ఇప్పుడున్నంత అస్తవ్యస్తంగా గతంలో ఎన్నడూ లేదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సంపద పంపిణీలో ఇప్పుడున్న అసమానతలు గతంలో లేవని గుర్తుచేశారు. అందుకే రాబోయే తమ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై రాహుల్ మండిపడ్డారు. బీజేపీతో విజయన్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఇద్దరు ముఖ్యమంత్రులు జైలులో ఉన్నారని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయన్ ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు ఆయనను ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు. దేశ ప్రజలపై ఒకే భాష, ఒకే చరిత్రను రుద్దడానికి కమల దళం కుట్రలు పన్నుతోందని పేర్కొన్నారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనే ఎన్నికలివి

ఈ ఎన్నికలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు జరుగుతున్న ఎన్నికలు అని రాహుల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు వీడియో సందేశం ఇచ్చారు. భారతదేశం అనే భావనను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ సాగిస్తున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్‌కు కార్యకర్తలే వెన్నుముక అని, వారిపై పెద్ద బాధ్యత ఉందని చెప్పారు. స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థలపై, న్యాయ వ్యవస్థపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాడికి దిగుతున్నాయని ఆరోపించారు.

స్వదేశీ క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతం

భువనేశ్వర్(ఒడిశా): దేశీయంగా అభివృద్ధి చేసిన ఇండిజినస్ టెక్నాలజీ క్రూయిజ్ మిస్సైల్(ఐటీసీఎం)ను గురువారం ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి విజయవంతంగా పరీక్షించారు. ఇందులో ఉపవ్యవస్థలను అంచనాల మేరకు పనిచేశాయని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తెలిపింది. క్షిపణి ప్రయాణ మార్గంలో ఏర్పాటు చేసిన రాడార్, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్, టెలిమెట్రీ వంటి సెన్సార్ల ద్వారా పనితీరును అంచనా వేసినట్లు పేర్కొంది. దీంతోపాటు, వాయుసేనకు చెందిన ఎస్‌యూ–30 ఎంకే–ఐ విమానం ద్వారా కూడా క్షిపణి ప్రయాణం తీరును అంచనా వేసినట్లు డీఆర్‌డీవో వివరించింది.

ఇరాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న మహిళా క్యాడెట్

న్యూఢిల్లీ: ఇరాన్ అధీనంలో ఉన్న సరుకు రవాణా నౌక ఎంఎస్‌సీ ఏరీస్‌లోని 17 మంది భారతీయ సిబ్బందిలోని ఏకైక మహిళా క్యాడెట్ సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. కేరళలోని త్రిసూర్‌కు చెందిన ఆన్ టెస్సా జోసెఫ్‌ను ఇరాన్ ప్రభుత్వం విడుదల చేయడంతో గురువారం మధ్యాహ్నం విమానంలో కొచ్చిన్‌కు చేరుకున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. మిగతా 16 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా విడుదల చేయించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేసింది. వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని, భారత్‌లోని కుటుంబసభ్యులతో ఫోన్‌లో సంభాషిస్తున్నట్లు కూడా వివరించింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ నాలుగు రోజుల క్రితం ఇరాన్ విదేశాంగ మంత్రి అమిర్ అబ్దొల్లాహియన్‌తో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేసింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలున్నాయనే అనుమానంతో ఇరాన్ ప్రత్యేక బలగాలు ఈ నెల 13న హోర్ముజ్ జలసంధిలో ఉన్న ఎంఎస్‌సీ ఏరీస్ నౌకను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.





నెమలి కళేబరాన్ని తరలిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎండదెబ్బకు నెమలి బలి!

ఖైరతాబాద్ : భానుడి ప్రతాపానికి మనుషులే కాదు పక్షులు, జంతువులు కూడా తాళలేకపోతున్నాయి. గురువారం నగరంలో తీవ్రస్థాయిలో ఎండలు ఉండటంతో వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు జారీచేసింది. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లోకి పక్కనే ఉన్న ఐజీ మింట్ లోంచి నెమలి.. రెండో అంతస్తుపై ఉన్న పెంట్ హౌస్ రేకులపైకి వచ్చింది. పైన శబ్దం రావడంతో ఇంటి యజమాని ఆ చుట్టుపక్కల గమనిస్తుండగానే రేకులపై నుంచి ఒక్కసారిగా నెమలి కింద పడిపోయింది. దీంతో ఆయన నెమలికి నీళ్ల తాగించే ప్రయత్నం చేశారు. నెమలి నీళ్ల తాగకపోగా కదలకుండా ఉండటంతో వెంటనే కాలనీ సెక్రటరీ కిషోర్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డీఆర్‌ఓ జ్యోతి తన టీంతో అక్కడికి చేరుకున్నారు. నెమలి మృత కళేబరాన్ని కారులో కేబీఆర్ పార్కు తరలించారు. ఎండ వేడిమి కారణంగా నెమలి డీ హైడ్రేషన్‌తో చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

చేసేదే చెబుతా | చెప్పింది చేస్తా



'నేనేమీ ఆస్తులు కూడబెట్టేందుకో? అధికారాన్ని అనుభవించేందుకో? రాజకీయాల్లోకి రాలేదు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు, చేవెళ్ల ప్రజలకు సేవ చేసుకునేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. ఎన్నికల్లో గెలుపు కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వను. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా ఝూటా మాటలు చెప్పను. నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోలేను. ఏది ఆచరణ సాధ్యమో ఆయా అంశాలపై మాత్రమే హామీలు ఇస్తాను. బీజేపీ సిద్ధాంతాలను, ప్రధాని మోదీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. మోదీ బొమ్మను చూపించి ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థిస్తా. ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇటీవలే ప్రజల్లోకి వెళ్లాను. నామినేషన్ తర్వాత ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తా. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, ఇతర పార్టీ పెద్దలతో రోడ్ షోకు ప్లాన్ చేస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్‌ఎస్ సంస్థాగతంగా బలహీనపడింది. కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ ఉండబోతోంది' అని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

– వివరాలు 8లో ▸

ఢిల్లీకి దీటుగా..



ఢిల్లీకి దీటుగా హైదరాబాద్ రూపాంతరం చెందుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు సివిల్స్ కోచింగ్‌కు హైదరాబాద్ హబ్‌గా మారింది. దేశంలో టాప్ 10 ఫ్యాకల్టీ మొత్తం తెలుగు రాష్ట్రాల వారే కావడం, వారు హైదరాబాద్‌లో కూడా క్లాసులు తీసుకోవడం హైదరాబాద్ హబ్‌గా మారడానికి మరో కారణం. ఇక్కడ పేద విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా హాస్టల్స్, ఫుడ్, లివింగ్ కాస్ట్, వాతావరణం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఢిల్లీకి వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉండి చదువుకుంటూ సమయాన్ని, ఖర్చును ఆదా చేసుకోవాలి.

– ఎం.ఆర్.రెడ్డి, సలహాదారు, ఎమిగోస్ ఐఏఎస్ అకాడమీ

సివిల్స్ అభ్యర్థులకు అనువుగా నగరం..



గతంలో సివిల్స్‌లో ర్యాంకు సాధించిన వారే స్వయంగా ఇనిస్టిట్యూట్‌లు పెట్టి విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడం బాగుంది. ర్యాంకులు సాధించిన అభ్యర్థులను తీసుకువచ్చి వారితో తర్ఫీదు పొందే విద్యార్థులను మమేకం చేయడం కూడా స్ఫూర్తి కలుగుతోంది. హిందీ, ఇంగ్లిష్‌లతో పాటు ఫుడ్, లైబ్రరీ, స్టడీ హాల్స్ ఇలా అన్నీ అనువుగా ఉండడంతోనే సివిల్స్ అభ్యర్థులు ఎక్కువగా హైదరాబాద్‌ను ఎంచుకోవడానికి ప్రధాన కారణం.

– నాగభరత్, సివిల్స్ 580వ ర్యాంకర్

సివిల్స్ హబ్

నాడు ఢిల్లీ.. నేడు భాగ్యనగరం



- కోచింగ్‌లో తనదైన ముద్ర
- దక్షిణ భారతంలోనే అగ్రగామి
- కోచింగ్‌కు ఏటా లక్ష మంది అభ్యర్థులు
- తక్కువ ఖర్చుతో చక్కటి వసతులు
- అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో బోధన
- ఇటీవలి ఫలితాల్లో 60 మందికిపైగా ఎంపిక
- ఈ ఏడాది మెయిన్స్‌కు 600 మంది తెలుగు విద్యార్థులు
- 1980లో తొలిసారిగా హైదరాబాద్ స్టడీ సర్కిల్
- నగరంలో మొత్తంగా 50కిపైగానే కోచింగ్ సెంటర్లు

చింతరెడ్డి వీరారెడ్డి

సివిల్స్ ప్రిపరేషన్స్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్, కరోల్ బాగ్, ముఖర్జీనగర్, లక్ష్మీనగర్. ఇది ఒకప్పటి మాట. నేడు హైదరాబాద్ నగరం సివిల్స్ కోచింగ్‌కు హబ్‌గా మారుతోంది. ముఖ్యంగా దక్షిణ భారతంలో హైదరాబాద్ కేంద్రంగా ప్రముఖ సివిల్స్ కోచింగ్ సెంటర్లు వెలిశాయి. ఆయా కేంద్రాల్లో కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు తుది ఫలితాల్లో మెరుస్తున్నారు. ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల్లో హైదరాబాద్ కేంద్రంగా సన్నద్ధమైన అభ్యర్థులు 60 మందికి పైగా ఉన్నట్లు అంచనా. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సైతం అభ్యర్థులు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధిస్తుండడం గమనార్హం. సివిల్స్ కోచింగ్‌లో తనదైన ముద్ర వేస్తున్న హైదరాబాద్ మహానగరం దేశ చిత్రపటంలో దూసుకుపోతోంది. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సాక్షి స్పెషల్ స్టోరీ

ఢిల్లీ నుంచి భాగ్య నగరానికి..

ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ ఇచ్చే ప్రముఖ సెంటర్లు గత కొన్నాళ్లుగా హైదరాబాద్‌లోనూ తమ శాఖలను విస్తరించాయి. ప్రిలిమ్స్, మెయిన్స్, టెస్ట్ సిరీస్, ఇంటర్వ్యూలకు కలిపి లేదా వేర్వేరుగా కోచింగ్ అందిస్తున్నాయి. కొన్ని కేంద్రాలైతే ఢిల్లీ నుంచి రెగ్యులర్‌గా ఫ్యాకల్టీలను పిలిపించి హైదరాబాద్‌లో కోచింగ్ క్లాసులు నిర్వహిస్తున్నాయి. మరికొన్ని ఇక్కడి ఫ్యాకల్టీలతో క్లాసులు నిర్వహిస్తున్నాయి.

అన్ని సదుపాయాలతో..

సివిల్స్‌కు ఏటా లక్ష మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటున్నారు. వీరిలో కొంత మంది ప్రిలిమ్స్, మరికొంత మంది మెయిన్స్, ఇంకొంత మంది ఆప్షనల్ సబ్జెక్టులకు కొందరు కేవలం ఇంటర్వ్యూలకు, మాక్ టెస్టులకు మాత్రమే కోచింగ్ సెంటర్లలో చేరుతున్నారు. ఇప్పుడు ఇవన్నీ మన హైదరాబాద్‌లోనే లభించడంతో అభ్యర్థులు నగర బాట పడుతున్నారు.

అద్దెలు తక్కువ.. వసతులు ఎక్కువ..

ఢిల్లీలో కోచింగ్ తీసుకునే అభ్యర్థులు అక్కడ ఖర్చులు భరించడం కష్టమే. చిన్న చిన్న గదులకే అద్దె ఎక్కువగా ఉండడం సరైన భోజన వసతులు లేకపోవడం, అక్కడి వాతావరణ పరిస్థితులు కూడా సౌత్ అభ్యర్థులకు ప్రతికూలంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ భారత అభ్యర్థులకు మన భాగ్యనగరం ప్రముఖ హబ్‌గా మారింది. తక్కువ ఖర్చుతోనే చక్కటి వసతులు ఉన్నాయి. ఇళ్లు, హాస్టల్స్, స్టడీ హాల్స్, మన ఆహారం మొదలైనవి అందుబాటులో ఉండడంతో ఇక్కడ ఎక్కువగా తర్ఫీదు పొందడానికి మొగ్గు చూపుతున్నారు.



ఇక్కడ అనుభవమున్న ఫ్యాకల్టీ, మెటీరియల్‌కు కొదవలేదు. ఈ ఏడాది సుమారు 600 మంది తెలుగు అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వారిలో సుమారు 8–10 శాతం మంది తుది జాబితాలో ఉంటున్నారు. హైదరాబాద్‌లోనూ రెండేళ్లుగా ప్రిలిమ్స్ ఓరియంటేషన్ కూడా బాగా పెరుగుతోంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుంచి మరిన్ని ర్యాంకులు వచ్చే అవకాశాలున్నాయి.

ఎమోషనల్ సపోర్టు..

సివిల్స్ ప్రిపరేషన్ ఎంతో ఓపికతో కూడుకుని ఉంటుంది. నోటిఫికేషన్ నుంచి ఫలితాలు వెలువడే వరకు కనీసం ఏడాదిన్నర సమయం పడుతుంది. ఒకే ప్రయత్నంలో సాధించే వారు తక్కువే. కాబట్టి కొన్నేళ్ల పాటు శ్రమించే అభ్యర్థులకు ఎల్లవేళలా స్నేహితుల తోడ్పాటు, కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. ఈ క్రమంలో హైదరాబాద్‌లోనే ఉండడం వల్ల వారికి ఎమోషనల్ సపోర్టు లభిస్తోంది.

ఫీజులు ఇలా..

ఫీజుల పరంగా చూస్తే ఢిల్లీ, హైదరాబాద్ కోచింగ్ సెంటర్లలో పెద్దగా వ్యత్యాసాలు లేనట్లు చెప్పవచ్చు. ఏడాది పాటు ఉండే ప్రిలిమ్స్, మెయిన్స్, టెస్ట్ సిరీస్‌కు రూ.1.20 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆప్షనల్ సబ్జెక్టుకు రూ.30– రూ.40 వేలు వసూలు చేస్తున్నారు.

ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహం..

మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థులకు రూ.50 వేలు, ఇంటర్వ్యూలకు అర్హత సాధించిన అభ్యర్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహక బహుమతిని ఏపీ ప్రభుత్వం అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా హైదరాబాద్ ఢిల్లీని మించిన హబ్ కావాలంటే ఏపీ సర్కారు వలెనే ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

పేరెన్నిక ఫ్యాకల్టీ తెలుగువారే..

సివిల్స్‌కు తర్ఫీదు ఇచ్చే ఫ్యాకల్టీలో దేశంలోనే పేరెన్నికగల ఫ్యాకల్టీ తెలుగు వారే కావడం గమనార్హం. ఢిల్లీలో తరగతులు బోధిస్తున్న వారిలో సీనయ్య (హిస్టరీ), రెజ్వాన్, డి.బి. కుమార్ (జాగ్రఫీ), శ్రీరామ్(ఎకానమీ), పవన్ (ఇండియన్ పాలిటీ), జయకృష్ణ (ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్), వెంకన్న (మ్యాథమెటిక్స్)లు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. వీరు అప్పుడప్పుడూ హైదరాబాద్ వచ్చి కోచింగ్ సెంటర్లలో తరగతులు నిర్వహిస్తున్నారు.

ఏటా పెరుగుతున్న అభ్యర్థులు..

తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి గతంలో సివిల్స్ కోసం కోచింగ్ తీసుకునే ఫ్రెషర్స్ 2–3 వేల మంది మాత్రమే ఉండే వారు. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 5–6 వేల మంది ప్రతి సంవత్సరం సివిల్స్ కోచింగ్ కోసం హైదరాబాద్ బాట పడుతున్నారు. ఢిల్లీలో కోచింగ్ తీసుకుంటున్న వారిలో తెలుగు వారే అధికంగా ఉండడం గమనార్హం.

1980లో అంకురార్పణ..

1980లో తొలిసారిగా హైదరాబాద్ స్టడీ సర్కిల్.. ఆ తర్వాత రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్స్ మాత్రమే సివిల్స్‌కు కోచింగ్ ఇచ్చేవి. ఆ తర్వాత ఆర్‌సీ రెడ్డితో పాటు పలు కోచింగ్ సెంటర్లు వెలిశాయి. ప్రస్తుతం చిన్నవి పెద్దవి కలిసి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ పరిసర ప్రాంతాల్లోని అశోక్‌నగర్, గాంధీనగర్, హిమాయత్‌నగర్‌లలో 45–50 కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 25–30 వేల మంది సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుంటారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లెందరో..

40 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ఇక్కడ తర్ఫీదు పొందిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్‌లతో పాటు ఉన్నత స్థానాలలో వేలాది మంది ఉన్నారు. అందులో స్మితా సబర్వాల్, అనూదీప్ దురిశెట్టి, అభిషేక్ మహంతి, అవినాష్ మహంతి, పవన్ దత్తా, చైతన్యరెడ్డి, అనన్యరెడ్డి, ముత్యాల రాజు, రోణంకి గోపాలకృష్ణ లాంటి ఎంతో మంది ఉన్నారు.

ఆంత్రోపాలజీ సబ్జెక్ట్‌కు హైదరాబాద్ నంబర్ వన్



దేశంలోనే ఆంత్రోపాలజీ సబ్జెక్ట్‌కు హైదరాబాద్ నంబర్‌వన్‌గా ఉంది. ఆ సబ్జెక్టు నుంచే గత మూడేళ్లగా ఎక్కువ సంఖ్యలో ర్యాంకులు వస్తున్నాయి. కొన్ని ప్రోగ్రామ్‌లు హైదరాబాద్‌లో ప్రకటించిన తర్వాతే ఢిల్లీలో ప్రకటిస్తున్నారు. మరో రెండు మూడేళ్లలో ఢిల్లీని మించి హైదరాబాద్ మొదటిస్థానం సాధించే అవకాశం ఉంది.

– మంజునాథ్, ఆంత్రోపాలజీ ఫ్యాకల్టీ

ఈ సబ్జెక్టులకే క్రేజీ..

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంత్రోపాలజీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు ఎక్కువ క్రేజీ ఉండడంతో హైదరాబాద్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఈ సబ్జెక్టులనే ఆప్షనల్‌గా ఎంచుకుంటున్నారు. ఎక్కువ ర్యాంకులు కూడా ఈ సబ్జెక్టులు చదివిన వారికే వస్తున్నాయి.

స్టడీతో పాటు మోటివేషన్ కూడా..

ఇక్కడ కేవలం సివిల్స్‌కు తర్ఫీదును ఇవ్వడమే కాకుండా అభ్యర్థులకు ఓరియంటేషన్ క్లాసులు, మోటివేషన్ తరగతులు, అవసరమైన గైడెన్స్ ఇస్తుంటారు. ముఖ్యంగా ఆకెళ్ల రాఘవేంద్ర, జేడీ లక్ష్మీనారాయణ, జయప్రకాష్ నారాయణ, ప్రొఫెసర్ కోదండరామ్‌లతో పాటు ఇటీవల ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికైన అభ్యర్థులను కూడా తీసుకువచ్చి తర్ఫీదు పొందే అభ్యర్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు. ఇక మెంటార్‌షిప్‌లో కల్యాణ్, సుధీర్‌లు సివిల్స్ అభ్యర్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నారు.

అత్యాధునిక సదుపాయాలు..

ఢిల్లీకి ఏ మాత్రం తీసిపోని విధంగా హైదరాబాద్‌లో ఫ్యాకల్టీ, డిజిటల్ క్లాస్ రూమ్స్, టెస్ట్ సిరీస్‌లు, మెంటార్ షిప్‌లు, మాక్ ఇంటర్వ్యూలు, స్టడీ హాల్స్, లైబ్రరీ, హాస్టల్స్ ఉండడం కూడా సివిల్స్ అభ్యర్థులు హైదరాబాద్ ఎంచుకోవడానికి మరో కారణం.



అర్హులంతా ఓటు వేసేలా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అర్హులంతా ఓటు వేసేలా ఎన్నికల విధుల్లోని అధికారులు పని చేయాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీలోని తన కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, అభ్యర్థుల ఖర్చు, ఓటరు అవగాహన ప్రచార కార్యక్రమాలు, పోలింగ్ నిర్వహణకు మ్యాన్‌పవర్, మెటీరియల్ మేనేజ్‌మెంట్ తదితర నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీవిజిల్, ఎస్ఎంఎస్ మానిటరింగ్, ఎన్‌జీఎస్ పోర్టల్, ఎన్‌కోర్ యాప్, క్యూ మేనేజ్‌మెంట్, ఓటరు టర్నవుట్ తదితర యాప్‌లు, నోడల్ అధికారుల పని తీరు గురించి చర్చించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్‌లో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫారం–12 ఆమోదం పొందిన ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటరు పోలింగ్ పెరిగేందుకు చేపడుతున్న స్వీప్ కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల విధుల నుంచి ఎవరికీ ఎలాంటి మినహాయింపుల్లేవని, తమ సిబ్బంది విధులు నిర్వహించేలా అన్ని శాఖల హెచ్‌ఓడీలకు లేఖలు రాయాలని సంబంధిత నోడల్ ఆఫీసర్‌కు సూచించారు.

ఎన్నికల కోడ్‌లో బదిలీలా?

బంజారాహిల్స్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా బదిలీలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రజనీకాంత్‌రెడ్డిని ఇక్కడి నుంచి సికింద్రాబాద్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో యూసుఫ్‌గూడ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణను జూబ్లీహిల్స్ సర్కిల్‌కు బదిలీ చేశారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌కు డాక్టర్ కవితను నియమించారు. కీలకమైన నామినేషన్ల ఘట్టం, ప్రచారం, పోలింగ్ ప్రక్రియ, అనుబంధ జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ఈ బదిలీలు కలకలం సృష్టిస్తున్నాయి. జీహెచ్ఎంసీలోని ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను బదిలీ చేయడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. జూబ్లీహిల్స్ సర్కిల్–18 ఏఎంహెచ్‌ఓను ఎన్నికల కోడ్ అమలులో ఉండగా బదిలీ చేయడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత హఠాత్తుగా కోడ్ అమలులో ఉండగా బదిలీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ బదిలీల వెనుక ఓ కీలక అధికారి ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


బతికున్నోళ్లనూ చంపేశారు!

నగర ఓటరు జాబితాలో సిత్రాలెన్నో

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఓటరు జాబితాలో గత ఏడాదిగా 5.41 లక్షల ఓటర్లను తొలగించిన ఎన్నికల విభాగం సిబ్బంది బతికున్న వారినీ మరణించినట్లు పేర్కొంటూ జాబితాలో పేర్లు తొలగించారు. అలా 47,141 మందిని మరణించినట్లుగా పేర్కొన్నారు. అందులో ఒక నియోజకవర్గంలో మరణించిన వారిగా పేర్కొంటూ 15,025 మంది పేర్లను జాబితా నుంచి తొలగించారు. వివిధ రాజకీయ పక్షాల నుంచి అందిన ఫిర్యాదులతో తిరిగి క్షేత్రస్థాయి సర్వేలు, విచారణలు జరగ్గా వారిలో మరణించిన వారు 3,397 మందే ఉన్నట్లు లెక్క తేలింది. మిగతా వారంతా బతికే ఉన్నప్పటికీ, వారి పేర్లను జాబితాలోంచి తొలగించారు. ఒకే భవనంలో 50 మందికి మించిన ఓటర్లు 680 భవనాల్లో 51,316 మంది ఉండటంపై అనుమానం రావడంతో సర్వే చేయగా వారిలో 41,482 మంది నిజంగానే ఉన్నట్లు గుర్తించారు. ఇలా వివిధ అంశాల్లో వాస్తవాలకు, జాబితాలోని ఓటర్లకు వ్యత్యాసముంది. పొరపాట్లు లేకుండా సవ్యమైన ఓటరు జాబితా కోసం చేపట్టిన చర్యల్లో ఇలాంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇక సింగిల్ ఓటరున్న ఇళ్లపైనా అనుమానాలుండగా, వాటిల్లో స్వల్ప తప్పిదాలే చోటు చేసుకున్నట్లు తెలిసింది. దాదాపు 1150 మందికి సంబంధించి మాత్రం పొరపాట్లు జరిగినట్లు సమాచారం. స్వచ్ఛమైన జాబితా కోసం చర్యలు తీసుకున్నామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు.

సమన్వయంతో హనుమాన్ జయంతి

నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 23న జరగనున్న హనుమాన్ జయంతిని సమన్వయంతో, శాంతియుతంగా నిర్వహించుకుందామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న కమిషనర్ కార్యాలయంలో తనను కలిసిన బజరంగ్‌దళ్ నాయకులతో కొత్వాల్ భేటీ అయ్యారు. నగరంలో వైభవంగా జరిగే వీర హనుమాన్ విజయ యాత్రకు కొందరు ఆటంకం కలిగించే కుట్రలు చేస్తున్నారని, వారిని కట్టడి చేయాలని బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు కోరారు. వివిధ వినతులతో కూడిన పత్రాన్ని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు సీపీ (శాంతిభద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్‌లకు అందించారు. కొత్వాల్‌ను కలిసిన వారిలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి వీరేశలింగం, బజరంగ్‌దళ్ నాయకులు శ్రీకాంత్, రాహుల్, అఖిల్ పాల్గొన్నారు.

నామినేషన్లకు నాంది

మల్కాజిగిరిలో 9, చేవెళ్లలో 3..



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న ఈటల రాజేందర్

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నిలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం మొదలైంది. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పలువురు అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ కేంద్రాల్లో తమ నామినేషన్లు సమర్పించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో 9, చేవెళ్ల స్థానానికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్ సభ స్థానాల్లో తొలి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.వెంకట్ రమేష్ బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ ముస్తాఫా రిజ్వాన్, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధులు ఒక్కో సెట్ చొప్పున రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి శశాంక ఆయా అభ్యర్థులతో ప్రమాణం చేయించారు. ఇక మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో తొలి రోజు ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఆయన సతీమణి ఈటల జమున మరో నామినేషన్ దాఖలు చేశారు. అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా మేడే సత్యం, స్వతంత్ర అభ్యర్థులుగా పాలది పవన్ కుమార్, బేగరి లోకేష్, చిలకా చంద్రశేఖర్, మాలోతు శంకర్ నామినేషన్, పెసరికాయల పరీక్షిత్తురెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సికింద్రాబాద్ స్థానానికి తొలిరోజు నామినేషన్ దాఖలు కాలేదు.

రికార్డు బ్రేక్!



- గ్రేటర్‌లో 4,053 మెగావాట్ల విద్యుత్ డిమాండ్
- 2023 మే 19న 3,756 మెగావాట్లు
- 2024 ఏప్రిల్ 1న 3,832 మెగావాట్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో గురువారం రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. గతంలో నమోదైన రికార్డులను బ్రేక్ చేస్తూ గురువారం ఏకంగా 4,053 మెగావాట్లు నమోదు కావడం విశేషం. 2023 మే 19న అత్యధికంగా 3,756 మెగా వాట్లు నమోదు కాగా, అదే 2024 ఏప్రిల్ 1న 3,832 మెగావాట్లు నమోదైంది. డిస్కం చరిత్రలో ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం జరగడం ఇదే తొలిసారి. గతంలో ఉన్నదూ లేని విధంగా విద్యుత్ వినియోగం నమోదువుతుండటంతో ఇంజినీర్లు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఒత్తిడికి లోనవుతున్న సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లను గుర్తించి సామర్థ్యాన్ని పెంచారు. అధిక లోడు ఫీడర్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎక్స్ వేదికగా అభినందించారు.

వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

సుధారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పి. సుధారెడ్డి



బన్సీలాల్‌పేట్: మన పూర్వీకుల నుంచి వస్తున్న వారసత్వ సంపదను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సుధారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పీ. సుధారెడ్డి అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ మెట్ల బావి ప్రాంతంలో 'సన్మత' పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుధారెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా మరుగున పడిన వారసత్వ సంపదను కాపాడేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. నగరంలోని సాలార్జంగ్ మ్యూజియంను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.









బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీ-ఫామ్‌ల అందజేత

గ్రేటర్‌పరిధిలో ఎన్నికల బరిలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థులకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీ-ఫామ్‌లను అందజేశారు. హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్, మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితలకు గురువారం ఆయన బీ-ఫామ్ అందజేశారు. ఎన్నికల సరళిపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. -సాక్షి, సిటీబ్యూరో

బైక్ లాక్కెళ్లారనే అవమానంతో..

మహిళ ఆత్మహత్య

ఫిలింనగర్: తమ బైక్ లాక్కెళ్లడమే కాకుండా రూ. 20 వేలు డిమాండ్ చేశారనే అవమానంతో మనస్తాపానికిలోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలివీ... దీన్‌దయాళ్‌నగర్ బస్తీకి చెందిన సత్యాల వెంకటరమణ, సూర్యకుమారి(35) దంపతులకు సుశాంత్(14), జోత్స్న(11) ఇద్దరు సంతానం. బుధవారం ఉదయం భార్యాభర్తలు డ్యూటీకి వెళ్లిపోయాడు. అదే సమయంలో వారి కుమారుడు సుశాంత్ బైక్‌పై గుడికి వెళ్లాడు. కొద్దిసేపటికే సుశాంత్ తండ్రికి ఫోన్ చేసి హకీంబాబా దర్గా వద్ద తాను ఓ కారును ఢీకొట్టానని, కారు దెబ్బతినడంతో చంద్రశేఖర్, మహేష్ అనే వ్యక్తులు బైక్ లాక్కున్నారని, కారు డ్యామేజీ కింద రూ. 20 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపాడు. దీంతో అతను ఈ విషయాన్ని పేస్ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న తన భార్య సూర్యకుమారికి చెప్పాడు. దీంతో ఇంటికి వచ్చిన సూర్యకుమారి రూ. 20 వేలు జమ చేసే విషయంలో తీవ్ర ఒత్తిడికి లోనైంది. బైక్ లాక్కెళ్లడాన్ని అవమానంగా భావించిన ఆమె బుధవారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చంద్రశేఖర్, మహేష్‌ల కారణంగా తన భార్య ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక..

కుమార్తె ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయ్‌నగర్ కాలనీ, ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్‌లో శ్రీదేవి తన కుమార్తె వైష్ణవి(20)తో కలిసి నివాసం ఉంటోంది. శ్రీదేవి భర్త సూర్యారావు మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వైష్ణవి దుండిగల్‌లోని కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. తండ్రి చనిపోయినప్పటి నుంచి ముభావంగా ఉంటున్న వైష్ణవి తండ్రి లేని జీవితం తనకు అక్కర్లేదని, తాను చనిపోతానని పలుమార్లు తల్లితో చెప్పింది. ఈ నెల 17 తల్లి శ్రీదేవి బయటికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న వైష్ణవి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 'ఐ యామ్ సారీ.. నాకు నాన్న కావాలి' అని సూసైడ్ నోట్ పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

INTERVIEW


- కాంగ్రెస్ అభ్యర్థి చిల్లర మాటలతో బీఆర్‌ఎస్ గ్రాఫ్ పెరుగుతోంది
- అయినా కాంగ్రెస్‌తోనే నాకు ప్రధాన పోటీ ఉంటుంది
- నేను అధికారంలో ఉన్నప్పుడు పార్టీ మారలే...
- ఆయన మాత్రం పవర్‌లో ఉన్నప్పుడే పార్టీ మారారు
- తుది శ్వాస వరకు మోదీతోనే ఉంటా
- 'సాక్షి'తో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేసేదే చెబుతా.. | చెప్పింది చేస్తా..

ఝూటా మాటలు చెప్పను.. వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోను!

'నేను ఆస్తులు కూడబెట్టేందుకో? అధికారాన్ని అనుభవించేందుకో? రాజకీయాల్లోకి రాలేదు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు, చేవెళ్ల ప్రజలకు సేవ చేసుకునేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. ఎన్నికల్లో గెలుపు కోసం అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వబోను. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా ఝూటా మాటలు చెప్పబోను. నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోలేను. ఏదీ ఆచరణ సాధ్యమో ఆయా అంశాలపై మాత్రమే హామీలు ఇస్తా. గతంలో ఎంపీగా చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు మళ్లీ వివరిస్తా. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. మోదీ బొమ్మను చూపించి ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థిస్తా' అని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం 'సాక్షి' ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే...!

-సాక్షి, సిటీబ్యూరో



ప్రచారం ఎలా కొనసాగుతుంది. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

కొండా: ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇప్పటికే 370 గ్రామాల్లో పర్యటించా. ఆయా గ్రామాల్లో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అర్బన్ ఏరియాల్లోనే కాకుండా రూరల్ ప్రాంతాల్లోనూ బీజేపీ గాలి వీస్తోంది. ప్రజలకు మోదీ ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. మోదీ విధానాలు నచ్చి ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు 3 వేల మందికి పైగా బీజేపీలో చేరారు.

ఏ పార్టీ నుంచి ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు?

కొండా: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత ఆ పార్టీ సంస్థాగతంగా బలహీనంగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థికి ముదిరాజ్ సమాజంలో మంచి గుర్తింపు ఉంది. అయితే కాంగ్రెస్ అభ్యర్థి చేస్తున్న చిల్లర కామెంట్లు మళ్లీ అ పార్టీ గ్రాఫ్‌ను పెంచుతున్నాయి. ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌తోనే ప్రధానంగా పోటీ ఉండబోతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాదు..గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ వేవ్ కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థిలా ఝూటా మాటలు నేను మాట్లాడను. అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వను. కళ్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయబోను. . రాజకీయాల్లో ఉన్నంత కాలం నిజాయితీగా నిబద్ధతతో పని చేస్తా.

లోక్‌సభ స్థానంలో మైనార్టీల ఓట్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ ఓట్లు మీకు ఎలా పడతాయని భావిస్తున్నారు?

కొండా: కాంగ్రెస్ అభ్యర్థి పూర్తిగా ముస్లిం మైనార్టీ ఓట్లపైనే ఆధారపడుతున్నారు. ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఆరు లక్షల వరకు ఉంటారు. బీజేపీ ఆయా వర్గాలకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల్లో మోదీపై గౌరవం పెరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లోని మెజార్టీ క్రిస్టియన్లు బీజేపీతోనే ఉన్నారు. మాపై మతతత్వ ముద్ర వేసి..వాళ్లు మాత్రం మతం పేరుతో గెలుపొందాలనుకుంటున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ అవసరానికి ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టొద్దు. ఇది దేశానికి మంచిది కాదు.

తరచూ పార్టీలు మారుతారనే అపవాదు మీపై ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: పైరవీల కోసమో, ఆస్తులు కూడబెట్టేందుకో? నేను రాజకీయాల్లోకి రాలేదు. చేవెళ్ల ప్రజలకు మంచి చేయాలనే ఏకైక లక్ష్యంతోనే వచ్చాను. మొదట్లో బీఆర్‌ఎస్ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరాను. ఏ నినాదం పేరుతో అధికారంలోకి వచ్చిందో.. ఆ తర్వాత వాటిని మర్చిపోయింది. పార్టీ అధినేత వైఖరిలోనూ మార్పు వచ్చింది. తెలంగాణ ప్రజలకు మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతుండటం, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌కు బలమైన పార్టీ కాంగ్రెస్ అని భావించి, ఆ పార్టీలో చేరాను. కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్‌కు అమ్ముడు పోయింది. దీంతో నేను మరో ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది. మోదీ విధానాలు..దేశ అంతర్గత భద్రత, అభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపనకు ఫిదా అయ్యాను. బీజేపీలో చేరాను. చివరి శ్వాస వరకు ఇదే పార్టీలో కొనసాగుతా.

111 జీఓ రద్దు, కందిబోర్డు ఏర్పాటు, నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ రద్దు, శాటిలైట్ సిటీ పనులు, ఎంఎంటీఎస్ విస్తరణ పనులు నిలిచి పోయాయి. వీటి పరిష్కారం ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కొండా: నేను ఎంపీగా ఉన్నప్పుడే రూ.930 కోట్లతో బీజాపూర్ రోడ్డును మంజూరు చేయించా. రాజకీయ, రియల్ ఎస్టేట్ అవసరాల కోసం ఈ పనులను అడ్డుకున్నారు. కందిబోర్డు ఏర్పాటు కన్నా.. రైతులు పండించిన కందులకు మద్దతు ధర కల్పన, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తా. వికారాబాద్‌లో శాటిలైట్ సిటీ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రానికి లేఖ రాశాను. కనెక్టివిటీ కోసం ఇప్పటికే మన్నెగూడ రోడ్డును మంజూరు చేయించాను. ఎంపీగా గెలుపొందిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు, శాటిలైట్ సిటీ ఏర్పాటు పనులు పూర్తి చేయిస్తా. హైదరాబాద్- ముంబై బుల్లెట్ ట్రైన్ సర్వే మొదలైంది. వికారాబాద్ తొలి స్టాప్ ఏర్పాటు చేశారు. నేను ఎంఎంటీఎస్ మంజూరు చేయిస్తే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధుల లేమితో చేతులెత్తేసింది. తాండూరులోని నాపరాతి పరిశ్రమకు జీఎస్‌టీ 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాను. నాపరాయి వ్యర్థాలతో వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా. 111 జీఓ రద్దు కోసం తొలి లేఖ రాశాను. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ జీఓను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, దాని స్థానంలో ఉల్టాపల్టా జీవో 69 తీసుకొచ్చింది.

అపాయింట్‌మెంట్ లేనిదే ఎవరినీ కలువరనే అపవాదు ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: అపాయింట్‌మెంట్ తీసుకుని రావాలనే ప్రచారం తప్పు. తాను నిత్యం ప్రజల మధ్యే ఉంటాను. ఎవరూ వచ్చినా కలుస్తాను. ఆపదలో వచ్చిన వారికి అండగా నిలుస్తున్నా. కోవిడ్ సమయంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశాను. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్యులు సైతం నేరుగా వచ్చి కలవొచ్చు. చేవెళ్ల అభివృద్ధే లక్ష్యంగా నామినేషన్ రోజు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేస్తా.

నా భార్య కొడుతోంది..

- క్వారీ గుంతలో దిగి వ్యక్తి హల్‌చల్
- కాపాడిన పోలీసులు



కుత్బుల్లాపూర్: నా భార్య విపరీతంగా కొడుతోంది.. ఇంట్లో ఫ్యాన్ లేకుండా చేసింది.. పిల్లలను దగ్గరకు రాకుండా చేస్తుంది..చాకెట్లు ఇచ్చినా తీసుకోకుండా చేసింది.. డాడీ చనిపోయాడు.. అంటూ పిల్లలకు చెప్పడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి క్వారీ గుంతలో దిగి హల్‌చల్ చేశాడు. సకాలంలో అక్కడికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు అతనితో మాట్లాడి శాంతింపజేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దూలపల్లి ప్రాంతానికి చెందిన నగేశ్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్యా, పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య తనపై దాడి చేయడంతో పాటు పిల్లలను తన దగ్గరికి రానివ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం కొంపల్లి మున్సిపాలిటీ జయభేరి పార్క్ సమీపంలోని క్వారీ వద్దకు వచ్చి హల్‌చల్ చేశాడు. తనకు భార్యతో విడాకులు ఇప్పించాలని గుంతలోకి దూకాడు. విషయం తెలుసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు అక్కడికి చేరుకుని తాడు సహాయంతో అతడిని బయటకు తీసుకువచ్చారు. అనంతరం నగేశ్‌కు కౌన్సెలింగ్ చేశారు.

కేసులు షురూ!

- ఎన్నికల విధుల 'శిక్షణ'కు డుమ్మా కొట్టిన వారిపై కేసులు
- గైర్హాజరైతే చట్టరీత్యా చర్యలు: జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల విధుల కోసం నియమించిన అధికారుల్లో శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారిపై జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ కొరడా ఝుళిపించారు. గైర్హాజరైన సిబ్బందిపై ఆర్‌పీ యాక్ట్ 1951 సెక్షన్ 134 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం 10 మందిపై కేసులు పెట్టారు. వీరిలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న వారున్నారు. శిక్షణకు గైర్హాజరైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు గైర్హాజరైన వారికోసం ఈనెల 20న శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేశానికి ఈటల సేవలు అవసరం

- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి
- తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నాం:కిషన్‌రెడ్డి



మేడ్చల్‌రూరల్: మంత్రిగా పని చేసిన అనుభవం, కరోనా సమయంలో ప్రజలకు సేవలందించి జననేతగా నిలిచిన అనుభవజ్ఞుడైన మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సేవలు రాష్ట్రానికే కాకుండా దేశానికి ఎంతో అవసరమని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి అన్నారు. గురువారం ఈటల రాజేందర్ నామినేషన్ సందర్భంగా పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసం వద్ద ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పని చేసిన అనుభవం కలిగిన ఈటలను మల్కాజిగిరి ఎంపీగా గెలిపించి లోక్‌సభకు పంపిస్తారన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని, ఆయన సేవలు ఢిల్లీలో అవసరమన్నారు. ఈటల గెలిచిన తర్వాత మళ్లీ విజయోత్సవ సభకు వస్తానని తెలిపారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎవరూ ఊహించనన్ని సీట్లు బీజేపీ గెలుస్తుందని, మోదీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. మోదీ ప్రధానిగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని, అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిరాశలో ఉన్నారని అసలు ఏం చేస్తున్నారో ఆయనకే తెలియడం లేదన్నారు. రాహుల్ నాయకత్వం కొనసాగినన్ని రోజులు బీజేపీ అధికారంలో ఉంటుందన్నారు. రాష్ట్రంలో 12 సీట్లు గెలవబోతున్నామని జోస్యం చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీ టీం పేరుతో బీజేపీపై విష ప్రచారం చేస్తున్నాయని కానీ రెండు పార్టీలు బీజేపీతోనే తమకు పోటీ అని చెబుతున్నాయన్నారు. ప్రజలు కేసీఆర్‌ను గద్దె దించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆ పార్టీ ఐదేళ్లు అధికారంలో ఉండదని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో ఈటల గెలుపును ఆపగలిగే దమ్ము రెండు పార్టీలకు లేదన్నారు. ప్రజలంతా బీజేపీ, ఈటలకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్ లాగే రేవంత్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలు నమ్ముకున్నాడని ఆరోపించారు. ఆత్మగౌరవంతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. రెండు పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయాలని ప్రజలకు కోరారు. అనంతరం నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా తరలి వెళ్లారు.

బీజేపీలో చేరిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు భేతి సుభాష్‌రెడ్డి, ఆయన సతీమణి స్వప్న, బార్ కౌన్సిల్ వైస్ చైర్మెన్ సునీల్‌గౌడ్ తదితరులు కేంద్ర మంత్రులు హర్‌దీప్‌సింగ్, కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కంటోన్మెంట్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా వంశీ తిలక్‌ను రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ ప్రభాకర్, బోడిగె శోభ, నాయకులు రాజయ్య యాదవ్, తాడూరి శ్రీనివాస్, సామ రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శిల్పారెడ్డి, కొప్పు భాష, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

జగద్గిరిగుట్ట: ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ క్రాంతి కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మబండకు చెందిన షేక్ గౌస్ కుమారుడు షేక్ అయాన్ (15), షేక్ సయ్యద్ కుమారుడు షేక్ నవాజ్ (16) తో పాటు మరో స్నేహితుడు హైదర్ (16) స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నారు. గురువారం సాయంత్రం వారు ఈతకొట్టేందుకు దేవేందర్ నగర్‌లోని క్వారీ వద్దకు వెళ్లారు. గుంతలోకి దిగిన షేక్ అయాన్, షేక్ నవాజ్ నీటిలో గల్లంతయ్యారు. దీనిని గుర్తించిన హైదర్ స్థానికులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. బాచుపల్లి, జగద్గిరిగుట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని షేక్ అయాన్, షేక్ నవాజ్‌లను బయటికి తీసి ప్రగతి నగర్‌లోని ప్రసాద్ ఆసుపత్రికి తరలించగా, వారు అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ అయాన్ (ఫైల్)



షేక్ నవాజ్ (ఫైల్)

భూదాన బోర్డును ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మహదేవ్ తదితరులు

- ఆ భూములను అర్హులైన పేదలకు పంచాలి
- 74వ భూదాన్ దినోత్సవంలో మహాదేవ్, వెదిరె అరవింద్‌రెడ్డి

హిమాయత్‌నగర్: గొప్ప సంకల్పంతో ఏర్పాటు చేసిన భూదాన యజ్ఞ బోర్డుకు వెంటనే నూతన బోర్డును ఏర్పాటు చేసి దాని జ్యుడీషియల్ అధికారాలను కల్పించాలని పలువురు భూదాన ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ సిఫార్సు చేసిన ప్రతినిధులతోనే భూదాన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న దాదాపు లక్షన్నర ఎకరాల భూదాన భూములను నిరుపేదలకు అందిచడమే భూదాన యోధులకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. పేదలందరికీ భూములు దక్కే వరకు భూదాన పోరాటాన్ని కొనసాగిస్తామని వారు ప్రకటించారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో '74వ భూదాన్ దినోత్సవం' గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ట్రస్టీ కృష్ణ గౌడ్‌లతో కలిసి వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి భూదాన యజ్ఞ బోర్డు ఏర్పాటు, భూమి పంపిణీ గురించి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. పేదలకు పంచాల్సిన భూములను తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీలకు, కంపెనీలకు, గోశాలలకు పంచడం అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి తన కూతురు పేరుతో భూదాన భూములను కొనుగోలు చేసి అనంతరం ఆ భూమి భూదాన భూమి అని తనకు తెలియదనడం విడ్డూరమన్నారు. భూదాన భూములను పేదలకు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. యోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేసేందుకు హైదరాబాద్‌లో ఒక స్మారకాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని ఇస్తే తమ సొంత ఖర్చుతో అందులో స్మారకాన్ని నిర్మిస్తామన్నారు. తెలంగాణ సాయుధపోరాట యోధులు, భూదాన దాతల కుటుంబ సభ్యులు డాక్టర్ ప్రబోద్ చంద్రారెడ్డి, సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సాగర్ రెడ్డి, మల్లు కరుణ, బీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆరుట్ల సుశీలా దేవి, రావి ప్రతిభ, మమత, సర్వసేవా సంఘ్ రాష్ట్ర నాయకులు గరిగంటి రమేష్, చందూ పటేల్, దిడ్డి రాంబాబు, దిలీప్ నేత, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

4343 @ ఇంటివద్దే ఓటింగ్‌కు అర్హులు

ఇప్పటికే ఫారం-డి అందజేత

- ఈ నెల 20లోపు స్వీకరణ
- అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వోలు
- గత ఎన్నికల్లో ఖైరతాబాద్‌లో మంచి స్పందన

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికల్లో 85 సంవత్సరాలకు పైబడిన వృద్ధులు, కదలలేని స్థితిలో ఉండే దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే దిశగా అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

- అందులో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వృద్ధులు, దివ్యాంగులను గుర్తించారు.
- వీరందరికీ ఫారం-12 పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వృద్ధులు 2777 (85 ఏళ్ల వయసు పైబడిన వారు) మంది ఉండగా దివ్యాంగులు 1566 మంది ఉన్నారు.
- వీరందరికీ బీఎల్‌వోలు ఇప్పటికే ఫారం-12 డి పంపిణీ చేశారు. వారి నుంచి వివరాలు భర్తీ చేసుకొని ఇప్పటికే 20 శాతం సంబంధిత అధికారులకు అందజేశారు. ఓటరు జాబితాలో వృద్ధులు, దివ్యాంగులు ఎవరనేది ఇప్పటికే మార్కింగ్ చేశారు.
- బీఎల్‌వోలు వారి ఇంటికి వెళ్లి ఫారాలు అందజేస్తున్నారు. ఈ ఫారాల్లో పూర్తి వివరాలు నింపి ఈ నెల 20వ తేదీ వరకు అధికారులకు అందజేయాల్సి ఉంటుందని ఖైరతాబాద్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారిణి ప్రశాంతి వెల్లడించారు. నిర్ణీత సమయంలో ఎవరైతే అందిస్తారో వారు ఇంటి వద్ద ఓటు వేసేలా అధికారులు చర్యలు చేపడతారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం ముమ్మరంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



వృద్ధురాలికి ఫారం-12డి అందజేస్తున్న బీఎల్‌వో హేమలత

ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు...

- పోలింగ్ బూత్‌లో ఎలాగైతే కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తారో ఇంటి వద్ద ఓటు వేసే వారికి కూడా అలాగే ఏర్పాటు చేసి పూర్తి ఎన్నికల వాతావరణాన్ని కల్పించనున్నారు. రహస్యంగా ఓటు వేసేలా చర్యలు తీసుకోనున్నారు. పోలింగ్ అధికారుల బృందం అర్హులైన వారి ఇంటికి వెళ్తారు. ఓటింగ్ ప్రక్రియను వీడియో రూపంలో చిత్రీకరిస్తారు. పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు.
- గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్దే ఓటింగ్‌కు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి మంచి స్పందన లభించింది. ఇంటి వద్ద ఓటింగ్‌లో 80 శాతం పోలింగ్ జరగడంతో వచ్చే నెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ వంద శాతం ఓటింగ్ జరిపే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికి బీఎల్‌వోలు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను వారికి వివరిస్తున్నారు.

కనులపండువగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ శ్రీ రామవీధిలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాముల వారి పట్టాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. 21 మంది వైష్ణవ స్వాములతో నిర్వహించిన ఈ పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. శ్రీ రామస్తోత్ర పారాయణంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. పట్టాభిషేకం అనంతరం సర్వాభరణ మూర్తిగా ప్రత్యక్షమైన స్వామివారిని దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, శేషశైలాచార్యులు, ఆలయ ధర్మకర్త ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం



నృత్యకళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానంలో శ్రీరామ నవమి సందర్భంగా కూచిపూడి కళాకారిణి నిహంత్రిరెడ్డి శిష్య బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. సీతారామ కల్యాణ ఘట్టం సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లుగా తమ ప్రదర్శన ద్వారా చూపించారు. ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ మాల కొండయ్య హాజరై నృత్య కళాకారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశఋరు. కార్యక్రమంలో కాజ సూర్యనారాయణ, ఫినిక్స్ అధినేత చుక్కపల్లి సురేష్, ఆలయ ప్రధాన అర్చకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులు ఐకమత్యంతో మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేసుకుని కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం నారాయణగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల కమిటీలను చైతన్యం చేసి సంఘాలు ఏర్పాటు చేసుకుంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశం ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికాంత్, రాష్ట్ర యువత అధ్యక్షుడిగా పండుగ బాలు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి బండి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మేకల రవీందర్లను నియమిస్తూ వారికి నియామకపత్రాలను అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, అధ్యయన వేదిక చైర్మన్ నీల రాములు, రాష్ట్ర నాయకులు బల్ల సత్తయ్య, యాదగిరి, డాక్టర్ బోళ్ల వెంకట్, కనకయ్య, రవీందర్, పోలు లక్ష్మణ్, మల్లికార్జున్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

మాలలను ఓట్లు అడిగే అర్హత బీజేపీకి లేదు

తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్



మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

బంజారాహిల్స్: బీజేపీ మాలలను మోసం చేసిందని, కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలు మాలలను ఓట్లు అడిగే అర్హత లేదని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. బంజారాహిల్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మాలల జనాభా 80 లక్షలు ఉన్న సంగతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మరచిపోయారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలు మూడు ఉంటే ఆ మూడింటిని కూడా మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన వారికే కేటాయించడం శోచనీయమన్నారు. అలాగే కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక సీటును కూడా మాదిగ సామాజిక వర్గానికే కేటాయించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల జరిగే ఎస్సీ రిజర్వ్ స్థానాలన్నింటినీ మాదిగలకు కేటాయించి మాలలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీని మాలలంతా ఏకమై చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీజేపీలో ఉన్న మాలలు అందరూ బయటకు వచ్చి ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ నాయకులు మాట్లాడాన్ని ఆయన ఖండించారు. మాదగ జాతి ఆత్మగౌరవాన్ని మంద కృష్ణమాదిగ కోట్ల రూపాయలకు బీజేపీ కాళ్ల దగ్గర పెట్టారన్నారు. ఆయన చెబితే వినేవారు ఎవరూ లేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీలను ఓడించడానికి మాలలందరూ ఏకమై, ముఖ్యంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డిని చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు.

అజయ్‌కుమార్ అగర్వాల్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో పబ్లిక్ రిలేషన్స్ రంగంలో చేసిన విశేష సేవలకుగాను ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఎస్ఎంఈ చాంబర్స్ ఆఫ్ ఇండియా సలహాదారు, ఇంటర్నేషనల్ చాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ ×గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌×లో స్థానం పొందారు. ×పాజిటివ్ చేంజ్ మేకర్స్ ఇన్ ది వరల్డ్ 2023×లో భాగంగా ఎంపికైన 29 మందిలో డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్ కూడా ఒకరు. ఈ నేపథ్యంలో గురువారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని చబ్బీ చో రెస్టారెంట్ వేదికగా సక్సెస్ మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లండన్‌లోని లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో లండన్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును స్వీకరించానన్నారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, తెలంగాణ ప్రవాసి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్ అగర్వాల్, హిందీ మిలాప్ జీఎం ప్రకాష్ జైన్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో రాజకీయ పార్టీల సమావేశం

బంజారాహిల్స్: రాజకీయ పార్టీల నేతల సమావేశం గురువారం ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ కార్యాలయంలో నిర్వహించారు. వచ్చే నెల 13న జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ పోలింగ్, కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో నమోదు, దరఖాస్తుల పరిశీలన, ఫారం-డి పంపిణీ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ నెల 25న అనుబంధ ఓటరు జాబితా విడుదల అవుతుందని అధికారులు తెలిపారు. అలాగే ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పించిన నేపథ్యంలో ఆ ఓటర్ల జాబితాను కూడా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు.

వాల్మీకి రామాయణమే అసలైనది..



హిందీ అనువాద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అనువాద కర్తలు

పంజగుట్ట: రామాయణ చరిత్రలు వివిధ కవులు, రచయితలు రాసినవి సుమారు 300 వరకు ఉన్నాయని కాని అసలైన రామాయణం వాల్మీకి రామాయణమే దాన్ని భావి తరాలకు అందించాలనే ఈ హిందీ రామాయణ అనువాదం తీసుకువచ్చినట్లు అనువాదకర్త దంపతులు ప్రగ్యా బంకా, అనంత్ కేతాన్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హిందీ రామాయణం పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాల్మీకి రామాయణం సంస్కృతంలో ఉండటం, సంస్కృతం ఎక్కువమందికి రాకపోవడంతో ముంబయికి చెందిన అమీ గణంత్రా వాల్మీకి రామాయణం ఆధారంగా రచించిన ఆంగ్ల రామాయణ గ్రంథం 'రామాయణం అన్ రవైల్డ్' హిందీలోకి అనువదించాలని తమను కోరినట్లు దీంతో తాము సుమారు సంవత్సరం పాటు ఇందులో నిమగ్నమై హిందీ రామాయణ్‌కా అన్‌వరన్ పుస్తకం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు.

నేటి నుంచి జ్యువెలరీ షో

పంజగుట్ట: సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్ షోరూంలో ఈ నెల 19 నుంచి 28 వరకు హెరిటేజ్ జ్యువెలరీ షో నిర్వహించనున్నారు. గురువారం ప్రముఖ మోడల్స్, వినియోగదారులు అశ్రిత, చందన, ప్రియాంక ఆభరణాలు ప్రదర్శించారు. ఈ ప్రతిష్టాత్మక హెరిటేజ్ జ్యువెలరీ షోలో సంప్రదాయం, సౌందర్యాల అద్భుత కలయికతో కాలాలకు అతీతంగా నిలిచిపోయే బంగారం, వజ్రాలు, పోల్కీ విలువైన రత్నాలు ఇంకా మరెన్నో ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రఖ్యాత హస్తకళాకారులు రూపొందించిన ప్రత్యేక వివాహాభరణాలు కూడా ప్రదర్శనలో ఉన్నాయని, వినియోగదారులకు ఎంతో అద్భుతమైన అనుభూతి కలిగిస్తుందన్నారు.

ఈవ్‌టీజర్‌కు ఎనిమిది రోజుల జైలు శిక్ష

బంజారాహిల్స్: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న యువకుడికి న్యాయమూర్తి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని ఉదయ్‌నగర్‌లో నివసించే రాంజీకుమార్(20) కొంతకాలంగా ఆవారాగా తిరుగుతూ స్థానికంగా బాలికలను వేధిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంజీపై పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందా మురళి ఎదుట హాజరుపరిచారు. కేసు తీవ్రతను గుర్తించిన న్యాయమూర్తి రాంజీకి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మందుబాబుకు మూడు రోజుల జైలు...

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే సయ్యద్ వాసీం(30) కొంతకాలంగా మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. భార్యను కూడా హింసిస్తూ స్థానికంగా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తున్నాడు. బంజారాహిల్స్ పోలీసులు వాసీంపై ఐపీసీ సెక్షన్ 323, 70 (బి) సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందా మురళి ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపులపై పోలీసుల ఉక్కుపాదం

రహమత్‌నగర్: బెల్టు షాపులపై బోరబండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుస దాడులు చేస్తూ విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో డివిజన్‌లోని పలు ప్రధాన బెల్టు షాపులపై దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విక్రేతలపై కేసులు నమోదు చేశారు. తాజాగా బోర బండ సెక్టార్ ఎస్ఐ నాగూల్ మీరా నేతృత్వంలో పోలీసులు వినాయకరావు నగర్‌లో బుధవారం రాత్రి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో మేరి అలియాస్ మరియా(36) ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా 37 బాటిళ్ల (180 ఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

'వలస పేదల సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేయాలి

జన్ సేవా సంఘ్



మాట్లాడుతున్న సంఘ్ అధ్యక్షుడు ఆర్పీ సింగ్

హిమాయత్‌నగర్: దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్ నగరానికి వలస వచ్చిన పేదల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జన్ సేవా సంఘ్ డిమాండ్ చేసింది. వారి సంక్షేమం కోసం కృషి చేసిన పార్టీలకే పార్లమెంట్ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని సంఘ్ నేతలు స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు ఆర్‌పి సింగ్ మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని లక్షలాది మంది ×ప్రవాస్జీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తోందని, హైదరాబాద్‌లో నిర్మాణ, కార్మిక, కర్షక, రవాణా, ప్రవాసీ కూలీలు, చిరు వ్యాపారులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కమిషన్‌తో పాటు, ప్రవాసి భవనం, పాఠశాలలు, ప్రవాసీ ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. ఇందుకోసం హామీ ఇచ్చిన పార్టీలకే జన్ సేవా సంఘ్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. సంఘ్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ చౌదరి, కోశాధికారి వినీత్ సింగ్, మాజీ అధ్యక్షుడు పరమానంద శర్మ, ఎల్.ఎమ్.చౌదరి, రాధే శ్యామ్, హరేందర్‌సింగ్, ఎస్.పి.సింగ్ పాల్గొన్నారు.

దూర విద్యను మరింత విస్తృతం చేయాలి

ఎన్‌సీవీఈటీ చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల్జీత్‌సింగ్ కల్సి

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఆసియా ఆధ్వర్యంలో రెండు రోజుల ఓపెన్ యూనివర్శిటీ, ఓపెన్ ఎడ్యుకేషనల్ రీసోర్సెస్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల్జీత్‌సింగ్ కల్సి ముఖ్య అతిథిగా హాజరై ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సార్వత్రిక విశ్వవిద్యాలయాలు దూర విద్యలో ఇ-లెర్నింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేయడంలో మరింత ప్రయత్నం జరగాలని, సాంకేతికతను, నైపుణ్యావృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడానికి ఓపెన్ యూనివర్శిటీలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను తమ సంస్థ రూపొందించిందని, వాటిని దేశంలోని యూనివర్శిటీలు వాడుకుని విద్యార్థులకు ఉపాధి కల్పించేవిధంగా కోర్సులను రూపొందించాలని సూచించారు. సెంకా డైరెక్టర్ డాక్టర్ బీ శాద్రచ్ మాట్లాడుతూ... ఓపెన్ ఎడ్యుకేషనల్ రీసోర్సెస్ ఫెస్ట్ నిర్వహణ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే సీతారామారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ... ఉన్నత విద్యలో 12 శాతం కంటే ఎక్కువ జీఈఆర్ జాతీయ స్థాయికి ఓపెన్ యూనివర్శిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఓపెన్ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్ప చక్రపాణి, కోల్ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లోనే నిజమైన సంతృప్తి: బాబూమోహన్

పంజగుట్ట: వైద్య విద్యను పూర్తిచేసిన తరువాత కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యునిగా చేరి లక్షలు సంపాదించుకోవాలి అని అనుకునే ఈ రోజుల్లో సేవే పరమావధిగా జీవిస్తున్న సింగం శ్రీనివాస్ రావు ఎంతో అభినందనీయుడని మాజీ మంత్రి, సినీనటుడు బాబూమోహన్ అన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తూ ఇప్పటివరకు వెయ్యికి పైగా మెడికల్ క్యాంపులు నిర్వహించిన శ్రీనివాస్ రావుకు సన్మాన కార్యక్రమం గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబూమోహన్ మాట్లాడుతూ... మనం ఎంత సంపాదించినా రాని తృప్తి, సేవా కార్యక్రమాలద్వారానే వస్తుందని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో పుట్టి వైద్యవిద్యను పూర్తిచేసి డబ్బు సంపాదన వైపు పోకుండా పేదలకు సేవచేయాలనే లక్ష్యంతో వెయ్యి మెడికల్ క్యాంపులు నిర్వహించడం నిజంగా హర్షించదగ్గ విషం అన్నారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ .. తాను బతికి ఉన్నంతవరకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. శ్రీనివాసరావుసేవా కార్యక్రమాలు గుర్తించిన ఆర్‌బీఎల్ బ్యాంకు వారు ఆర్‌బీఎల్ కమ్యూనిటీ స్టార్ 2024 అవార్డును బాబూమోహన్ చేతులమీదుగా అందించారు. ఇండియన్ ఎషియా పసిఫిక్ రన్నరప్ సుధా జైన్, మా ఈసీ మెంబర్ మానిక్, నటుడు నిక్సోన్, ఆర్‌బీఎల్ బ్యాంకు ప్రతినిధులు ఇమ్రోజ్, విజయ్ కుమార్, వెంకటరామన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

హిమాయత్‌నగర్: సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్, కాలనీలతో పాటు కాలేజీలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం నగర సైబర్ క్రైమ్ సీఐ బోస్ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది హిందీ మహావిద్యాలయలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు సైబర్ నేరాలు జరిగే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెట్టుబడుల మోసాలు, ఫెడెక్స్, ట్రేడింగ్ ఇతర సైబర్ మోసాలు జరుగుతున్న విధానాన్ని, వాటి పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. సుమారు 300 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి 'సైబర్ టోకరా'

హిమాయత్‌నగర్: సోషల్ మీడియాలో ఇన్‌స్టాగామ్ వీడియోలను లైక్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి ఓ ప్రభుత్వ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిడికి ఇన్‌స్టాగామ్ వీడియోలను లైక్ చేయడం ద్వారా డబ్బు సంపాదించాలని వాట్సాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. తాము ఇచ్చిన టాస్కులు పూర్తి చేసిన అనంతరం కమీషన్ మొత్తం చెల్లిస్తామన్నారు. అనంతరం గూగుల్ రివ్యూలు ఇవ్వాలంటూ రోజువారీ టాస్కులు ఇచ్చారు. తాము ఇచ్చిన టాస్కులన్నీ పూర్తయిన తర్వాత వారు బాధితుడి 30 నుంచి 60 శాతం కమీషన్ ఇస్తామన్నారు. ఇది నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా పెట్టుబడి పేరుతో మొదటి టాస్క్‌లో భాగంగా రూ. 20 వేలు, రెండో టాస్క్‌లో రూ. 60 వేలు, చివరి టాస్క్‌లో రూ. 5,00,000, రూ. 10,00,000 చెల్లించాడు. అనంతరం సైబర్ నేరగాళ్లు రూ.20 లక్షలు డిమాండ్ చేయగా, బాధితుడు 90,000 చెల్లించాడు. ఈ విధంగా బాధితుడు మొత్తం రూ.16,70,000 మోసపోయాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యా చేశాడు.

డెబిట్ కార్డ్ బ్లాక్ అయిందంటూ మోసం...

సికింద్రాబాద్‌కి చెందిన ఓ 74 ఏళ్ల వృద్ధుడిని తన యూనియన్ బ్యాంక్ డెబిట్ కార్డ్ బ్లాక్ అయిందంటూ సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. తన ఏటీఎమ్ కార్డ్ బ్లాక్ అయిందని, పాన్ కార్డ్ అప్‌డేట్ చేయాలంటూ వివిధ కారణాలు చెబుతూ తన ఇతర బ్యాంక్‌ల నుంచి రూ. 1.40 లక్షలను కాజేశారు. మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు వెంటనే 1930కి కాల్ చేయాలని ఏసీపీ శివమారుతి సూచించారు.

'ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై విచారణ జరిపించాలి'

హిమాయత్‌నగర్: ఐపీఎల్ టికెట్ల విక్రయాలలో జరుగుతున్న కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి, దోషులపై చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బోర్డ్ అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీ నియమించి విచారణ జరపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరిగిన రెండు ఐపీఎల్ మ్యాచ్‌లకు టిక్కెట్లు లభించని క్రికెట్ ప్రేమికులు, స్థానిక క్రీడా సంస్థ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్వాహకులు, టికెటింగ్ ఏజెన్సీ పేటీఎం అమ్మకాలు, పంపిణీలో పారదర్శకంగా లేదని వారు ఆరోపించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్య ప్రసాద్, శ్రీమాన్ పాల్గొన్నారు.

తెలంగాణ ఆడబిడ్డ యూపీ నుంచి పోటీ

జౌన్పూర్ బీఎస్పీ అభ్యర్థిగా శ్రీకళారెడ్డి



కోదాడ: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన కీసర శ్రీకళారెడ్డి ఉత్తరప్రదేశ్‌లోని జౌన్పూర్ నుంచి బీఎస్పీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఈమె హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కీసర జితేందర్‌రెడ్డి ఏకైక కూతురు. హైదరాబాద్‌లో పెరిగిన శ్రీకళారెడ్డి ఇంటీరియర్ డిజైనర్‌గా పనిచేశారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం కావడంతో 2004 నుంచి 2014 వరకు కోదాడ నుంచి వివిధ పార్టీల తరఫున పోటీ చేయడానికి ప్రయత్నించినా, టికెట్ దక్కలేదు. శ్రీకళారెడ్డి పదేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌కి చెందిన మాజీ ఎంపీ ధనుంజయ్‌సింగ్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె మామ రాజ్‌దేవ్‌సింగ్ కూడా అక్కడ మాజీ ఎమ్మెల్యే. యూపీలో మే 25న పోలింగ్ జరగనుంది. 'ఈ నెల 29న నామినేషన్ వేస్తున్నానని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి పార్లమెంట్‌లోకి అడుగుపెడతాన'ని శ్రీకళారెడ్డి 'సాక్షి'తో చెప్పారు.

వామపక్షాలు గెలిస్తేనే పార్లమెంట్‌లో ప్రజావాణి

కేరళ ఎన్నికల ప్రచారంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ పిలుపు




సాక్షి, న్యూఢిల్లీ: వామపక్ష అభ్యర్థులు గెలిస్తేనే పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించడానికి అవకాశం ఉంటుందని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య రక్షణకు బీజేపీ కూటమిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేరళలోని పలక్కాడ్ లోక్‌సభ స్థానం నుంచి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఏ.విజయన్, అలతూర్ లోక్‌సభ స్థానం నుంచి డీఎస్ఎంఎం అఖిల భారత అధ్యక్షుడు మంత్రి రాధకృష్ణన్‌లు పోటీ చేస్తున్నారు. వీరికి మద్దతుగా గత రెండురోజులుగా ఆయా లోక్‌సభ స్థానాల్లో బి.వెంకట్ ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. దేశంలో కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడింది, పోరాడుతున్నది వామపక్ష పార్టీలేనని పేర్కొన్నారు.

నేడు నామినేషన్ వేయనున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ఉదయం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరుకానున్నారు. ముందుగా ఆయన సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం ఆలయం నుంచి పాదయాత్రగా వెళ్లి 11 గంటల సమయంలో మెహబూబ్ కాలేజీ వద్ద వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రసంగిస్తారు.

శ్రీరాముడి పేరు వింటేనే ఆ పార్టీలకు భయం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి ధ్వజం



జగిత్యాల: శ్రీరాముడి పేరు వింటేనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయ పడుతున్నాయని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గురువారం చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాముడిని మొక్కి.. బీజేపీని తొక్కాలంటున్నారని, రామభక్తులను తొక్కుతానంటే చూస్తూ ఊరుకుందామా..? అని ప్రశ్నించారు. బీజేపీ బరాబర్ రాముడి పేరుతోనే ప్రజల్లోకి వెళ్తుందన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే బాబర్ పేరుతో జనంలోకి వెళ్లాలని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండో స్థానం కోసమే పోటీ పడుతున్నాయని చెప్పారు. ఆ రెండు పార్టీల అభ్యర్థులు ఏనాడైనా దళితులు, బీసీలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాడారా..? అని బండి ప్రశ్నించారు.



ప్రత్యర్థులపై షాడో నిఘా!

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రయత్నాలు

- ఎత్తులకు పైఎత్తు వేసేందుకు పరస్పర వ్యూహాలు
- నిఘా పెట్టేందుకు అనుచరులతో 'ప్రత్యేక'బృందాలు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు ఏవైనా.. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎత్తులు.. దానికి ప్రత్యర్థుల పైఎత్తులు మామూలే. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల అభ్యర్థులు ఈ ఎత్తులు, పైఎత్తుల విషయంలో తిప్పలు పడుతున్నారు. ఓ వైపు తమ ప్రచారం కొనసాగిస్తూనే.. ప్రత్యర్థుల వ్యూహాలేమిటో తెలుసుకునేందుకు నిఘా పెడుతున్నారు. ఇందులో భాగంగా కొందరు ఏకంగా 'కోవర్ట్ ఆపరేషన్లు' కూడా చేయిస్తున్నట్టు రాజకీయవర్గాలు చెప్తున్నాయి.

ఎత్తులు తెలిస్తేనే పైఎత్తులు..

అసెంబ్లీ ఎన్నికలు జరిగాక ఆరు నెలల్లోపే లోక్‌సభ ఎన్నికలు రావడం ప్రతిష్టాత్మకంగా మారింది. ప్రతి అభ్యర్థి కూడా.. ఎదుటి పార్టీలో, పోటీలో ఉన్న అభ్యర్థులు ఏం చేస్తున్నారనేది తెలుసుకోవడంపై దృష్టిపెట్టారు. వారు ఎవరిని ఎలా కలుస్తున్నారు? ఏ హామీలిస్తున్నారు? ప్రలోభాల ఘట్టం ప్రారంభించారా? డంప్‌లు ఎక్కడ ఏర్పాటు చేశారు? వంటి అంశాలు తెలుసుకుని తిప్పికొట్టాలని.. ఓటర్లు వారి వైపు ఆకర్షితులు కాకుండా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని అవకాశాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అనుచరులకు 'ప్రత్యేక'బాధ్యతలు

ప్రత్యర్థులపై నిఘాకు, వ్యూహాలు తెలుసుకునేందుకు అభ్యర్థులు కొందరు నమ్మకస్తులైన అనుచరులను ప్రత్యేకంగా రంగంలోకి దింపుతున్నారు. వారు తమ అభ్యర్థి తరఫున పనిచేసినా, చేయకున్నా.. ఎదుటి అభ్యర్థి ఏం చేస్తున్నారనేది తెలుసుకోవడమే పని. వారు మరికొందరిని సమీకరించుకుని 'షాడో టీమ్స్'మాదిరిగా పనిచేస్తూ.. ప్రత్యర్థులు ఏం చేస్తున్నారు, వారి వ్యూహాలేమిటన్నది తెలుసుకుని.. అభ్యర్థులకు సమాచారమిస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే మరో అడుగు ముందుకేసి ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలనూ ఆశ్రయిస్తున్నట్టు రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. ఇందుకోసం అభ్యర్థులు భారీగానే ఖర్చుపెడుతున్నారట.

కోవర్టు ఆపరేషన్లకూ ప్లాన్!

అభ్యర్థులు తాము ఎవరితో నిఘా పెట్టినదీ ప్రత్యర్థి పార్టీవారు గుర్తించకుండా ఉండాలి, లేకుంటే బెడిసికొట్టే అవకాశాలు ఎక్కువ. పూర్తిగా కొత్తవారిని రంగంలోకి దింపితే వారికి స్థానిక రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన ఉండే అవకాశం తక్కువ. దీంతో కొందరు అభ్యర్థులు.. కోవర్ట్ ఆపరేషన్లు ప్రారంభించారని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. ప్రత్యర్థుల వెంట ఉండేవారికి ఎర వేసి, వారి నుంచే సమాచార సేకరణ చేస్తున్నట్టు చెప్తున్నాయి. ఇలా కోవర్ట్ ఆపరేషన్లకు సహకరించే వారికి భారీగానే నజరానాలు ఇస్తున్నట్టు వివరిస్తున్నాయి.

డంప్‌ల డేటా 'లీక్'చేసేందుకు..

ప్రతి అభ్యర్థి తన ప్రత్యర్థులను వీలైనన్ని ఎక్కువ కోణాల్లో దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు. కేవలం ప్రచార వ్యూహాలు మాత్రమేకాదు.. వారి ప్రలోభాల 'డంప్స్'ల సమాచారం సేకరించడంపై దృష్టి పెడుతున్నారు. మద్యం, నగదును ఎక్కడ దాచి ఉంచుతున్నారు? ఆ కోణంలో వీరికి సహకరిస్తున్నది ఎవరు? అనే అంశాలను తెలుసుకునే యత్నం చేస్తున్నారు. పోలీసులకు, ఎన్నికల సంఘానికి వాటి సమాచారం ఇప్పించడం ద్వారా ప్రత్యర్థులను దెబ్బతీయాలన్నది వారి వ్యూహంగా కనిపిస్తోంది. మొత్తమ్మీద లోక్‌సభ ఎన్నికల 'సిత్రాలు'ఎన్నో..

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలే



ఇప్పటికే కొందరిపై ఈసీ చర్యలు తీసుకుంది

- ప్రచారంలో పాల్గొనకుండా వారిపై నిషేధం విధించింది
- ఈసీ నోటీసులకు వివరణ కోసం కేసీఆర్ వారం గడువు కోరారు
- ఈ నెల 26 నుంచి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ
- విలేకరుల సమావేశంలో సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి
- రాజాసింగ్, మాధవీలత విద్వేష ప్రసంగాలపై సమాధానం దాటవేత

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) చర్యలు తీసుకుంటోందని, ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఇప్పటికే పలువురు నేతలపై నిషేధాన్ని విధించిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ చెప్పారు. రాష్ట్రంలో సైతం కోడ్ ఉల్లంఘనకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ పట్ల అన్ని పార్టీలకు అవగాహన కల్పించామని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కోడ్ ఉల్లంఘన ఆరోపణలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఈసీ జారీ చేసిన నోటీసులకు వివరణ ఇచ్చే గడువు గురువారంతో ముగిసిందని, ఆయన మరో వారంపాటు గడువు పొడిగించాలని కోరారన్నారు. కేసీఆర్ విజ్ఞప్తిని ఈసీకి పంపించామని చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఊరేగింపులో ఓ వర్గం ప్రజలను రెచ్చగొట్టేలా బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్, ఆ పార్టీ హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత చేసిన విద్వేషకర ప్రసంగాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. కోడ్ ఉల్లంఘనకి సంబంధించి ఇప్పటి వరకు వివిధ పార్టీల నుంచి 28 ఫిర్యాదులు వచ్చాయని, ఇప్పటివరకు 4099 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశామన్నారు. ఓ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడానికి అనుమతించే విషయమై చట్టాలను పరిశీలించాల్సిన అవసరముందని తెలిపారు. సికింద్రాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పోటీకి దిగుతున్న విషయం తెలిసిందే.

ఆన్‌లైన్‌లో నామినేషన్ వేయొచ్చు

ఆన్‌లైన్‌లో సైతం నామినేషన్ దాఖలు చేయొచ్చని, అయితే ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటల్లోపు అభ్యర్థులు సంతకం చేసిన నామినేషన్ పత్రాల ప్రింట్ కాపీని సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందని వికాస్‌రాజ్ తెలిపారు. నామినేషన్ ఫారంతోపాటు అఫిడవిట్‌లోని అన్ని ఖాళీలను పూరించాలని, తమకు వర్తించని విషయాలను సైతం 'నాట్ అప్లికేబుల్'అని రాయాల్సి ఉంటుందన్నారు. ఒక్క ఖాళీ పూరించకపోయినా పరిశీలనలో నామినేషన్లు తిరస్కరిస్తారని చెప్పారు. ఎన్నికల ఖర్చుల కోసం అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతాను తెరవాల్సి ఉంటుందని, రాష్ట్రంలోని ఏ బ్యాంక్ నుంచైనా ఖాతా తెరవచ్చన్నారు. తొలి రోజు రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో మొత్తం 42 మంది అభ్యర్థులు మొత్తం 48 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారని వికాస్‌రాజ్ వెల్లడించారు.

23లోగా పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకోవాలి

పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం వికలాంగులు, 85 ఏళ్లపైబడిన వయోజనులు, అత్యవసర సేవల ఉద్యోగులు/జర్నలిస్టులు ఈ నెల 23లోగా ఫారం-12డీ దరఖాస్తులను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సీఈఓ వికాస్‌రాజ్ సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిలో ఇంకా 40వేల మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదని, తక్షణమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 3 నుంచి 6 వరకు తొలి విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి ఓటర్లకు ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ చేస్తామన్నారు. పాత ఓటరు గుర్తింపుకార్డులు కలిగిన 46 లక్షల మంది ఓటర్లకు వారి కొత్త ఓటరు గుర్తింపుకార్డు నంబర్లను తెలియజేస్తూ లేఖలు పంపినట్టు తెలిపారు. పాత నంబర్లతో ఓటు ఉండదని, కొత్త నెంబర్లతోనే ఉంటుందన్నారు.

మహిళా ఓటర్లే అధికం

రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,31,48,527కి చేరిందని వికాస్‌రాజ్ తెలిపారు. 1000 మంది పురుషులకు రాష్ట్రంలో 1010 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు మొత్తం 1,00,178 దరఖాస్తులొచ్చాయని, వీటిని ఈనెల 25లోగా పరిష్కరిస్తామని చెప్పారు. 2022-24 మధ్యకాలంలో రాష్ట్రంలో 60.6 లక్షల కొత్త ఓటర్ల నమోదు, 32.84 లక్షల ఓటర్ల తొలగింపు, 30.68 లక్షల ఓటర్ల వివరాల సవరణ జరిగిందన్నారు.

జై శ్రీరామ్ అనడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

- ఉంటే మోదీ జేబుల్లో లేదా జైల్లో ఉండాలన్న చందంగా వ్యవహరిస్తున్నారు
- హామీలు నెరవేర్చలేక రేవంత్ పిచ్చి కథలు చెబుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

వెంగళరావునగర్ (హైదరాబాద్): బీజేపీ నేతలు మాట్లాడితే జై శ్రీరామ్ అనడం తప్ప వారి వల్ల దేశానికి గాని, ప్రజలకు గాని ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదని, ఆ పార్టీ చేసిన పనులు కూడా ఏమీ లేవని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు విమర్శించారు. శ్రీరాముడు దేవుడని, ఆయనను అందరూ పూజించాలని చెప్పారు. ఆయనతో ఎవరికీ ఎలాంటి పంచాయితీ లేదన్నారు. కుల, మతాలను గౌరవించలేని పార్టీలను రానున్న ఎన్నికల్లో తొక్కేయాలని వ్యాఖ్యానించారు. దేశంలోని నాయకులంతా ఉంటే మోదీ జేబుల్లో లేదా జైల్లో ఉండాలన్న చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒకవైపు కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బీజేపీని విమర్శిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం ఆ పార్టీని వెనకేసుకొస్తూ స్టేట్‌మెంట్లు ఇస్తున్నాడని, ఇదెక్కడి విడ్డూరమని ప్రశ్నించారు. గురువారం రాత్రి యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రానికి విధేయుడిగా సీఎం రేవంత్

తంతే గారెల బుట్టలో పడ్డట్టుగా రేవంత్‌రెడ్డికి సీఎం పదవి దక్కిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ 100 రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పి, ఒక్కటి కూడా సరిగ్గా చేయడం లేదని అన్నారు. ఏం చేయాలో తెలియక, హామీలను నెరవేర్చే సత్తా లేక ఫోన్ ట్యాపింగ్‌లంటూ ప్రజలకు పిచ్చి కథలు చెబుతున్నాడని విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ విధేయుడిగా పనిచేస్తున్నారని చెప్పారు. దేశంలో బీజేపీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కు లేదని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే సీటు త్వరలో ఊడుతుందని చెప్పారు.

'మహా' ఎన్నికల్లో మన ఓటర్లు

- సరిహద్దు గ్రామాల ప్రజల కోసం 4 పోలింగ్ కేంద్రాలు
- చంద్రాపూర్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో 3,597 ఓటర్లు



రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు చూపుతున్న పరంధోళి మహిళలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఇటు తెలంగాణ.. అటు మహారాష్ట్ర సరిహద్దులోని కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు వచ్చే కెరమెరి మండలంలోని 15 గ్రామాలకు చెందిన ఓటర్లు శుక్రవారం తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరంతా మహారాష్ట్రలోని చంద్రాపూర్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోకి వస్తారు. పరంధోళి, నోకేవాడ, భోలాపటార్, అంతాపూర్ పోలింగ్ కేంద్రాల్లో 2,485మంది ఓటర్లు ఉన్నారు. పరంధోళి పోలింగ్ కేంద్రం(పరంధోళి, తండా, కోటా, శంకర్‌లొద్ది, ముకదంగూడ)లో 1,367 మంది ఓటర్లు ఉండగా.. నోకేవాడ(మహారాష్ట్ర పోలింగ్ కేంద్రం)లో మహరాజ్‌గూడ ఓటర్లు 370, భోలాపటార్(భోలాపటార్, గౌరి, లేండిగూడ) 882, అంతాపూర్ పోలింగ్ కేంద్రం(నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, ఇంద్రానగర్, అంతాపూర్)లో 978మంది ఓటర్లు ఉన్నారు. బీజేపీ నుంచి సుధీర్ మునగంటీవార్, కాంగ్రెస్ నుంచి ప్రతిభా ధానోర్‌కర్ పోటీలో ఉన్నారు.

ఇప్పుడు వేసి ఊరుకుంటారా?

'వన్ నేషన్..వన్‌రేషన్'లో భాగంగా ఒక ఓటరు ఒకే వైపు ఓటు వేయాలని ఇటీవల ఆయా గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పించారు. అయితే చంద్రాపూర్ ఎంపీ సెగ్మెంట్‌కు శుక్రవారం పోలింగ్ జరుగుతుండగా, మే 13న ఆదిలాబాద్ ఎంపీ సెగ్మెంట్‌కు పోలింగ్ జరుగుతుంది. అయితే రెండువైపులా ఓటుహక్కు వినియోగించుకుంటామని ఓటర్లు చెబుతున్నారు.

ఆ రెండు పార్టీలపై బీజేపీ చార్జిషీట్లు!

- కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను చార్జిషీట్లలో పొందుపరచాలని నిర్ణయం
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తప్పిదాలను ఎత్తిచూపుతూ.. హామీల పేరిట కాంగ్రెస్ నిర్వాకాన్ని విమర్శిస్తూ అభియోగపత్రాలు
- 25న నామినేషన్ల ఘట్టం ముగిశాక వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల కంటే ఎక్కువ మెజారిటీ సీట్లను గెలిచి సత్తా చాటాలని భావిస్తున్న బీజేపీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కనీసంగా పది నుంచి పన్నెండు స్థానాల్లో గెలుచుకునేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే ఆ రెండు పార్టీలను లక్ష్యంగా చేసుకుని 'అభియోగ పత్రాలు'(చార్జి షీట్లు) విడుదల చేయాలని నిర్ణయించింది. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిన తప్పి దాలు, కుంభకోణాలను ఎత్తిచూపడంతో పాటు ప్రధాన వాగ్దానాలను నిలబెట్టుకోని నిర్వాకాన్ని చార్జిషీట్లలో ఎత్తిచూపాలని నిర్ణయించినట్టు పార్టీవర్గాల సమాచారం. ఇక కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలిచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకపోవడాన్ని ప్రస్తావిస్తూ చార్జిషీట్లు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఎన్నికల ప్రచారం ఊపందుకోనున్న నేపథ్యంలో సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై చార్జిషీట్ల సమర్పణకు బీజేపీ సమాయత్తమవుతోంది.

తెలంగాణకూ 'సంకల్ప పత్రం'

ఈ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి మెజారిటీ ఎంపీ సీట్లలో బీజేపీని గెలిపిస్తే తెలంగాణకు చేకూర్చే ప్రయోజనాల గురించి అదనంగా సంకల్పపత్రంలో చేర్చాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. ఇటీవలే బీజేపీ జాతీయ నాయకత్వం ఢిల్లీలో సంకల్పపత్రం పేరిట పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనికి అదనంగా తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలను చేర్చాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని అంటున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో విడిగా ఒక్క రాష్ట్రానికి మేనిఫెస్టో అంటూ ప్రకటించడం సరికాదని భావించిన బీజేపీ నేతలు.. జాతీయ పార్టీ ఎన్నికల ప్రణాళికకు అదనంగా ఓ సంకల్పపత్రాన్ని జత చేయాలని సమాలోచనలు చేస్తున్నారు. ఈ నెల 25న నామినేషన్ల దాఖలు ముగిశాక రాష్ట్రానికి సంబంధించిన సంకల్ప పత్రాన్ని విడుదల చేసేందుకు సమాయత్తమవుతున్నారు. 2019 ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీ నాలుగు ఎంపీ సీట్లు గెలిచాక,రాష్ట్రానికి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపంలో చేకూర్చిన ప్రయోజనాలు, అందించిన సహాయసహకారాల గురించి ఇందులో పొందుపరచనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీని అత్యధిక సీట్లలో గెలిపిస్తే.. కేంద్రం ద్వారా అంతకు మించి ఎన్నో రెట్లు లబ్ధి చేకూరుస్తామని హామీనివ్వాలనే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది.



రాష్ట్రంలో పదేళ్లలో అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ స్పష్టం చేశారు. పదేళ్లు ఇక్కడ అధికారంలో ఉన్న కేసీఆర్ తెలంగాణను దోపిడీ చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుందని ఆయన విమర్శించారు. గురువారం మెదక్ పట్టణంలో మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.



మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గురువారం శామీర్‌పేట కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్‌ను వేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా తరలి వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, దానికి సాక్ష్యం ఈరోజు జరిగిన నామినేషన్ ర్యాలీ అని స్పష్టం చేశారు.



మోదీకి సరితూగే వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో ఎవరో చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ గురువారం ఉదయం కలెక్టరేట్‌లో లక్ష్మణ్‌తో కలసి నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో లక్ష్మణ్ మాట్లాడుతూ రేవంత్ అధికారం అండతో కుట్రలు చేయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలి?

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలను ఆరు గ్యారంటీల పేరిట గారడీ చేసినందుకు ఓటు వేయాలా? అని నిలదీశారు. గురువారం సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఒకవేళ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ స్థానాలు గెలిస్తే.. ప్రజలను పట్టించుకోరని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువొచ్చిందన్నారు. జనవరి పింఛన్ డబ్బులు ఎగ్గొట్టి వృద్ధులను గోస పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకైన వినోద్ కుమార్‌ను పార్లమెంట్‌కు పంపాలని హరీశ్ విజ్ఞప్తి చేశారు.

ఆ ఏడు స్థానాల్లో బిగ్ ఫైట్

తమిళనాట డీఎంకే, బీజేపీ హోరాహోరీ

- కోయంబత్తూర్లో అన్నామలైకి మొగ్గు
- తమిళిసై తదితరులకూ చాన్స్
- డీఎంకే నేత ఎ.రాజా ఎదురీత
- నీలగిరీస్ బరిలో వీరప్పన్ కుమార్తె

లోక్‌సభ సీట్లపరంగా దక్షిణాదిన అతి పెద్ద రాష్ట్రమైన తమిళనాడులో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 39 స్థానాలకూ శుక్రవారం తొలి దశలోనే ఎన్నికలు పూర్తవనున్నాయి. ఈ ద్రవిడనాడులో ఎప్పుడూ డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ద్విముఖ పోటీయే రివాజు. ఈసారి అన్నాడీఎంకే బలహీనపడిపోగా దాని స్థానాన్ని క్రమంగా బీజేపీ చేజిక్కించుకుంటున్నట్టు కన్పిస్తోంది. డీఎంకేకు కమలదళం గట్టి పోటీ ఇస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. సొంతంగా రికార్డు సంఖ్యలో స్థానాలు గెలిచినా ఆశ్చర్యం లేదంటున్నారు. అంతేగాక చాలా స్థానాల్లో డీఎంకే భాగ్యరేఖలను బీజేపీ మార్చేసేలా కన్పిస్తోందని సమాచారం. గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్ కూటమి ఏకంగా 38 సీట్లు కైవసం చేసుకుంది. ఈ విడత వాటికి సీట్లు బాగా తగ్గుతాయని అంచనా. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రతో బీజేపీకి తమిళనాట సానుకూల వాతావరణం ఏర్పడినట్టు కనిపిస్తోంది. దీంతో బీజేపీ ఓటు బ్యాంక్ ఏకంగా రెండంకెలకు చేరుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు హాట్ సీట్లలో పోటీ మరింత రసవత్తరంగా మారింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

కోయంబత్తూర్


● అన్నామలై

బీజేపీ గెలుపుపై గట్టిగా నమ్మకం పెట్టుకున్న స్థానాల్లో ఇదొకటి. అన్నామలై ఇక్కడ పోటీలో నిలిచారు. తాను గెలిస్తే నియోజకవర్గంలో ఐఐఎంతో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) శాఖలను ఏర్పాటు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దివంగత సీఎం కె.కామరాజ్ పేరిట 24 గంటలూ మొబైల్ ఆహారశాలలు అందుబాటులో ఉండేలా చూస్తామన్నది బీజేపీ హామీల్లో మరొకటి. ఇక్కడ 1999లో బీజేపీ తరఫున సి.పి.రాధాకృష్ణన్ విజయం సాధించారు. తర్వాత డీఎంకే మిత్రపక్షాలైన సీపీఐ, సీపీఎం గెలుస్తూ వస్తున్నాయి. 2014లో మాత్రం అన్నాడీఎంకే అభ్యర్థి పి.నాగరాజన్ నెగ్గారు. అయితే గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఇక్కడ రెండో స్థానంలో ఉండటం విశేషం. ఈసారి మోదీ మేనియాకు అన్నామలై పాపులారిటీ తోడై బీజేపీ గెలుస్తుందన్న అంచనాలున్నాయి. డీఎంకే నుంచి పి.రాజ్‌కుమార్, అన్నాడీఎంకే నుంచి సింగై రామచంద్రన్ పోటీలో ఉన్నారు.

తూత్తుకుడి


● కనిమొళి

ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే తరఫున సిట్టింగ్ ఎంపీ, దివంగత సీఎం కరుణానిధి కూతురు, సీఎం స్టాలిన్ సోదరి కనిమొళి మరోసారి బరిలోకి దిగారు. ఎన్డీఏ భాగస్వామి తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్) నుంచి విజయశీలన్, అన్నాడీఎంకే నుంచి ఆర్.శివస్వామి వేలుమణి బరిలో ఉన్నారు. కనిమొళి 2019లో వేలుమణిపై ఏకంగా 3.47 లక్షల మెజారిటీతో ఘనవిజయం సాధించడం విశేషం. అయితే వేలుమణి స్థానికంగా బాగా పట్టున్న నేత. పుత్తూర్ బోస్ అండ్ జాయింట్ సెంటర్ అధినేత. చారిత్రకంగా ఇక్కడి నుంచి డీఎంకే లేదంటే అన్నాడీఎంకే గెలుస్తూ వస్తున్నాయి. ఈసారి మాత్రం స్థానిక అంశాలను బాగా ప్రస్తావిస్తూ విజయశీలన్ ఓటర్లకు దగ్గర అవుతున్నారు. బీజేపీ దన్ను కూడా ఆయనకు బాగానే కలిసొస్తోంది. ఈసారి సౌత్ నుంచి బీజేపీ నుంచి పోటీ చేస్తున్న తమిళిసై సౌందరరాజన్ 2019 తూత్తుకుడిలో 2,15,934 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలవడం విశేషం!

చెన్నై సౌత్


● తమిళిసై సౌందరరాజన్

ఈ ఎన్నికల ముందు దాకా తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళిసై సౌందరరాజన్ హుటాహుటిన రాజీనామా చేసి చెన్నై సౌత్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. బీజేపీ నేతగానే గాక డాక్టర్‌గా కూడా ఈ నియోజకవర్గానికి ఆమె చిరపరిచితులే. దీనికి తోడు ఇక్కడ బ్రాహ్మణ ఓటర్లు బాగా ఉండడం ఆమెకు మరింత కలిసొచ్చే అంశం. 2019లో ఇక్కడ డీఎంకే తరఫున తమిళాచి తంగపాండియన్ 2.62 లక్షల ఓట్ల మెజారిటీతో అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్‌పై గెలిచారు. ఆమె మాజీ మంత్రి తంగపాండియన్ కుమార్తె కావడంతో తమ సంస్థాగత బలంతో మరోసారి గెలుపు తమదేనన్న ధీమాతో డీఎంకే ఉంది. ఇక్కడ కూడా త్రిముఖ పోటీ ఉంది.

నీలగిరీస్


● ఎ.రాజా

ఇది ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. డీఎంకే నేత ఎ.రాజా ఇక్కడ బలమైన నేతగా ఉన్నారు. 2009, 2019 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లోనైతే ఏకంగా 5.47 లక్షల ఓట్లు (54.2 శాతం) సొంతం చేసుకున్నారు! అయితే యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా 2జీ కుంభకోణం ఆరోపణల దెబ్బకు 2014 ఎన్నికల్లో ఇక్కడ ఆయన ఓటమి చవిచూశారు. గత రెండు ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ పోటీ చేయలేదు. ఈ విడత కేంద్ర మత్స్య శాఖ మంత్రి ఎల్.మురుగన్‌ను బరిలో దింపింది. ఈ నియోజకవర్గంలో బడగాస్ సామాజికవర్గ ప్రాబల్యం ఎక్కువ. సనాతన ధర్మాన్ని హేళన చేస్తూ రాజా చేసిన వ్యాఖ్యలు వారిలో తీవ్ర ఆగ్రహం కలిగించాయి. దాంతో ఈసారి రాజా గెలుపు సులభం కాదన్నది విశ్లేషకుల అంచనా.

రామనాథపురం


● ఒ.పన్నీర్‌సెల్వం

ఏకంగా మూడుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా (రెండుసార్లు జయలలిత న్యాయ సమస్యల్లో చిక్కినప్పుడు, మూడోసారి ఆమె మరణానంతరం) పనిచేసిన ఒ.పన్నీర్‌సెల్వం రాజకీయ భవిష్యత్ ఇప్పుడు రామనాథపురం ఓటర్ల చేతిలో ఉంది. జయలలితకు అత్యంత విశ్వాసపాత్రుడైన ఆయనను అంతా ఓపీఎస్ అని పిలుచుకుంటారు. జయ మరణానంతరం అన్నాడీఎంకే ఆయన్ను బయటకు పంపేసింది. దాంతో ఓపీఎస్ ఈసారి బీజేపీ మద్దతుతో రామనాథపురం నుంచి పోటీలో ఉన్నారు. దీనికి తోడు ఇక్కడి కుల సమీకరణాలు కూడా ఓపీఎస్‌కు బాగా అనుకూలంగా ఉన్నాయి. సిట్టింగ్ ఎంపీ కె.నవాస్ ఖని (ఐయూఎంఎల్) ఓపీఎస్‌కు గట్టి పోటీ ఇస్తున్నారు. మత్స్యకారుల సమస్య ఇక్కడ ప్రధానాంశం. ఈ నేపథ్యంలో కచ్చతీవు దీవి అంశాన్ని బీజేపీ ఇటీవల ప్రముఖంగా ప్రస్తావిస్తుండడం ఓపీఎస్‌కు మరింత కలిసొస్తుందని భావిస్తున్నారు.

కృష్ణగిరి


● విద్యారాణి వీరప్పన్

ఒకప్పుడు మూడు రాష్ట్రాల పోలీసులను గజగజలాడించిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ పెద్ద కుమార్తె విద్యారాణి వీరప్పన్ బరిలో దిగడంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. వృత్తిరీత్యా ఆమె న్యాయవాది అయిన ఆమె నామ్ తమిళార్ కచ్చి (ఎన్టీకే) పార్టీ తరఫున తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. విద్యారాణి 2020లో బీజేపీలో చేరి పార్టీ యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి కె.గోపీనాథ్, అన్నాడీఎంకే నుంచి వి.జయప్రకాశ్, బీజేపీ నుంచి సి.నరసింహన్ పోటీలో ఉన్నారు. 2019లో కాంగ్రెస్ తరఫున ఎ.చెల్లకుమార్ ఘన విజయం సాధించారు. 1991 దాకా ఇక్కడ కాంగ్రెస్ హవాయే నడిచింది. తర్వాత ప్రధానంగా డీఎంకే, అన్నాడీఎంకే పోటీ ఉండేది. ఈ విడత కాంగ్రెస్ సిటింగ్ ఎంపీని మార్చడం, వీరప్పన్ కుమార్తె బరిలో ఉండటం పోటీపై ఆసక్తిని పెంచింది.

తేని


● టీటీవీ దినకరన్

జయలలిత తర్వాత అన్నాడీఎంకే సారథి కావాలన్న శశికళ కల కూడా నెరవేరకపోయినా ఆమె వారసుడైన టీటీవీ దినకరన్ తేని లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు. ఆయన అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఎంఎంకే) పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయనకు ఓపీఎస్ దన్నుంది. వీరిద్దరూ ఒకే కులానికి చెందినవారు. ఒకరి విజయానికి ఒకరు సంపూర్ణంగా సహకరించుకుంటున్నారు. వీరిద్దరికీ బీజేపీ మద్దతిస్తోంది. పైగా తేని సిట్టింగ్ ఎంపీ పి.రవీంద్రనాథ్ పన్నీర్‌సెల్వం కుమారుడే. తండ్రి ఆదేశాల మేరకు ఆయన కూడా దినకరన్ విజయానికి పూర్తిగా సహకరిస్తున్నారు. దీనికి తోడు ఓపీఎస్ స్వస్థలం తేని జిల్లాయే. దాంతో ఇక్కడ ఆయనకున్న పట్టు దినకరన్‌కు మరింత కలిసొస్తుందని భావిస్తున్నారు.

తెలుగుతేజం రమాదేవి...

- ఏకైక మహిళా సీఈసీ
- 16 రోజులే పదవీ బాధ్యతలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా 25 మంది చీఫ్ ఎలక్షన్ కమిషనర్లుగా పనిచేశారు. వీరిలో ఒకే ఒక్క మహిళ ఉన్నారు! ఆమె తెలుగువారు కావడం విశేషం. ఆమే వి.ఎస్.రమాదేవి. అయితే ఆమె కేవలం 16 రోజులే ఆ పదవిలో కొనసాగారు.

ఏలూరు జిల్లా చేబ్రోలుకు చెందిన రమాదేవి సివిల్ సర్వెంట్‌గా కేంద్రంలో పలు శాఖల్లో పని చేసి సత్తా చాటారు. కేంద్ర న్యాయ శాఖ స్పెషల్ సెక్రటరీగా, లా కమిషన్ మెంబర్ సెక్రటరీగా, రాజ్యసభ సెక్రటరీ జనరల్‌గా పలు హోదాల్లో పని చేశారు. అనంతరం 1990 నవంబర్



26న 9వ సీఈసీగా బాధ్యతలు చేపట్టారు. 16 రోజుల అనంతరం డిసెంబర్ 11న రిటైరయ్యారు. ఆమెకు ముందు గానీ, తర్వాత గానీ మరో మహిళ సీఈసీ కాలేదు. అలా ఏకైక మహిళా సీఈసీగా రమాదేవి రికార్డు నెలకొల్పారు. పదవీ విరమణ తర్వాత ఆమె హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక గవర్నర్‌గా చేశారు. కర్ణాటకకు తొలి మహిళా గవర్నర్ కూడా రికార్డు నెలకొల్పారు.

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా అత్యధిక కాలం పదవిలో ఉన్న రికార్డు రెండో సీఈసీ కె.వి.కె.సుందరానిది. ఆయన 8 ఏళ్ల 284 రోజులు పదవిలో కొనసాగారు.
- ఆ తర్వాతి స్థానంలో తొలి సీఈసీ సుకుమార్ సేన్ ఉన్నారు. ఆయన 8 ఏళ్ల 273 రోజులు పదవిలో ఉన్నారు.

ఎన్నికలు ఎందుకింత హాటు?


గురువారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో మండే ఎండలకు తాళలేక పోలింగ్ సామగ్రిని తలపై పెట్టుకుని వెళ్తున్న పోలింగ్ సిబ్బంది.

2004 నుంచి మండుటెండల్లోనే ఎన్నికలు

- వాజ్‌పేయి సర్కారు ముందస్తుకు వెళ్లడం వల్లే!
- తొలి సార్వత్రిక ఎన్నికలు అక్టోబర్–ఫిబ్రవరిల్లో
- 1989 దాకా జనవరి–మార్చిలోపే పోలింగ్

ఎండలు బాబోయ్ ఎండలు... ఏప్రిల్లోనే భానుడు బెంబేలెత్తిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేశాయి. ఇక మే నెల మొదలైతే నిప్పుల కొలిమే! ఎన్నికల సిబ్బందితో పాటు దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఈసారి వేసవి సెగ మామూలుగా తగలడం లేదు. ఎన్నికలు ఇలా దంచికొడుతున్న ఎండల్లో జరగడానికి కారణం నూటికి నూరుపాళ్లు రాజకీయాలే. అవును! తొలి లోక్‌సభ ఎన్నికలు అక్టోబర్ నుంచి ఫిబ్రవరి దాకా చలికాలంలోనే జరిగాయి. 2004లో జరిగిన ముందస్తు ఎన్నికల పుణ్యమా అని 20 ఏళ్లుగా ఇదుగో, ఇలా మండే ఎండల్లో జరుగుతున్నాయి.

అక్టోబర్ టు అక్టోబర్...

స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా 1951–52లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి దాకా ఈ ప్రక్రియ సుదీర్ఘంగా నడిచింది. నెహ్రూ ప్రధానిగా తొలి లోక్‌సభ 1952 ఏప్రిల్ 17 నుంచి 1957 ఏప్రిల్ దాకా కొనసాగింది. అక్కణ్నుంచి 1980 దాకా లోక్‌సభ ఎన్నికలు జనవరి, ఫిబ్రవరి, లేదంటే మార్చిలోనే జరిగాయి. 1984లో ఇందిర హత్యానంతరం ప్రధాని అయిన రాజీవ్ గాంధీ లోక్‌సభను రద్దు చేయడంతో డిసెంబర్‌లో ముందస్తు ఎన్నికలు జరిగాయి. 1989లో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగాయి. సంకీర్ణ ప్రభుత్వాలు సరిగా నడవక చివరికి రెండేళ్లకే లోక్‌సభ రద్దయింది. దాంతో 1991 మే, జూన్ నెలల్లో ఎన్నికలు జరిగాయి. ఎండాకాలంలో జరిగిన తొలి ఎలక్షన్లు అవే. 1996లోనూ ఏప్రిల్, మే నెలల్లో ఎండల్లోనే ఎన్నికలు జరిగాయి. రెండేళ్లకే లోక్‌సభ రద్దవడంతో 1998 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. వాజ్‌పేయి సర్కారు 13 నెలలకే కుప్పకూలి 1999లో ఎన్నికలు సెప్టెంబర్, అక్టోబర్ మధ్య జరిగాయి.

ఇప్పుడు మనందరినీ ఠారెత్తిస్తున్న ఎండాకాలపు ఎన్నికలకు 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లడమే కారణం. బీజేపీ ఆర్నెల్ల ముందే లోక్‌సభను రద్దు చేసి ఏప్రిల్, మే నెలల్లో మండే ఎండల్లో ఎన్నికలకు వెళ్లింది. అలా ఎనిమిదేళ్ల విరామం తర్వాత మళ్లీ మండుటెండల్లో మొదలైన సార్వత్రిక ఎన్నికల సీజన్ ఇప్పటికీ కొనసాగుతోంది. తర్వాత 2009, 2014, 2019లోనూ ఎండా కాలంలోనే ఎన్నికలు జరిగాయి. ఇలా రెండు దశాబ్దాలుగా ఏప్రిల్–జూన్ ఎన్నికల 'వేడి' కొనసాగుతూ వస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ ఎన్నికలు జరిగిన తీరు...

ఏడాది	పోలింగ్ తేదీలు
1951-52	అక్టోబర్ 25 - ఫిబ్రవరి 21
1957	ఫిబ్రవరి 24 - మార్చి 14
1962	ఫిబ్రవరి 19-25
1967	ఫిబ్రవరి 17-21
1971	మార్చి 1-10
1977	మార్చి 16-20
1980	జనవరి 3-6
1984	డిసెంబర్ 24-28
1989	నవంబర్ 22-26
1991	మే 20 - జూన్ 15
1996	ఏప్రిల్ 27 - మే 7
1998	ఫిబ్రవరి 16-28
1999	సెప్టెంబర్ 5 - అక్టోబర్ 3
2004	ఏప్రిల్ 20 - మే 10
2009	ఏప్రిల్ 16 - మే 13
2014	ఏప్రిల్ 7 - మే 12
2019	ఏప్రిల్ 11 - మే 19
2024	ఏప్రిల్ 19 - జూన్ 1

వాజ్‌పేయికి ఇష్టమే లేదు...!

వాస్తవానికి 2004లో మండుటెండల్లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వాజ్‌పేయికి ససేమిరా ఇష్టం లేదట. అయితే మూడు హిందీ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం, వాజ్‌పేయి నాయకత్వంపై ప్రజాదరణ, 'ఫీల్ గుడ్ ఫ్యాక్టర్'ను సొమ్ము చేసుకోవాలని బీజేపీ అధ్యక్షుడు వెంకయ్య నాయుడు, ఉప ప్రధాని అద్వానీ భావించారట. "ఇండియా షైనింగ్ ప్రచారానికి తగ్గట్టుగా క్షేత్రస్థాయిలో ప్రజల్లో పెద్దగా స్పందన లేదని, ఎన్నికల్లో ఓడిపోబోతున్నామని వాజ్‌పేయి ముందే పసిగట్టారు. నాతో ఈ విషయం స్వయంగా చెప్పారు" అని ఆయనకు సుదీర్ఘ కాలం వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన శివకుమార్ అనంతరం వెల్లడించారు!

మార్చడం కుదరదా?

చట్టప్రకారం లోక్‌సభ గడువు తీరేలోగా ఎన్నికలు జరిగి కొత్త సభ కొలువుదీరాల్సిందే. తదనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ ప్రక్రియను పూర్తి చేస్తుంది. ఉదాహరణకు ప్రస్తుత 17వ లోక్‌సభ గడువు జూన్ 16తో ముగుస్తుంది. ఆలోపు ఎన్నికల తతంగమంతా పూర్తయి కొత్త సభ్యులతో 18వ లోక్‌సభ కొలువుదీరాలన్నమాట. కనుక ఎన్నికల తేదీలను మరీ ముందుకు, వెనక్కు జరపడం కుదరదు. అంటే మళ్లీ మధ్యంతరమో, ముందస్తు ఎన్నికలో వస్తే తప్ప ఈ షెడ్యూల్ మారబోదు. అప్పటిదాకా మనమంతా ఇలా ఎండల్లో ఓటెత్తకా తప్పదు!!

మళ్లీ ఇందిర

అంతర్గత కుమ్ములాటలతో కేంద్రంలో తొలి కాంగ్రెసేతర సర్కారుకు మూడేళ్లకే నూరేళ్లు నిండాయి. ఫలితంగా వచ్చిన ఏడో లోక్‌సభ ఎన్నికల్లో ఉల్లి ధరల ఘాటు తదితరాలు జనతా సర్కారు పుట్టి ముంచాయి. మళ్లీ ఇందిరకే ప్రజలు హారతి పట్టారు. కాంగ్రెస్‌లో రెండో చీలికనూ ఇందిర సమర్థంగా ఎదుర్కొని తిరుగులేని ప్రజా నేతగా నిలిచారు. 1984లో అమృత్‌సర్ స్వర్ణదేవాలయం సంక్షోభం, అనంతర పరిణామాలు ఇందిర దారుణ హత్యకు దారితీయడం, ఆమె వారసునిగా రాజీవ్‌గాంధీ పగ్గాలు చేపట్టడం వంటివి 1980-84 మధ్య చోటుచేసుకున్న పరిణామాలు...

- సాక్షి, నేషనల్ డెస్క్


ఏడో లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం ● అంతర్గత పోరుతో కుదేలైన జనతా

'జనతా' బలహీనత

ఇందిర విధానాలకు విసిగి కూటమి అయితే కట్టారు గానీ సిద్ధాంతాలపరంగా విపక్ష నేతలు భావ సారూప్యతకు రాలేకపోయారు. ప్రధాని కావాలన్న ఆకాంక్షలు ఇందుకు తోడయ్యాయి. జనతా కూటమి తరఫున ప్రధాని అయిన మొరార్జీ దేశాయ్‌ని చరణ్ సింగ్ (లోక్‌దళ్), బాబూ జగ్జీవన్‌రాం (కాంగ్రెస్ ఫర్ డెమొక్రసీ) తదితర నేతలు తొలినుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. చివరికి ఇందిర మద్దతుతో చరణ్‌సింగ్ ప్రధాని అయినా తనపై ఎమర్జెన్సీ నాటి కేసులను ఎత్తేయాలన్న ఇందిర ఒత్తిళ్లకు తలొగ్గలేక 24 రోజుల్లోనే తప్పుకున్నారు. అలా మూడేళ్లకే 1980లో లోక్‌సభకు ముందస్తు ఎన్నికలొచ్చాయి. ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ (ఐ) అఖండ మెజారిటీతో విజయం సాధించింది. ఏకంగా 353 సీట్లు సాధించింది. 1977 ఎన్నికల్లో ఘోర ఓటమి నేపథ్యంలో ఇందిరకు ఇది గొప్ప ఘనతే.

ఏడో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 542)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	353
జనతా (ఎస్)	43
సీపీఎం	39
జనతా పార్టీ	31
డీఎంకే	16
కాంగ్రెస్(యూ)	13
సీపీఐ	10
ఇతరులు	28
స్వతంత్రులు	9

ఆనియన్ ఎలక్షన్

గతం

హామీలను నెరవేర్చడంలో, ధరల పెరుగుదలను అరికట్టడంలో జనతా సర్కారు తీవ్రంగా విఫలమైంది. ముఖ్యంగా ఉల్లి ధరలు కిలో ఏకంగా 6 రూపాయలు దాటేశాయి. దాంతో ఇందిర కూడా ఉల్లినే ప్రధాన ప్రచారాస్త్రం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పత్రికా ప్రకటనల రూపంలోనూ సర్కారు వైఫల్యాన్ని ఎండగట్టారు. తనను గెలిపిస్తే ధరలను నేలకు దించుతామంటూ అధికారంలోకి వచ్చారు. కానీ ఇందిర హయాంలో 1981లో ఉల్లి ధరలు మరోసారి మోతెక్కడం విశేషం!

కాంగ్రెస్‌లో మరో చీలిక


1969లో తొలిసారి రెండుగా చీలిన కాంగ్రెస్ సరిగ్గా పదేళ్లకు 1979లో మళ్లీ రెండు ముక్కలైంది. 1979 జూలైలో నాటి కర్ణాటక సీఎం దేవరాజ్ అర్స్ కాంగ్రెస్‌ను వీడి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (యూ) ఏర్పాటు చేసుకున్నారు. ఇందిర కుమారుడు సంజయ్‌గాంధీ మళ్లీ పార్టీలో కీలకంగా వ్యవహరించడం నచ్చకే దేవరాజ్ వేరుబాట పట్టారు. ఆ పార్టీకి 1980 ఎన్నికల్లో కేవలం 13 స్థానాలు దక్కాయి. ఇందిర సారథ్యంలోని కాంగ్రెస్ (ఆర్–రెక్విజిషన్) కాస్తా కాంగ్రెస్ (ఐ)గా మారింది. ఐ అంటే ఇందిర!

విశేషాలు...

ఇందిర దారుణహత్య

- 1980 ఎన్నికలైన మూడు నెలలకే చరిత్రాత్మక పరిణామం చోటుచేసుకుంది. ఎల్‌కే అద్వానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న బీజేపీ ఏర్పాటైంది.
- రాజకీయాల్లో ఇందిరకు చేదోడువాదోడుగా ఉంటున్న చిన్న కుమారుడు సంజయ్‌గాంధీ 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో మరణించారు.
- 1981 ఫిబ్రవరి 16న రాజీవ్ రాజకీయ రంగప్రవేశం చేశారు. సంజయ్ ప్రాతినిధ్యం వహించిన అమేథీ నుంచి ఉప ఎన్నికలో లోక్‌దళ్ అభ్యర్థి శరద్ యాదవ్‌పై 2,37,000 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- బింద్రన్‌వాలే సారథ్యంలోని సిక్కు వేర్పాటువాదాన్ని అణచేందుకు అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంపై చేపట్టిన సాయుధ చర్య చివరికి ఇందిరను బలి తీసుకుంది. 1984లో ఆమె తన సిక్కు అంగరక్షకుల చేతుల్లోనే దారుణ హత్యకు గురయ్యారు.
- ఇందిర వారసునిగా ప్రధాని పదవి చేపట్టిన రాజీవ్ ఆ వెంటనే ప్రజాతీర్పు కోరి కాంగ్రెస్ చరిత్రలోనే అత్యంత ఘనవిజయం సాధించారు.

నన్ను చూడొద్దు.. ఎన్‌డీఏను చూడండి



'గత 58 నెలల మీ బిడ్డ పాలనలో మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే ఓటు వేసి ఆశీర్వదించండి'.
-బస్సు యాత్రలో ప్రజలకు విన్నవిస్తున్న సీఎం వైఎస్ జగన్

'నన్ను కాదు.. ఎన్‌డీఏను చూసి కూటమికి ఓటు వేయండి. కూటమిలో భాగస్వామికాని వైఎస్సార్‌సీపీకి రెండోసారి అవకాశం ఇవ్వడంలో అర్థం లేదు'.
-ప్రజాగళం సభల్లో ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి

ప్రజాగళం సభల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజలకు చేస్తున్న విజ్ఞప్తిని పరిశీలిస్తే.. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ఆయన ప్రజలకు చేసిందేమీ లేదని అంగీకరించినట్లు స్పష్టమవుతోంది. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో పది శాతం కూడా అమలు చేయకుండా ప్రజలను వంచించారు. ఇటు ప్రజలకు.. అటు రాష్ట్రానికి చేసిన మంచేమీ లేకపోవడంతో తన పరిపాలనను చూసి ఓటు వేయాలని అడిగే నైతికతను చంద్రబాబు కోల్పోయారు. అందుకే తన పరిపాలనను చూసి కాకుండా, ఎన్‌డీఏకు ఓటు వేయాలని చంద్రబాబు కోరుతుండటం చర్చనీయాంశమైంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. మద్య నిషేధానికి మంగళం పాడి, రూ.2కే కిలో బియ్యాన్ని రూ.5.50కు పెంచేసి అప్పట్లో మోసం చేశారు. మొన్నటికి మొన్న.. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టు కట్టిన చంద్రబాబు.. 650కి పైగా హామీలిచ్చి కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చారు. చంద్రబాబు నేతృత్వంలో 2014 జూన్ 8న కొలువుదీరిన సర్కార్ మాటలతో మాయ చేస్తూ పాలన సాగించింది. చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్ ఫొటోలతో, చంద్రబాబు సంతకం చేసి మరీ ఇంటింటికీ లేఖలు పంపి ఇచ్చిన ప్రధాన హామీల్లో రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయకుండా వంచించారు. రూ.14,205 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా అక్క చెల్లెమ్మలను బాబు దగా చేశారు. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతిగా నెలకు రూ.2 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికి యువతను మోసగించారు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా వంచించారు. బీసీ సబ్ ప్లాన్ కింద ఏడాదికి రూ.పది వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు వ్యయం చేస్తామని చెప్పి, ఆనక మాట తప్పి బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వకుండా వంచించారు. పవర్ లూమ్స్, చేనేత రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారు. అరకొరగా ఇచ్చే సంక్షేమ పథకాల ఫలాలు దక్కాలంటే తమకు లంచాలు ఇవ్వాల్సిందేనంటూ నాడు జన్మభూమి కమిటీలు అరాచకం సృష్టించాయి. వీటన్నింటిని గుర్తించిన జనం.. 2019 ఎన్నికల్లో కేవలం 23 శాసనసభ స్థానాలకే టీడీపీని పరిమితం చేసి చంద్రబాబుకు విశ్వసనీయత లేదని చాటి చెప్పారు. పది నెలల క్రితం రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను జనం పట్టించుకోకపోవడం ద్వారా చంద్రబాబుకు విశ్వసనీయత లేదని మరోమారు నిరూపించారు. వీటన్నింటి వల్ల ఇప్పుడు తనను చూసి కాకుండా, ఎన్‌డీఏకు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించడం ద్వారా తనకు విశ్వసనీయత లేదని చంద్రబాబు ఒప్పేసుకున్నట్లయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ప్రజాగళం సభల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వేడుకోలు

తద్వారా తాను అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమీ లేదని ఒప్పుకోలు
ఇచ్చిన 650 హామీల్లో 10% కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన బాబు
చేసిన మంచేమీ లేక ప్రజలను ఓటు వేయాలని అడిగే నైతికత కోల్పోయిన వైనం
సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన మినీ మేనిఫెస్టోను పట్టించుకోని జనం
అందుకే తన పాలనను చూసి కాకుండా.. ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వాలని పిలుపు
ఎన్‌డీఏలో భాగస్వామికాని వైఎస్సార్‌సీపీకి రెండోసారి అవకాశం ఇవ్వొద్దని ప్రచారం
కమీషన్ల కక్కుర్తితో పోలవరం కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టింది ఈయనే
ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీతోనే అధిక ప్రయోజనమంటూ అప్పట్లో సమర్థన
విషయం లేకే బాబు ఎన్‌డీఏ పేరుతో విన్యాసాలు చేస్తున్నారంటోన్న రాజకీయ విశ్లేషకులు
58 నెలల్లో సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని వివరిస్తున్న సీఎం జగన్
2014లో అధికారంలోకి వచ్చాక బాబు చేసిన మోసాన్ని ఎండగడుతున్న ముఖ్యమంత్రి

మీ ఇంట్లో మంచి జరిగిందా.. లేదా?

మంచి జరిగి ఉంటేనే నాకు ఓటు వేయండి: సీఎం జగన్

ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో గత 58 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలన వల్ల చేసిన మంచిని వివరిస్తున్నారు. సంస్కరణలతో విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రభాగాన నిలపడం గురించి స్పష్టీకరిస్తున్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టుకట్టి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలను ఎండగడుతున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో వేరుపడిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ వాటితో కలిసి మోసం చేయడానికి వస్తున్నారని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మీ బిడ్డ పాలనలో మీ ఇంటికి మంచి జరిగి ఉంటేనే ఓటు వేసి ఆశీర్వదించాలని వినమ్రంగా కోరుతున్న సీఎం జగన్‌కు జనం అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు.

విషయం లేకే బాబు విన్యాసాలు

బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని భావించి, గత ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ నుంచి వేరుపడిన చంద్రబాబు.. ప్రధాని నరేంద్ర మోదీని వ్యక్తిత్వహననం చేస్తూ తిట్ల పురాణం అందుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా అధికారంలోకి రావాలనే నెపంతో పవన్ కల్యాణ్‌ను వేరుగా పోటీ చేయించారు. కానీ.. ఇప్పుడు ప్రజా క్షేత్రంలో వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని గ్రహించి.. ఉనికి చాటుకోవడానికి బీజేపీ, జనసేనతో చంద్రబాబు మళ్లీ జట్టుకట్టారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్‌డీఏకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూనే.. కూటమిలో భాగస్వామికాని వైఎస్సార్‌సీపీని రెండోసారి గెలిపించి చాన్స్ ఇవ్వడంలో అర్థం లేదంటూ విచిత్ర విన్యాసాలకు తెరతీశారు. తాను అధికారంలో ఉన్నప్పుడు కమీషన్ల కక్కుర్తితో పోలవరం నిర్మాణ బాధ్యతల కోసం ప్రత్యేక హోదాను 2016 సెప్టెంబర్ 7న కేంద్రానికి తాకట్టు పెట్టారు. ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరిస్తూ సంతకం చేశారు. ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీతోనే రాష్ట్రానికి ప్రయోజనమంటూ బుకాయించారు. కమీషన్ల కోసం పోలవరంలో చంద్రబాబు విధ్వంసం సృష్టించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పోలవరాన్ని కమీషన్ల కోసం ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని మోదీ అప్పట్లో మండిపడటం ఎవరూ మరచిపోలేదు. నాడు కేంద్రానికి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టిన చంద్రబాబే.. ఇప్పుడు 22 మంది లోక్‌సభ సభ్యులు ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రత్యేక హోదాను సాధించలేక పోయిందని ఆరోపించడం రాజకీయ పరిశీలకులను విస్మయానికి గురిచేస్తోంది. విషయం లేకే చంద్రబాబు ఇలాంటి విచిత్ర విన్యాసాలకు తెరతీశారని వ్యంగ్యోక్తులు విసురుతున్నారు.

గుసగుస

బాబోయ్.. అబ్బోయ్..



శ్రీకాకుళం టీడీపీలో బాబాయ్(అచ్చెన్నాయుడు), అబ్బాయ్(రామ్మోహన్‌నాయుడు) రాజకీయాలకు ఇద్దరు సీనియర్లు(గుండ అప్పలసూర్యనారాయణ, కలమట వెంకటరమణ) బలయ్యారు. పూర్తిగా పార్టీకే దూరమయ్యారు. దండిగా డబ్బులిచ్చే మామిడి గోవిందరావు కోసం పాతపట్నంలో కలమటను, భవిష్యత్తులో తన(అచ్చెన్న) కొడుకు కృష్ణమోహన్ కోసం శిష్యుడు గొండు శంకర్‌ను శ్రీకాకుళంలో రంగంలోకి దించి గుండ దంపతుల్ని పక్కనెట్టారు. వీరిద్దరూ రానున్న ఎన్నికల్లో ఎలాగూ గెలవలేరని, దీంతో జిల్లా పార్టీని గంపగుత్తగా బాబాయ్, అబ్బాయే ఏలాలనుకుంటున్నారని శ్రేణుల గుసగుసలు.

చెల్లబోనివ్వ..



విశాఖ దక్షిణం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న చెన్నుబోయిన వంశీకృష్ణకు కూటమి పార్టీ టీడీపీకి చెందిన సీతంరాజు సుధాకర్ రూపంలో ఓటమి వెంటాడుతోందట. చాన్నాళ్ల నుంచి సీతంరాజు దక్షిణ సీటు కోసం ఆశపడుతున్నారు. వైఎస్సార్‌సీపీలో అవకాశం లేకపోవడంతో టీడీపీకి జంప్ చేశారు. ప్రస్తుతం దక్షిణంలో టీడీపీకి సరైన అభ్యర్థే లేరు. దీంతో వంశీకృష్ణకు వెన్నుపోటు పొడిస్తే, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అంతా తానే అవుతానని సీతంరాజు నమ్మకం. టీడీపీ తనకు ఉత్తర నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినా, దక్షిణంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. దీంతో చెన్నుబోయిన ఈసారీ చెల్లబోయేది లేదని సమాచారం.

వరుసగా మూడో'సారీ'!



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయ్యాక ఓటర్లు వరుసగా ఏ అభ్యర్థినీ మూడోసారి గెలిపించలేదు. ఇది పాలకొల్లు ఓటరు సెంటిమెంట్. 1955, 1962లో జరిగిన ఎన్నికల్లో అద్దేపల్లి సత్యనారాయణమూర్తిని గెలిపించారు. తర్వాత చేగొండి హరిరామజోగయ్య 1972, 89లో గెలిచారు. 1978, 83, 85 ఎన్నికల్లో ఆయన బరిలో నిలవలేదు. దీంతో వరుసగా పోటీ చేసిన రెండు పర్యాయాలూ గెలిచినట్లయింది. 1983, 85లో అల్లు వెంకటసత్యనారాయణ గెలిచారు. 1989లో మూడోసారి పోటీ చేసినా ఓటర్లు సారీ చెప్పేశారు. తర్వాత మళ్లీ 1994, 1999లో అల్లు బరిలో నిలిచి, గెలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మలకు కూడా ఈ సెంటిమెంట్ గుబులు పట్టుకుంది.

'ఉండి'న్!


టీడీపీలో సీట్ల పంచాయితీ కొలిక్కి రావట్లేదు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు తొలి జాబితాలో సీటు దక్కింది. అయితే గతంలో తాను త్యాగం చేసిన ఆ స్థానాన్ని ఈసారి తనకే ఇవ్వాలని శివరామరాజు పట్టుబట్టినా చంద్రబాబు పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన ఆయన రెబల్‌గా బరిలో ఉంటానంటూ ప్రచారం చేసుకుంటున్నా రు. మరోవైపు నరసాపురం ఎంపీ స్థానాన్ని ఆశించి భంగపడ్డ రఘురామకృష్ణరాజును ఉండి అసెంబ్లీ నుంచి బరిలో నిలుపుతారన్న వార్తలింకా నడుస్తున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్న నియోజకవర్గ ప్రజలు మాత్రం వెన్నుపోటు పార్టీకి ఓటు పోటు తప్పదంటున్నారు.

మీకు తెలుసా?

బూత్ క్యాప్చరింగ్ అంటే..

ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం, పోలింగ్‌ను అడ్డుకునేలా ప్రయత్నించడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఎవరైనా కావాలని బ్యాలెట్ పేపరుగానీ, ఈవీఎంలను పాడు చేయడం, విరగొట్టడం, ఎన్నికల గుర్తులపై సిరా పోయడం వంటివి ఇందులో భాగంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఇలా చేస్తే ప్రభుత్వ సిబ్బంది అయితే మూడు నుంచి ఐదేళ్ల జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులైతే ఒకటి నుంచి మూడేళ్లు జైలు శిక్ష విధిస్తారు.

ఇంటర్వ్యూ



ఓ నాయకుడి గురించి రాసేటప్పుడు కలం కదలాలంటే ఆ నాయకుడి వ్యక్తిత్వంలో బలం ఉండాలి. అక్షరాలు పరుగులు తీయాలంటే లక్షణాలు ప్రేరణ కావాలి అంటున్నారు జానపద గేయ రచయిత లక్ష్మణ్. 'నీ బుల్లెట్టు బండెక్కి..' పాట ద్వారా తెలుగు రాష్ట్రాల్ని ఊపేసిన ఈ యువ రచయిత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుణగణాల్ని వర్ణిస్తూ రాసిన 'జెండాలు జత గట్టడమే మీ అజెండా.. జనం గుండెలో గుడికట్టడమే జగన్ అజెండా' అనే పాట తెలుగు నాట ఉర్రూతలూగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన సాక్షితో తన అనుభూతిని పంచుకున్నారిలా... - సత్యార్థ్

ఆయన లక్షణాలే నా అక్షరాలకు స్ఫూర్తి

'జెండాలు జత కట్టడమే మీ అజెండా' పాట రచయిత లక్ష్మణ్

పేదల ముంగిట్లో పథకాలు

పాట రాయడానికి ముందు వలంటీర్లతో స్వయంగా మాట్లాడి ఆయన అమలు చేసిన పథకాల గురించి తెలుసుకున్నా. కడుపు నిండినోడ్ని కాదు ఆకలితో కడుపు మండేవాడ్ని మాత్రమే పట్టించుకోవాలనీ, చాచిన ప్రతీ చేయికీ సాయం అందాలి అనే ఆలోచనలతోనే ఆయన ఆ పథకాలన్నీ తీర్చిదిద్దారని అర్థమైంది. ఆ అవగాహనే ''మా ఇంటికే తెచ్చిందు ప్రభు త్వం మా చేతికే ఇచ్చిందు రా పథకం'' అంటూ కీర్తించేలా చేసింది. ప్రభుత్వ పథకాలు ఇంటికి రావడం దేశంలోనే జగన్ సార్ వల్ల వచ్చిన గొప్ప మార్పు. నిరుపేదలు ఆస్పత్రి ఖర్చులతో అన్యాయం అయిపోవద్దు. రోగంతో కోలుకున్నాక కూడా వాళ్ల ఇంటికి వెళ్లి వాళ్లకు పూర్తిగా నయమైంది అని కచ్చితంగా తెలుసుకోవాలి... అని ఆయన మాట విన్నప్పుడు నిజంగా నాకు కళ్లలో నీళ్లొచ్చాయి.

పరిచయమైన కొద్దీ... పదునెక్కిన పదం

జగన్ మీద అప్పటికే ఎన్నో గొప్ప పాటలు వచ్చాయి. ఆయన కోసం పాట రాయాలంటే మామూలు విషయం కాదు. అందుకే ఈ పాట రాసే అవకాశం నాకు వచ్చినప్పుడు... కొంచెం సందేహించిన మాట నిజం.పైగా నాది తెలంగాణ కావడంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి అంతగా తెలియదు. దాంతో పాటకు ముందు ఆయన ఇంటర్వ్యూ లు వరుసపెట్టి చూశా.. రకరకాల మార్గాల ద్వారా తెలుసుకుంటుంటే....అర్థమవుతూ వచ్చింది జగన్ ఏంటో...

కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా..

జగన్ పుట్టుకలో వెనుకడుగేయని తత్వం ఉంది. ఆయన్ను నమ్ముకున్న కార్యకర్త ఆత్మగౌరవంతో ఉండాలి. ధైర్యంగా కొట్లాడాలి. ఏదోవిధంగా గెలవాలని, తాను పొత్తులకు దిగజారిపోకూడదు అని ఆయన అనుకుంటారు. తన కోసం వారు మనస్సాక్షిని చంపుకుని బతకొద్దు అనేది ఆయన ఆలోచన అని నాకు అర్థమైంది. పైన ఉన్న దేవుడ్ని కింద ఉన్న జనాన్నే నేను నమ్ముకున్నా అంటూ తరచుగా ఆయన చెప్పడం నాకెంత స్ఫూర్తినిచ్చిందో...

నిఖార్సైన గ్రేట్ లీడర్...

ఆయన పాట రాసి అది అందరి మెప్పు పొందడం వల్ల ఎంత ఆనందం పొందుతున్నానో...ఆయన పాలన విశేషాలు, ప్రజాసేవ గురించి తెలుసుకోవడం వల్ల అంతకు మించిన ఆనందం పొందుతున్నాను. ఇలాంటి పేదల పక్షపాతి లాంటి నాయకుడ్ని నేనింత వరకూ చూడలేదు. ఇంత చేసినా.. రకరకాలుగా ఆయనకు చెడు చేయాలనే ఆలోచనలు కొంతమంది చేస్తున్నారని బాధ అనిపిస్తుంది. సారిచ్చిన పథకాలు పేదింటికి ఏ స్థాయిలో అందుతున్నాయి? పేదలు ఎంత తృప్తిగా ఉన్నారు? అనేది కనపడుతున్నా.. వ్యతిరేక మీడియా దుష్ప్రచారం చేస్తోంది. అందుకే నా వంతుగా ఆయన వ్యక్తిత్వాన్ని పాట ద్వారా బలంగా చెప్పాలని అను కున్నా. నేను రైటర్‌గా గతంలోనూ కొందరు నేతల గుణగణాల్ని వర్ణిస్తూ రాశాను. అయితే వ్యక్తిగతంగా ఇంతగా ప్రభావితం అయింది ఇదే తొలిసారి. జగన్ గారి గురించి రాసేటప్పుడు తెలియని శక్తి ఏదో ఆవహిస్తుందేమో అనిపించింది.

మరిన్ని కథనాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ఏపీ సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహినిలో ఓ భాగం. అభివాదం చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్



గోదావరి పొడవునా.. ఉరకలెత్తిన జనం

17వ రోజు సీఎం జగన్ బస్సు యాత్రకు పోటెత్తిన జనవాహిని

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: మండుటెండల్లోనూ గోదారమ్మ పోటెత్తింది! ఉభయ గోదావరులూ ఉప్పొంగాయి! కోనసీమ కోలాహలమైంది! గోదావరి తీరం జన సంద్రమైంది! రావులపాలెం నుంచి రాజమహేంద్రి దాకా ఎటుచూసినా జన ప్రవాహమే! తమకు మంచి చేసిన జననేతను స్వయంగా చూసేందుకు పెద్దల నుంచి పిల్లల దాకా ప్రతి ఒక్కరూ ఎండను లెక్క చేయకుండా వెల్లువలా తరలి వచ్చారు. అభిమాన నేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ఉత్సాహం చూపారు. ఊర్లన్నీ జాతీయ రహదారి బాటపట్టాయి. ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం'బస్సు యాత్ర సందర్భంగా 17వ రోజైన గురువారం కనిపించిన దృశ్యాలివి. తేతలి నుంచి తణుకు వరకు రోడ్డుకు ఇరువైపులా మానవహారంలా నిలబడి సీఎం జగన్ ఆశీర్వదించారు. 'మళ్లీ నువ్వే సీఎం'అంటూ నినదించారు. ప్రభుత్వ రంగంలో కొత్త మెడికల్ కాలేజీలను నెలకొల్పి తమ కలను నెరవేర్చిన సీఎం జగన్‌కు రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థులు థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలియచేశారు. తేతలి రాత్రి బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన మేమంతా సిద్ధం బస్సు యాత్ర జన సందోహం తరలిరాగా పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చేరుకుంది. తేతలి నుంచి యాత్ర ప్రారంభం కాగానే దారి పొడవునా అక్క చెల్లెమ్మలు, వృద్ధులు రోడ్డుకు ఇరువైపులా నిలబడి సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. దారిలో తమ సమస్యలు చెప్పుకునేందుకు ఎదురు చూస్తున్న దివ్యాంగులు, స్థానికులను సీఎం జగన్ ఆప్యాయంగా పరామర్శించి వినతి పత్రాలు స్వీకరించారు.

బైక్ ర్యాలీతో కోనసీమ స్వాగతం..

జాతీయ రహదారి వెంట సాగిన సీఎం జగన్ యాత్రలో ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున మహిళలు కనిపించారు. ఈతకోటలో యువకులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీగా వచ్చి తమ ప్రియతమ నేతను అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోకి ఆహ్వానించారు. అమ్మ ఒడితో ఆదుకున్న జగన్ మామయ్యను చూసేందుకు స్కూల్ పిల్లలు ఉత్సాహంగా తరలి వచ్చారు. ఉచితంగా ఉన్నత విద్యను అందిస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా లిడియా ఫార్మసీ కాలేజీ విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం గోపాలపురం సెంటర్ వద్ద గోదావరి సాక్షిగా ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్రకు మహిళలు మేమంతా సిద్ధం అంటూ ఘన స్వాగతం పలికారు. నుదుటికి తగిలిన గాయం బాధిస్తున్నా అంత ఎండలోనూ సీఎం జగన్ బస్సుపైకి చేరుకుని చిరునవ్వుతో అందరికీ అభివాదం చేశారు.

ఎడ్లబండ్లపై వచ్చిన రైతన్నలు..

మధ్యాహ్నం పొట్టిలంక వద్ద స్వల్ప విరామం అనంతరం సీఎం జగన్ యాత్రను తిరిగి ప్రారంభించారు. వేమగిరి సెంటర్‌లో రైతులు ఎడ్లబండ్లపై వచ్చి స్వాగతం పలికారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు, ఆర్బీకేలతో మాకు ఎంతో మేలు చేసిన సీఎం జగన్ అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. అక్క చెల్లెమ్మలు 108 గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. రావులపాలెం నుంచి బొమ్మూరు, రాజమండ్రిలోని పలు కూడళ్లు మధ్యాహ్నం నుంచే జనంతో కిక్కిరిసిపోయాయి. బొమ్మూరు నుంచి మొదలు దేవీచౌక్ వరకు ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయాయి. సీఎం జగన్ పాలనకు మద్దతుగా రాజీనామా చేసిన పలువురు వలంటీర్లు మేమంతా నీవెంటే నంటూ వేమగిరిలో ప్లకార్డులు ప్రదర్శించారు.

రాజమహేంద్రి జనసంద్రం...

సాయంత్రం 4.30 గంటలకు బొమ్మూరు జంక్షన్ చేరుకున్న సీఎం జగన్ యాత్ర 5.45కి మోరంపూడికి చేరుకుంది. రోడ్డు మొత్తం జనంతో నిండిపోవడంతో 3 కి.మీ ప్రయాణానికి దాదాపు 1.15 గంటల సమయం పట్టింది. మోరంపూడి సెంటర్ నుంచి దాదాపు 16 కి.మీ కొనసాగిన యాత్ర రాత్రి 9 గంటలకు దివాన్‌చెరువు చేరుకుంది. మధ్యలో ప్రతి సెంటర్ జనంతో నిండిపోయింది. రాజమండ్రి చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు నిర్వహించిన యాత్రకూ ఇంతమంది ప్రజలను చూడలేదని స్థానిక వ్యాపారి శ్రీనివాస్ గుప్తా తెలిపారు. రాజమండ్రి చరిత్రలో కనీవినీ ఎరగనంత జనం జగన్ కోసం వచ్చారని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 19-4-2024



న్యూస్‌మేకర్
సృష్టి దబాస్

పగలు ఉద్యోగం... రాత్రి చదువు

ఇప్పుడు ఐ.ఏ.ఎస్.

సృష్టి దబాస్ ముంబై ఆర్.బి.ఐ.లో హెచ్.ఆర్.లో పని చేస్తుంది. ఉద్యోగానికి రానూ పోనూ సమయం పని ఒత్తిడి ఇవేవీ ఆమె ఐ.ఏ.ఎస్. లక్ష్యానికి అంతరాయం కలిగించలేదు. కేవలం సొంతంగా చదువుకొని యు.పి.ఎస్.సి. 2023లో టాప్ 6 వ ర్యాంక్ సాధించింది. ఆమె పరిచయం.

ముంబై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ స్థాయిలో హెచ్.ఆర్.లో పని చేస్తున్న సృష్టి దబాస్ నెల జీతం 2,80,000. బహుశా ఒక జిల్లా కలెక్టర్‌కు కూడా అంతే ఉండొచ్చు. లేదా దరిదాపుల్లో ఉండొచ్చు. 25 ఏళ్ల వయసులో అంత జీతం వస్తున్న ఉద్యోగం (కాంపిటీటివ్ ఎగ్జామ్ రాసి సాధించింది) వేరొకరికి ఉంటే చాలు ఈ జీవితానికి అనుకునేవారు. కాని సృష్టి అలా అనుకోలేదు. ముంబైలో తన రూమ్ నుంచి ఆఫీస్‌కు రోజూ తిరుగుతూనే, ఉద్యోగం చేస్తూనే ఐ.ఏ.ఎస్ కల నెరవేర్చుకోవాలనుకుంది. సాధించింది. యు.పి.ఎస్.సి. 2023 ఫలితాల్లో జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు సాధించడం అంటే మాటలు కాదు. ఆమె చెప్పినట్టుగా 'దాని వెనుక చాలా కష్టం ఉంది'. అవును. కష్టం లేనిది ఏ విజయమూ దక్కదు.

ముందు కుటుంబం

ఢిల్లీలో పొలిటికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన సృష్టి వెంటనే ఉద్యోగం చేసి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవాలనుకుంది. పోటీ పరీక్ష రాసి 'సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్'మంత్రిత్వ శాఖ'లో ఉద్యోగం సంపాదించింది. మరో పోటీ పరీక్ష రాసి రిజర్వ్ బ్యాంకులో ఉద్యోగం సంపాదించి ముంబైకి షిఫ్ట్ అయ్యింది. 'నా కుటుంబం కుదురుకోవాలనుకున్నాను. అందుకే ఉద్యోగాలు చేశాను. నాకు చదువుకోవాలని ఉన్నా ఓపెన్ యూనివర్సిటీ ద్వారానే ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ చదివాను' అని చెప్పిందామె. సృష్టి తండ్రి కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏ.ఎస్.ఐ. స్థాయికి వచ్చిన మధ్యతరగతి ఉద్యోగి. తల్లి గృహిణి. సృష్టి బాల్యం నుంచి కూడా చదువులో చురుగ్గా ఉండేది.

మొదటి అటెంప్ట్

టాప్ 10 ర్యాంకుల్లో స్థానం సంపాదించాలంటే చాలామంది రెండోసారి, మూడోసారి ప్రయత్నించి సాధిస్తుంటారు. కాని సృష్టి తన మొదటి ప్రయత్నంలోనే 6వ ర్యాంకు సాధించింది. అదీ ఉద్యోగం చేస్తూ. 'ఇదెలా సాధ్యం' అనడిగితే 'ఉద్యోగం చేస్తూ చదవాలని నిశ్చయించుకున్నాను కాబట్టి దానికి తగ్గట్టుగా నా మనసుకు తర్ఫీదు ఇచ్చుకున్నాను. నా ఉద్యోగం ఐదు రోజులే. శని, ఆదివారాలు పూర్తిగా చదివేదాన్ని. తెల్లవారు జామున లేవడం నాకు అలవాటు. అప్పుడు చదివేదాన్ని. ఆఫీసు నుంచి తిరిగి వచ్చి అలసట ఉన్నా చదివేదాన్ని. మా అమ్మ నా కష్టం చూసి సతమతమయ్యేది. కాని నేను గట్టిగా నిశ్చయించుకున్నాను. మా ఆఫీస్‌లో కూడా నాకు ప్రోత్సాహం దొరికింది. పనిలో కాసేపు విరామం దొరికినా ఆర్.బి.ఐ.లోని లైబ్రరీకి వెళ్లి చదువుకునేదాన్ని. నాకున్న సెలవులని పొదుపుగా వాడి ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు, ఇంటర్వ్యూకు ముందు ఉపయోగించుకున్నాను' అని తెలిపింది సృష్టి.

చట్ట ప్రకారం

సృష్టి అటెండ్ అయిన మాక్ ఇంటర్వ్యూల్లో 'మీ నాన్న పోలీస్ కదా. నువ్వు పోలీసు వారి పని స్వభావంలో ఎటువంటి మార్పు తెస్తావ్' అని అడిగితే 'ముందు ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి. ఖాళీల వల్ల పని ఒత్తిడి పోలీసులకు ఎక్కువ. అలాగే సాంకేతికంగా వారికి ఆధునిక ఆయుధాలు, ఎక్విప్‌మెంట్ సమకూర్చాలి' అని చెప్పింది. 'ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లను ఎలా చూస్తావ్' అనంటే 'అది చట్టసమ్మతం కాదు. నేనైతే ఎన్‌కౌంటర్‌లను కేవలం ఆత్మ రక్షణకు మాత్రమే ఉపయోగిస్తాను' అని తెలిపింది. 'బుల్‌డోజర్‌లతో ఆక్రమణల తొలగింపు పై నీ అభిప్రాయం ఏమిటి?' అనడిగితే 'కూల్చడం కన్నా అక్కడ ఉన్నవారికి పునరావాసం కల్పించడం కీలకం' అంది.

అంతర్జాతీయల వ్యవహారాలను తన ప్రధాన ఆసక్తిగా చెప్పిన సృష్టి మన దేశ అంతర్జాతీయ వ్యవహారాలపై లోతైన అవగాహన కలిగి ఉంది. ఆమె కథక్ డాన్సర్ కూడా. 'భారతదేశంలో ఎన్ని క్లాసికల్ డాన్సులున్నాయి?' అనే ప్రశ్నకు 'మన సంగీత నాటక అకాడెమీ 8 డాన్సులను గుర్తించింది. కాని సాంస్కృతిక మంత్రిత్వ శాఖ చౌవ్ డాన్స్‌ను కూడా క్లాసికల్‌గా పేర్కొంది. కాబట్టి సరైన ఆన్సర్ 8 కావచ్చు. 9 కూడా కావచ్చు' అంది సృష్టి.

ఆమె సక్సెస్ స్టోరీ చాలామందికి తప్పకుండా స్ఫూర్తి అవుతుంది

బ్యూటిప్స్

పసుపుతో పింక్ లిప్స్



- పాలలో చిటికెడు పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి పావుగంట మర్దన చేయాలి. రాత్రంతా అలానే ఉంచుకుని ఉదయం నీటితో కడిగేయాలి. రోజూ రాత్రిపూట క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల పెదవులు గులాబి రంగులోకి మారతాయి.



- చిటికెడు పసుపులో మూడు చుక్కల నెయ్యి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. రాత్రంతా ఉంచుకుని ఉదయాన్నే కడిగేయాలి. తరచూ ఇలా చేయడం వల్ల పెదవులపై ఏర్పడిన మచ్చలు పోతాయి.



- హెయిర్ కలర్‌గానీ హెన్నాగానీ జుట్టుకు పెట్టే ముందుకు చెవులు, నుదురుకు పెట్రోలియం జెల్లిని రాయాలి. తరువాత హెన్నా పెట్టుకోవాలి. చెవులు, నుదురు ప్రాంతంలో హెన్నా పడ్డప్పటికీ నీటితో కడిగితే ఇట్టే పోతుంది.



- పెట్రోలియం జెల్లి లానే ఆలివ్ ఆయిల్‌ను కూడా డైకు ముందు చెవులు, నుదురు, మెడకు అప్లై చేసి మర్దన చేయాలి. తరువాత డై పడినా నీటితో కడిగితే పోతుంది.



ఫ్యాషన్

వేసవికి నప్పే

వింటేజ్ స్టైల్

పెరిగే ఉష్ణోగ్రతలకు తట్టుకునేలా ఉండాలి. మిక్స్ అండ్ మ్యాచ్ ఎంపిక క్యాజువల్ అనిపించాలి. పాతకాలపు కాంతులు కట్టిపడేస్తున్నట్టే ఉండాలి. వెస్టర్న్ టచ్‌తో ఆకట్టుకునేలా ఉండాలి. కాలానికి తగినట్టు, కలర్‌ఫుల్‌గా కనిపించాలి. తమవైన నైపుణ్యాలను జోడించే ఫ్యాషన్ ఔత్సాహికులు వింటేజ్ స్టైల్‌ని మెరిపిస్తున్నారు.

మట్టి రంగులు

సాధారణంగా లేత రంగులను ఈ సీజన్‌కి ఎంచుకుంటాం. అయితే, వెస్టర్న్ వింటేజ్ స్టైల్‌కి ముదురు గోధుమ, ఎరుపు, నారింజ ఈ సీజన్‌లో మొదటి వరసలో ఉంటాయి. ఈ రంగులు వెస్టర్న్ వస్త్రధారణకు సహజ సౌందర్యాన్ని జోడించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ రంగులు ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని వెల్లడిస్తాయి. క్యాజువల్ వేర్‌కి సొగసును అందిస్తాయి.

లేసులు, అల్లికలు

ఈ సీజన్‌లో మరో ఆకర్షణగా కనిపించేది డెనిమ్ ఎలిమెంట్స్. లేసులు, అల్లికల అంచులు గల డ్రెస్సులు వెస్టర్న్ ఫ్యాషన్‌లో మనకు ప్రధానంగా కనిపిస్తుంటాయి. ఇవి, డ్రెస్సులకు ఉల్లాసభరితమైన అలంకరణను జోడిస్తాయి. ముదురు గోధుమ రంగులో ఉండే ప్లెయిన్ స్వెడ్ టాప్ లేదా జాకెట్స్, అంచులతో డిజైన్ చేసినవి ఈ సీజన్ స్టైల్‌కి బాగా నప్పుతాయి. ఇవి మోడ్రన్ టచ్, వింటేజ్ స్టైల్‌తో ఆకట్టుకుంటాయి.

***

డెనిమ్‌తో జత చేసే ప్రింటెడ్ ఫ్యాబ్రిక్ స్కర్టులు, బ్లేజర్లతో మ్యాక్సీ డ్రెస్సులు ధరిస్తే ఆధునికపు హంగులతో మెరిసిపోతారు.

***

స్టెట్సన్ టోపీలు, కౌబాయ్ బూట్లు డ్రెస్సులకు వెస్టర్న్ లుక్‌ని ఇట్టే తీసుకువస్తాయి. పూసల దండలు, ఇతర ఫ్యాషన్ జ్యువెలరీ, నన్నని హ్యాండిల్ గల బ్యాగ్‌తో పూర్తిగా వింటేజ్ లుక్‌తో అట్రాక్ట్ చేస్తారు.











వంటిల్లు

పచ్చడి మామిడి

మామిడి కాయల సీజన్ కదా... ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా మామిడి కాయలు కనిపిస్తున్నాయి. అలాగని తొందరపడి ఆవకాయ, మాగాయ పెట్టేయకూడదు. ఎందుకంటే ఎండలు ఇంకాస్త ముదరాలి. ఎండలతోపాటే మామిడి కాయలు కూడా బాగా టెంకపట్టాలి. అప్పుడయితేనే ఏడాదంతా నిల్వ ఉంటుంది ఆవకాయ. అయితే అప్పటిదాకా చూస్తూ ఊరుకోవాలా? ఏమక్కరలేదు. ఆవకాయ పెట్టేలోగా రెండు మూడు వారాల నుంచి నెలరోజుల దాకా తాజాగా ఉండే ఈ పచ్చళ్లు ట్రై చేద్దామా మరి!

మ్యాంగో ఇన్‌స్టంట్ పికిల్



కావలసినవి: పచ్చి మామిడి కాయ – ఒకటి; కశ్మీర్ మిరప్పొడి – టేబుల్ స్పూన్; నువ్వుల నూనె– 3 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు– టీ స్పూన్; మెంతులు – అర టీ స్పూన్; పసుపు – అర టీ స్పూన్; ఇంగువ – పావు టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్.

తయారీ: ● మామిడికాయను శుభ్రంగా కడిగి తుడిచి, సొన పోయేటట్లు తొడిమను తొలగించాలి. గింజను తొలగించి, తొక్కతో సహా ముక్కలు తరగాలి. ముక్కలకు ఉప్పు కలిపి పక్కన పెట్టాలి. సుమారు ఒక కప్పు ముక్కలు వస్తాయి ● బాణలిలో మెంతులు వేసి (నూనె లేకుండా) దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి ● అదే బాణలిలో నువ్వుల నూనె వేడి చేసి అందులో ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత ఇంగువ, మెంతిపొడి, మిరప్పొడి, పసుపు వేసి స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తర్వాత ఈ పోపును మామిడి ముక్కల్లో వేసి కలపాలి. అరగంట సేపటికి ఉప్పు, కారం, మసాలా దినుసుల రుచి ముక్కలకు పడుతుంది. ఈ పచ్చడిని తేమ లేని పాత్రలో నిల్వ చేసుకుంటే నాలుగు రోజుల వరకు తాజాగా ఉంటుంది.

చనా మేథీ మ్యాంగో పికిల్



కావలసినవి: పచ్చి మామిడి ముక్కలు – కప్పు; మామిడి తురుము – కప్పు; పచ్చి శనగలు – అర కప్పు; మెంతులు – అర కప్పు; ఆవాలు – అర కప్పు; ఉప్పు – అర కప్పు; మిరప్పొడి– అర కప్పు, నూనె – కప్పు.

తయారీ: ● మందపాటి బాణలి వేడి చేసి పచ్చి శనగపప్పును దోరగా వేయించి పక్కన పెట్టాలి. ఆ తర్వాత మెంతులు, ఆవాలను (నూనె లేకుండా) వేయించి చల్లారిన తర్వాత పొడి చేసుకోవాలి. ● ఒక పాత్రలో మామిడి ముక్కలు, మామిడి తురుమును వేయాలి. అందులో శనగలు, మెంతిపొడి, ఆవపిండి, మిరప్పొడి, ఉప్పు, పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని తడిలేని సీసాలో కూరినట్లు పెట్టి గట్టిగా మూతపెట్టాలి. మూడు రోజుల తర్వాత నూనెను మరిగించి చల్లార్చిన తర్వాత ఆ నూనెను సీసాలో ఉన్న మిశ్రమం పై నుంచి పోయాలి. ఈ పచ్చడిని మూడు రోజుల తర్వాత తినవచ్చు. నెల రోజుల పాటు తాజాగా ఉంటుంది. ఇది గుజరాతీ శైలి మామిడి పచ్చడి.

మామిడి తురుము పచ్చడి



కావలసినవి: మామిడి తురుము – 2 కప్పులు; మిరప్పొడి– పావు కప్పు; ఉప్పు – పావు కప్పు; ఆవ పిండి– టేబుల్ స్పూన్; మెంతిపిండి– టేబుల్ స్పూన్; వెల్లుల్లి రేకల తురుము – టేబుల్ స్పూన్; నల్లజీలకర్ర (కలోంజి) – అర టీ స్పూన్; మెంతులు – టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఆవ నూనె – పావు కప్పు; పసుపు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్.

తయారీ: ● మామిడి తురుములో పసుపు, ఉప్పు, వెల్లుల్లి, కలోంజి వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి. ● బాణలి వేడి చేసి (నూనె లేకుండా) మెంతులు, జీలకర్ర వేయించి చల్లారిన తర్వాత మిక్సీలో పొడి చేసి మామిడి తురుములో వేసి కలపాలి. ఇప్పుడు మామిడి తురుములో ఆవపిండి, మెంతిపిండి, మిరప్పొడి, నూనె వేసి కలిపి ఉప్పు సరి చూసుకోవాలి. అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవచ్చు. ఇది నాలుగు రోజుల నుంచి వారం వరకు తాజాగా ఉంటుంది. మామిడి తురుమును పలుచని వస్త్రంలో కట్టి నీరు పోయేటట్లు చేసిన తర్వాత మసాలా దినుసులు కలిపి, నూనె పైకి తేలేటంత మోతాదులో పోసినట్లయితే ఆ పచ్చడి నెలల పాటు నిల్వ ఉంటుంది.

కిచెన్ టిప్స్

కుల్చాను కాల్చేటప్పుడు...



- పాన్ మీద కుల్చాను వేసి చుట్టుపక్కల కొద్దిగా నీళ్ల చల్లి మూతపెట్టాలి. ఒక వైపు కాలాక మరో వైపు తిప్పి చుట్టుపక్కల కొద్దిగా నీళ్ల చల్లి మూతపెడితే కుల్చా చక్కగా కాలుతుంది. చివరగా నూనె లేదా నెయ్యి చల్లుకుని సర్వ్ చేసుకుంటే కుల్చా చక్కగా కాలి రుచిగా వస్తుంది.



- ఉల్లిపాయను ముక్కలుగా తరిగాక చేతులు ఉల్లివాసన వస్తుంటాయి. ఇలాంటప్పుడు బంగాళ దుంప ముక్కతో చేతులను ఐదు నిమిషాలు రుద్ది, తరువాత నీటితో కడిగితే ఉల్లివాసన వదులుతుంది.

యువర్స్

సక్సెస్ స్టోరీ


ఆదిత్య శ్రీవాస్తవ

ఆదిత్య విజయం

యువతలో ఎక్కువ మంది సెర్చ్ చేస్తున్న పేరు... ఆదిత్య శ్రీవాస్తవ. యూపీఎస్సీ పరీక్షలో టాప్ 1లో నిలిచిన ఆదిత్యకు తొలి ప్రయత్నంలో 'ఫెయిల్యూర్' ఎదురైంది. మరింత కష్టపడి రెండో ప్రయత్నంలో 236 ర్యాంకు సాధించాడు. 'ఇది చాలదు' అనుకొని తప్పులను సరిద్దుకొని మరో ప్రయత్నంలో నెంబర్ వన్‌గా నిలిచాడు లక్నోకు చెంది ఆదిత్య. 'కష్టపడడం అవసరమే గానీ ఒక పద్ధతి ప్రకారం పడాలి' అని స్మార్ట్ స్ట్రాటజీతో అపూర్వ విజయం సాధించాడు ఆదిత్య శ్రీవాస్తవ...

ప్రపంచంలోని లీడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులలో ఒకటైన 'గోల్డ్ మాన్ శాక్స్'తో ప్రొఫెషనల్ జర్నీ ప్రారంభించాడు ఆదిత్య. 'బెంగళూరులో పెద్ద బ్యాంకులో పని చేస్తాడు' అని చుట్టాలు, మిత్రులు తన గురించి కొత్త వారికి పరిచయం చేసేవారు. తన గురించి గొప్పగా పరిచయం చేస్తున్న సంతోషంలో ఉండి, అక్కడికే పరిమితమై ఉంటే ఆదిత్య సివిల్ సర్వీసెస్‌లోకి అడుగు పెట్టేవాడు కాదేమో.

పెద్ద కంపెనీలో పనిచేస్తున్నా సరే ఆదిత్య హృదయంలో సివిల్ సర్వీసులలోకి వెళ్లాలి అనే కోరిక బలంగా ఉండేది. సివిల్స్ విజేతల మాటలు తనకు ఇన్‌స్పైరింగ్‌గా అనిపించేవి. ఒక ప్రయత్నం చేసి చూడాలనిపించేది.

పదిహేను నెలల తరువాత...

ఉద్యోగాన్ని, బెంగళూరును వదిలి హోమ్ టౌన్ లక్నోకు వచ్చాడు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేర్ కావడం ప్రారంభించాడు. 'ఎందుకొచ్చిన రిస్క్' అని కొద్దిమంది అన్నా ఆ మాటను పట్టించుకోలేదు.

2021

పరీక్ష సమయం రానే వచ్చింది. అయితే ప్రిలిమినరీ స్టేజిలోనే ఫెయిల్యూర్ పలకరించింది.

మామూలుగానైతే రథాన్ని వెనక్కి మళ్లించి వేరే కంపెనీలో ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి.

అయితే ఆదిత్య నిరాశపడలేదు. వెనకడుగు వేయలేదు.

ఎలాగైనా సరే తన కలను నిజం చేసుకోవాలి అని గట్టిగా అనుకున్నాడు.

గత సంవత్సర ప్రశ్నపత్రాల ఆధారంగా ఇన్-డెప్త్ ఎనాలసిస్‌తో ప్రిపరేషన్ విధానాన్ని రూపొందించుకున్నాడు. ప్రశ్నల సరళి, సెంటెన్స్ ఫార్మేషన్‌పై దృష్టి పెట్టాడు.

మాక్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలకు హాజరయ్యేవాడు. స్ట్రాటజిక్ ప్రిపరేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చాడు.

2022 యూపీఎస్సీ ఎగ్జామ్‌లో 236 ర్యాంకు సాధించాడు. ఇండియన్ పోలిస్ సర్వీస్(ఐపీఎస్)కు ఎంపిక య్యాడు. ట్రైనింగ్‌కు కూడా వెళ్లాడు.

అయినా సరే, ఇంకా ఏదో సాధించాలనే తపన. టాపర్లతో పోల్చితే తాను ఎందుకు వెనకబడిపోయాననే కోణంలో లోతైన విశ్లేషణ ప్రారంభించాడు. చేసిన తప్పులు ఏమిటి, వాటిని ఎలా సరిద్దుకోవాలి అనేదానిపై ప్రత్యేక దృష్టి పెట్టాడు.

యూపీఎస్సీ తాజా ఫలితాల్లో అపూర్వమైన విజయాన్ని సాధించాడు. నెంబర్ వన్ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. రిజల్ట్ ప్రకటించడానికి ముందు మనసులో....

'టాప్ 70లో ఉండాలి' అనుకున్నాడు ఆదిత్య. అయితే ఏకంగా మొదటి ర్యాంకు దక్కింది. అది అదృష్టం కాదు. కష్టానికి దొరికిన అసలు సిసలు ఫలితం. 'సివిల్స్‌లో విజయం సాధించడానికి సెల్ఫ్-మోటివేషన్ అనేది ముఖ్యం' అంటాడు ఆదిత్య శ్రీవాస్తవ.

పక్కా ప్రణాళిక

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన ఆదిత్య శ్రీవాస్తవకు పరీక్షలలో బోలెడు మార్కులు సొంతం చేసుకోవడం కొత్తేమీ కాదు. ఐఐటీ, కాన్పూర్‌లో బీటెక్, ఎంటెక్ చేశాడు. బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఐఐటీలో డెవలప్ చేసుకున్న ఎనాలటికల్ స్కిల్స్ యూపీఎస్సీ ప్రిపేరేషన్‌కు ఉపయోగపడ్డాయి. 'కాన్సెప్చువల్ అండర్‌స్టాండింగ్'లాంటి వాటితో ప్రిపరేషన్ మెథడ్‌ను రూపొందించుకున్నాడు. 'కష్టానికి పక్కా ప్రణాళిక తోడైతేనే విజయం సాధ్యం' అనేది ఆదిత్య నమ్మే సిద్ధాంతం. పాఠ్యపుస్తకాలకు అవల ఆదిత్యకు నచ్చిన సబ్జెక్ట్...రాక్షస బల్లులు. వాటికి సంబంధించిన కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటాడు. ఆదిత్య శ్రీవాస్తవ నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మన దేశంలోనే ఉంటాను. దేశం కోసమే పనిచేస్తాను'

● ఇంగ్లిష్ ఇడియమ్స్



పే త్రూ ది నోస్

సాధారణంగా చెల్లించేదాని కంటే ఎక్కువగా చెల్లించే సమయంలో వాడే మాట...పే త్రూ ది నోస్.

ఉదా: వీ హ్యాడ్ టూ పే త్రూ ది నోస్ ఫర్ అవర్ రూమ్ బికాజ్ ఇట్ వాజ్ ఏ లాంగ్ వీకెండ్ అండ్ మోస్ట్ ఆఫ్ ది హోటల్స్ వర్ బుక్‌డ్.

గోయింగ్ గ్రేట్ గన్స్

ఒక రంగంలో, పనిలో విజయవంతంగా దూసుకువెళ్లే సందర్భంలో వాడే మాట... గోయింగ్ గ్రేట్ గన్స్.

ఉదా: ది ఫర్మ్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈజ్ గోయింగ్ గ్రేట్ గన్స్ విత్ హిజ్ ఎక్స్‌పాన్షన్ ప్లాన్స్.

అవును... ఇది నిజమే!

* ఆడ నెమలిని పీహెన్ అని పిలుస్తారు.
* అగ్గిపుల్లల కంటే ముందుగానే లైటర్‌ను తయారుచేశారు.
* కరెంట్ మూడ్ ఆధారంగా పాటలను ప్లే చేసే హెడ్‌ఫోన్‌లను న్యూరబుల్ కంపెనీ తయారు చేసింది.

● టెక్.. టాక్

రియల్‌మీ 12 ప్లస్



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 14
మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్ రిజల్యూషన్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ

షావోమి ప్యాడ్ 6 ఎస్ ప్రో 12.4



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
రిజల్యూషన్: 2032×3048 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
కలర్స్: బ్లాక్, బ్లూ, గ్రీన్
బరువు: 590 గ్రా.
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్

స్పాటిఫైలో రీమిక్సింగ్ ఫీచర్



పాపులర్ మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ స్పాటిఫై టిక్‌టాక్-ఇన్‌స్పైర్‌డ్ ఫీచర్‌పై పనిచేస్తోంది. యూజర్ ఈ ఫీచర్‌తో పాటలను రీమిక్స్ చేయవచ్చు. ఈ కొత్త ఫీచర్‌లో డిఫరెంట్ మిక్సింగ్ టూల్స్ ఉంటాయి. జానర్స్, యాక్టివిటీస్, మూడ్స్...మొదలైన వాటి ఆధారంగా యూజర్‌లు సాంగ్స్‌ను ఫిల్టర్ చేయవచ్చు. తమ అభిమాన ఆర్టిస్ట్‌లకు సంబంధించిన పాటలను 'స్పీడ్ అప్, మాష్-అప్, ఎడిట్' చేయడానికి ఉపకరించే ఫీచర్ ఇది.

గూగుల్ ఫొటోస్‌లో ఏఐ ఫీచర్‌లు



అన్‌బ్లర్ ఫొటోస్, మ్యాజిక్ ఎరేజర్, పోర్ట్రాయిట్ లైట్, మ్యాజిక్ ఎడిటర్ అనే నాలుగు ఏఐ గూగుల్ ఫొటో ఫీచర్‌లు ఆండ్రాయిడ్ డివైజ్‌లకు త్వరలో రానున్నాయి.

ఫొటో అన్‌బ్లర్: బ్లరీనెస్‌ను తొలగించడం ద్వారా పిక్చర్ క్వాలిటీని మెరుగుపరిచేలా డిజైన్ చేశారు.

మ్యాజిక్ ఎరేజర్: పిక్చర్‌లోని అన్‌వాంటెడ్ ఎలిమెంట్స్ తొలగించేలా, పర్‌ఫెక్ట్‌గా పిక్చర్ ఉండేలా డిజైన్ చేశారు.

పోర్ట్రాయిట్ లైట్: మొబైల్ ఫొటోగ్రాఫర్‌లకు ఇది రివల్యూషనరీ ఫీచర్‌లాంటిది. ఇమేజ్‌లోని సబ్జెక్‌ను బట్టీ లైటింగ్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు.

మ్యాజిక్ ఎడిటర్: అడ్వాన్స్‌డ్ ఎడిటింగ్ కేపబిలిటీస్‌తో కూడిన యూజర్ ఫ్రెండ్లీ ఏఐ-పవర్డ్ టూల్ ఇది. బ్యాక్‌గ్రౌండ్స్‌ను చేంజ్ చేయవచ్చు. రీపొజిషన్ చేయవచ్చు. కొత్త లుక్ తీసుకురావచ్చు.

● గేమింగ్

గ్రహాంతరవాసులతో వార్



యాక్షన్ అడ్వెంచర్ గేమ్ 'స్టెల్లర్ బ్లేడ్' ఈ నెల 26న విడుదల కానుంది. కథ విషయానికి వస్తే భూమి మీద ఉన్న మనుషులకు, గ్రహాంతవాసులకు మధ్య యుద్ధం జరుగుతుంది. గ్రహాంతరవాసులతో యుద్ధంలో ఓడిపోయిన తరువాత మానవాళి తరిమివేయబడుతుంది. కోల్పోయిన తమ స్వస్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఈవ్‌తో పాటు ఆమె దళం 'నయతిబా' అనే గ్రహాంతరవాసులతో పోరాటానికి సిద్ధం అవుతుంది. థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే గేమ్ ఇది. శత్రువు వ్యూహాల ఆధారంగా ఎదురు దాడి చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌కు సంబంధించిన డెమోను గత నెల విడుదల చేశారు.

జానర్స్: యాక్షన్, అడ్వెంచర్ **ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్4; **మోడ్స్:** సింగిల్-ప్లేయర్; **ప్లాట్‌ఫామ్:** ప్లేస్టేషన్ 5

● మ్యూజిక్ వరల్డ్

నవ యువ స్వర సందడి

కొరియన్-పాప్ సెన్సేషన్ 'ఇలిట్' మ్యూజిక్ ఇండస్ట్రీలో దూసుకుపోతోంది. డెబ్యూ-సింగిల్ 'మాగ్నెటిక్' బిల్‌బోర్డ్ చార్ట్ 'హాట్ 100'లో చోటు సాధించడం ద్వారా 'ఇలిట్' గ్లోబల్ స్టేజీపై గ్రౌండ్ బ్రేకింగ్ విజయాన్ని సొంతం చేసుకుంది. యునహ్, మింజుచ, మోకా, వోన్‌హీ, ఇరోహ అనే అయిదుగురు అమ్మాయిల బృందంతో 'ఇలిట్' మ్యూజిక్ బ్యాండ్ గత నెల ప్రారంభమైంది. తొలి అడుగుల్లోనే స్పాటిఫై 'డైలీ టాప్ సాంగ్ గ్లోబల్' చార్ట్‌లో చోటు సంపాదించింది. యూకే 'అఫిషియల్ సింగిల్స్ టాప్ 100'లో మెరిసింది.


'మాగ్నెటిక్' సాంగ్‌ను 'ఇలిట్' సభ్యుల ఇంటర్వ్యూల ఆధారంగా రూపొందించారు.

ఈ గ్రూప్ డెబ్యూ ఆల్బమ్... సూపర్ రియల్ మీ. 'మై వరల్డ్', 'మాగ్నటిక్', 'మిడ్‌నైట్ ఫిక్షన్', 'లక్కీ గర్ల్ సింగ్రోమ్' అనే నాలుగు ట్రాక్‌లు ఈ ఆల్బమ్‌లో ఉంటాయి. తొలి వారంలోనే 'సూపర్ రియల్ మీ' అమ్మకాలలో రికార్డ్ సృష్టించింది. 'యూ, యూ, యూ, లైక్ ఇట్స్ మాగ్నటిక్/ యూ, యూ, యూ, సూపర్' అంటూ 'మాగ్నటిక్'ను పాడాలనుకుంటే ఇప్పుడే వినండి మరి!


కె-పాప్ సభ్యులు

సినిమా

చివరి సినిమా ఆగిపోయింది!


● క్వెంటిన్ టరంటినో

డైరెక్టర్ క్వెంటిన్ టరంటినో సినిమా అనగానే స్టయిలిష్ వయొలెన్స్, లెంగ్తీ డైలాగ్స్ కామన్ అని హాలీవుడ్ ప్రేక్షకులు అంటుంటారు. దర్శకుడిగా చాలా పాపులార్టీ సంపాదించుకున్న ఆయన తన రెండో చిత్రం 'పల్ప్ ఫిక్షన్' (1994)కే బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లేకి ఆస్కార్ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత క్వెంటిన్ దర్శకత్వం వహించిన వాటిలో 'ఇన్ గ్లోరియస్ బాస్టర్డ్స్, జాంగో అన్‌చైన్డ్, ది హేట్‌ఫుల్ ఎయిట్, వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ హాలీవుడ్' చిత్రాలకు వివిధ విభాగాల్లో ఆస్కార్ అవార్డులు దక్కాయి. నటుడిగానూ పలు చిత్రాల్లో నటించారు. ఇప్పటివరకూ తొమ్మిది చిత్రాలకు దర్శకత్వం వహించిన క్వెంటిన్ తన పదో చిత్రంగా 'ది మూవీ క్రిటిక్'ని ప్రకటించారు. ఇదే తనకు చివరి చిత్రం అన్నట్లుగా కూడా పేర్కొన్నారు. 1977లో దక్షిణ కాలిఫోర్నియాకి చెందిన ఓ పత్రికకు సినిమా రివ్యూలు అందించిన ఓ క్రిటిక్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించాలనుకున్నారు. తాను యుక్త వయసులో ఉన్నప్పుడు ఆ జర్నలిస్ట్ రాసిన రివ్యూలు చదివి చాలా ఘాటుగా ఉన్నట్లు భావించానని, అదే విధంగా కామెడీగా కూడా అనిపించిందని ఓ సందర్భంలో క్వెంటిన్ పేర్కొన్నారు కూడా. అందుకే అతని జీవితంతో సినిమా తీయాలనుకుని, 2023 జూన్‌లో ప్రీ ప్రొడక్షన్ పనులు ఆరంభించారు. తన గత చిత్రం 'వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ హాలీవుడ్'లో నటించిన బ్రాడ్ పిట్‌ని 'ది మూవీ క్రిటిక్'లో హీరోగా ఎంపిక చేసుకున్నారని కూడా వార్త ప్రచారమైంది. అయితే హఠాత్తుగా ఏమైందో ఏమో కానీ 'ది మూవీ క్రిటిక్'ని తెరకెక్కించాలనే ఆలోచనను క్వెంటిన్ విరమించుకున్నారట. ఇప్పుడు హాలీవుడ్‌లో ఇది హాట్ టాపిక్ అయింది. మరి... 61 ఏళ్ల క్వెంటిన్ చివరి చిత్రం 'ది మూవీ క్రిటిక్' కాకపోతే వేరే ఏ చిత్రం అవుతుందనే చర్చ జరుగుతోంది.


● రాశీ ఖన్నా

రాబిన్ హుడ్‌తో జోడీ?

హీరో నితిన్-హీరోయిన్ రాశీ ఖన్నా మరోసారి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. నితిన్-రాశీ ఖన్నా 'శ్రీనివాస కళ్యాణం' (2018) మూవీలో జోడీగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరూ 'రాబిన్ హుడ్' సినిమాలో నటించనున్నారని టాక్. 'భీష్మ' (2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్-డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న ద్వితీయ చిత్రం 'రాబిన్ హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. అయితే ఈ మూవీలో కథానాయిక ఎవరు? అనే విషయంపై స్పష్టత లేదు. తొలుత రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తారనే వార్తలొచ్చాయి. ఆ తర్వాత శ్రీలీల పేరు తెరపైకి వచ్చింది. తాజాగా రాశీ ఖన్నాని తీసుకున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరి నితిన్‌కి జోడీగా రాశీ ఖన్నా ఫిక్స్ అయ్యారా? లేకుంటే మరో హీరోయిన్ తెరపైకి వస్తారా? అనే విషయంపై చిత్ర యూనిట్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

ఇన్నేళ్ల కెరీర్‌లో ఎక్కడా రాజీపడలేదు

- శేఖర్ కమ్ముల



"కోవిడ్ తర్వాత ప్రేక్షకుల అభిరుచి, సినిమాల పరిధి పెరిగింది. ఇప్పుడంతా పాన్ ఇండియా అంటున్నారు. మాది పాన్ ఇండియా మూవీ అని ప్రకటించుకుంటే సరిపోదు. ప్రేక్షకుల మైండ్ సెట్ గమనించాలి. కథ పరంగా మన నేటివిటీకి తగినట్లు సరైన సినిమా తీస్తే తప్పకుండా పాన్ ఇండియా స్థాయికి చేరుతుంది" అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'హ్యాపీ డేస్' మూవీ 2007లో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఆ సినిమాను నేడు రీ రిలీజ్ చేస్తున్నారు. అలాగే శేఖర్ కమ్ముల చిత్ర పరిశ్రమలోకి వచ్చి 25 ఏళ్లవుతోంది. ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని శేఖర్ కమ్ముల పంచుకున్న విశేషాలు.

● చిత్ర పరిశ్రమలో 25 సంవత్సరాల ప్రయాణంలో నేను నిలబడడం చూస్తే చాలా గర్వంగా ఉంది. నా తొలి చిత్రం 'డాలర్ డ్రీమ్స్' (2000) నుంచి 'లవ్ స్టోరీ' (2021) సినిమా వరకూ ఇన్నేళ్ల కెరీర్‌లో ఎక్కడా రాజీ పడకుండా నా విలువలకు తగినట్లు సినిమా తీయడం గొప్పగా అనిపిస్తోంది. నేను ఏ సినిమా చేసినా విలువలు, సిద్ధాంతాలతో తీయాలని, చెడు చెప్పకూడదు అనే ఆలోచనతోనే తీశాను. పేరు, డబ్బు కోసం చిత్ర పరిశ్రమకి రాలేదు. అలాంటి ఆలోచనతో సినిమాలూ తీయలేదు.. అదే నాకు గర్వంగా ఉంది. ఇప్పుడు సినిమా రంగంలో పోకడ చాలా హార్ష్‌గా ఉంది.

● 'హ్యాపీ డేస్' సినిమా చేస్తున్నప్పుడు నా గ్రాడ్యుయేషన్ పూర్తయి పదేళ్లయింది. అప్పటి పరిస్థితుల రీత్యా ఆ మూవీకి స్టూడెంట్ బ్యాక్‌గ్రౌండ్ చక్కగా కుదిరింది. అయితే నేడు టెక్నాలజీ మారింది. ప్రతి స్టూడెంట్ చేతిలో మొబైల్ ఫోన్స్ ఉంటున్నాయి. కోవిడ్, గ్లోబలైజేషన్ వంటి పరిస్థితుల తర్వాత ఆలోచనా విధానం మారింది. సాంకేతిక పరంగా ఇప్పుడు విద్యార్థులు ఎవరి లోకంలో వారు ఉన్నారు. 'హ్యాపీ డేస్' సినిమా విడుదలై ఇన్నేళ్లయినా చాలా ఫ్రెష్‌గా ఉంది. రీ రిలీజ్ కూడా యూత్‌కు ఓ పండగలా ఉంటుందని అనిపించింది. 'హ్యాపీ డేస్'కి సీక్వెల్ తీయాలనిపించింది.. కానీ, కథ కుదరలేదు.

● ఇన్నేళ్ల నా ప్రయాణంలో పది చిత్రాలు చేశాను. అయితే నా ప్రయాణం నిదానంగా సాగుతోందను కోవడం లేదు. నేను ఏ సినిమా చేసినా ఈ కథ అవసరమా? అని ఆలోచించి చేస్తాను. నేను సినిమా చేసే పద్ధతి, నా సినిమాలే మాట్లాడతాయి. కాపీ కొట్టే కథలు నేను చేయను. కంటెంట్ పరంగా బాగా, సూటిగా చెప్పాలనుకుంటాను. మనసులో ఓ ఆలోచన రావడానికి, అది కార్యరూపం దాల్చడానికి సమయం పడుతుంది. అలా కాకుండా వెంట వెంటనే సినిమాలు చేయాలనుకోను.

● నా తొలి చిత్రం 'డాలర్ డ్రీమ్స్'కి జాతీయ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆ తర్వాత నంది అవార్డులతో పాటు మరికొన్ని అవార్డులు కూడా అందుకున్నాను. అయితే మళ్లీ జాతీయ అవార్డు అందుకోవాలనే ఆలోచన లేదు. నేను రాజీపడకుండా సినిమా తీస్తున్నాను.. అందుకే సంతోషంగా ఉన్నాను. నా చిత్రాలకు ప్రేక్షకులు ఇచ్చే అవార్డే గొప్పది. ఒక్కో ఏడాది జాతీయ స్థాయిలో మనకంటే మంచి సినిమాలు వస్తుంటాయి.. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని అవార్డుకి ఎంపిక చేస్తారు. అయితే మంచి కంటెంట్ తీసుకుని ముందుకెళ్లడమే మన పని.

● నా కెరీర్‌లో తొలిసారి నాగార్జున, ధనష్ వంటి స్టార్ హీరోలతో 'కుబేర' అనే మల్టీస్టారర్ సినిమా చేస్తున్నాను. ఈ కథకు వారిద్దరూ సరిపోతారనిపించి చేస్తున్నాను.. అంతేకానీ, పెద్ద ప్రాజెక్ట్, బిగ్ స్కేల్‌లో సినిమా చేయాలనే ఆలోచనతో కాదు. వారిద్దరితో పని చేయడం గొప్ప అనుభూతి. నిర్మాత, దర్శకుడికి మధ్య స్వేచ్ఛ, నమ్మకం అనేది ఉండాలి. అది ఏషియన్ మూవీస్ బేనర్‌లో నాకెక్కువగా ఉంది. 'లీడర్' సినిమాకి సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉంది. కానీ సమయం కుదరడం లేదు. చేస్తే మాత్రం తప్పకుండా రానాతోనే చేస్తాను.

వినోదాలు పంచే కృష్ణ


● దిగంగనా సూర్యవన్షీ, ఆది సాయికుమార్, 'దిల్' రాజు

ఆది సాయి కుమార్ హీరోగా 'కృష్ణ ఫ్రమ్ బృందావనం' అనే సినిమా ఆరంభం అయింది. 'చుట్టాలబ్బాయ్' సినిమా తర్వాత ఆది-డైరెక్టర్ వీరభద్రమ్ చౌదరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న రెండో చిత్రమిది. దిగంగనా సూర్యవన్షీ కథానాయిక. తూము నరసింహా, జామి శ్రీనివాసరావు నిర్మిస్తున్న 'కృష్ణ ఫ్రమ్ బృందావనం' మూవీ గురువారం ఆరంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ కొట్టారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ''కృష్ణ ఫ్రమ్ బృందావనం' కుటుంబమంతా కలిసి చూసి నవ్వుకునేలా ఉంటుంది. జూన్‌లో రెగ్యులర్ షూట్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఆద్యంతం వినోదభరితంగా ఉండే చిత్రమిది. విలేజ్ డ్రామా, ఫ్యామిలీ, లవ్, ఎమోషన్.. ఇలా అన్ని అంశాలు ఉంటాయి'' అన్నారు వీరభద్రమ్. ''ఆదిగారితో 'క్రేజీ ఫెలో' సినిమా చేశాను. మళ్లీ 'కృష్ణ ఫ్రమ్ బృందావనం'లో నటిస్తుండటం హ్యాపీ'' అన్నారు దిగంగనా సూర్యవన్షీ. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్, సంగీతం: అనూప్ రూబెన్స్.

మిరాయ్... ఓ శాసనం


● సురేష్‌బాబు, కార్తీక్, తేజ, టీజీ విశ్వప్రసాద్

'**హ**ను-మాన్' మూవీ ఫేమ్ తేజ సజ్జ హీరోగా 'ఈగల్' ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఓ సినిమా ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి 'మిరాయ్' అనే టైటిల్‌ని ఫిక్స్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌ని నిర్మాత డి. సురేష్ బాబు రిలీజ్ చేశారు. ఈ మూవీని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ, బెంగాలీ, మరాఠీ, చైనీస్ భాషల్లో 2025 ఏప్రిల్ 18న 2డీ, 3డీలలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ– ''అశోక చక్రవర్తి కాలంలో రహస్యమైన ఓ శాసనం పేరే 'మిరాయ్'. దాన్ని కొందరు కాపాడుతుంటారు. సినిమా రిలీజ్ తర్వాత దాని గురించి బాగా అర్థమవుతుంది'' అన్నారు. ''మిరాయ్'ని పాన్ వరల్డ్ సినిమాగా చేయనున్నాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ''హను-మాన్' తర్వాత ప్రతిదీ జాగ్రత్తగా చేయాలని తీసుకున్న నిర్ణయమే 'మిరాయ్'. ఈ చిత్రంలో నన్ను సూపర్ యోధునిగా చూపించనున్నారు కార్తీక్'' అన్నారు తేజ. ఈ చిత్రానికి సంగీతం: గౌరవ హరి, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.

మాస్ డ్యాన్స్ చేసేద్దాం...


● కరీనా కపూర్

అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్‌లతో కలిసి మాస్ డ్యాన్స్ చేసేద్దాం అంటూ కరీనా కపూర్ సందడి చేస్తున్నారట. అజయ్ దేవగన్, కరీనా కపూర్ జంటగా అక్షయ్ కుమార్, రణ్‌వీర్, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకోన్ కీలక పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'సింగమ్ ఎగైన్'. 'సింగమ్' ఫ్రాంచైజీ చిత్రాలకు దర్శకత్వం వహించిన రోహిత్ శెట్టి 'సింగమ్ ఎగైన్'కి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలోని ముఖ్య తారాగణం పాల్గొనగా భారీ ఓ మాస్ సాంగ్‌ని చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ నృత్యదర్శకుడు గణేశ్ ఆచార్య ఆధ్వర్యంలో ఈ పాట చిత్రీకరణ జరుగుతోందని టాక్. కీలక తారాగణంతో పాటు దాదాపు నాలుగు వందల మంది డ్యాన్సర్లు పాల్గొంటున్నారని భోగట్టా. కాగా ప్రస్తుతం దీపికా పదుకోన్ గర్భవతి కావడంతో ఆమె ఈ పాటలో కనిపించే చాన్స్ లేదని బాలీవుడ్ అంటోంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
455	152
72,489	21,996

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,635	▽	49
డోజోన్స్	37,726	▽	27
ఎఫ్‌టీఎస్ఈ 100	7,877	△	29
డాక్స్	17,837	△	67
షాంఘై	3,074	△	3
నికాయ్	38,080	△	67

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,477
బంగారం (99.5 స్వచ్ఛత)	73,183
వెండి (కేజీ)	83,327

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.04	84.06
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.56	106.76
€	యూరో	ఎస్‌బీఐ	87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.20	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.26	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.38



ఇన్ఫోసిస్ ఓకే

- క్యూ4 నికర లాభం 30 శాతం అప్
- మొత్తం ఆదాయం రూ. 37,923 కోట్లు
- 2024-25 ఆదాయ అంచనాలు అంతంతే
- జర్మన్ సంస్థ ఇన్‌టెక్ కొనుగోలుకు రెడీ

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా 30 శాతం జంప్ చేసింది. రూ. 7,969 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 6,128 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర(1 శాతం) వృద్ధితో రూ. 37,923 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 37,441 కోట్ల టర్నోవర్ నమోదైంది. తయారీ రంగ సేవలు నెమ్మదించగా.. 20.1 శాతం నిర్వహణ మార్జిన్లను అందుకుంది. క్యూ4లో 84.8 కోట్ల డాలర్ల ఫ్రీక్యాష్ ఫ్లో సాధించింది. గత 11 త్రైమాసికాలలోనే ఇది అత్యధికం.

1-3 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఇన్ఫోసిస్ ఆదాయంలో 1-3 శాతం వృద్ధిని అంచనా(గైడెన్స్) వేసింది. 20-22 శాతం నిర్వహణ లాభ మార్జిన్లను ఆశిస్తోంది. అయితే గతేడాది ప్రకటించిన 4-7 శాతం వృద్ధితో పోలిస్తే తాజాగా బలహీన గైడెన్స్‌ను వెలువరించింది. గతేడాది సాధించిన ఫలితాలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి అంచనాలు(గైడెన్స్) అధికమేనని సీఈవో పరేఖ్ పేర్కొన్నారు. విభాగాలవారీగా చూస్తే గతేడాదికంటే రానున్న 12 నెలల్లో ఫైనాన్షియల్ సర్వీసుల్లో ఉత్తమ పనితీరు చూపేందుకు అవకాశమున్నట్లు తెలియజేశారు. విచక్షణా వ్యయాల తీరు, కన్సాలిడేషన్, వ్యయ నియంత్రణపై దృష్టి ద్వారా గైడెన్స్‌ను ప్రకటించినట్లు వెల్లడించారు. కాగా.. మార్చితో ముగిసిన గతేడాదికి 20.7 శాతం నిర్వహణ మార్జిన్లు సాధించింది. ఈ కాలంలో నికర లాభం 9% ఎగసి రూ. 26,233 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 4.7% బలపడి రూ. 1,53,670 కోట్లయ్యింది. 2022-23లో రూ. 24,095 కోట్ల నికర లాభం, రూ. 1,46,767 కోట్ల టర్నోవర్ నమోదైంది. వ్యూహాత్మక, నిర్వహణ సంబంధ నగదు అవసరాలను పరిగణించాక రానున్న ఐదేళ్ల కాలానికి పెట్టుబడుల కేటాయింపుల విధానాన్ని బోర్డు సమీక్షించడంతోపాటు, అనుమతించినట్లు సీఎఫ్‌వో జయేష్.ఎస్ పేర్కొన్నారు. ఈ కాలంలో వాటాదారులకు వార్షికంగా డివిడెండ్‌ను పెంచడం ద్వారా 85 శాతం కేటాయింపుల(రిటర్నులు)కు వీలున్నట్లు అంచనా వేశారు.



సీఈవో పరేఖ్‌తో సీఎఫ్‌వో జయేష్(కుడి)

డీల్స్‌లో రికార్డ్

గతేడాది భారీ డీల్స్‌లో కొత్త రికార్డు సాధించాం. ఇది కంపెనీపట్ల క్లయింట్లకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. జనరేటివ్ ఏఐలో సిబ్బంది సామర్థ్యాల విస్తరణ కొనసాగుతుంది. క్లయింట్ల ప్రోగ్రామ్‌లు, విభిన్న లాంగ్వేజీలపై పనిచేయడం, కస్టమర్ సపోర్ట్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ప్రాసెస్ వినిమయం తదితరాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– సలీల్ పరేఖ్, ఎండీ, సీఈవో, ఇన్ఫోసిస్ లిమిటెడ్

ఇతర విశేషాలు..

- పూర్తి ఏడాది(2023-24)కి కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 17.7 బిలియన్ డాలర్ల విలువైన భారీ కాంట్రాక్టులు(టీసీవీ) కుదుర్చుకుంది. వీటిలో 52 శాతం కొత్త ఆర్డర్లు.
- షేరుకి రూ. 28 తుది డివిడెండ్ ప్రకటించింది. దీనిలో రూ. 8 ప్రత్యేక డివిడెండ్ కలసి ఉంది.
- పూర్తి ఏడాదిలో 25,994 మంది ఉద్యోగులు తగ్గారు. దీంతో 2001 తదుపరి మొత్తం ఉద్యోగుల సంఖ్య(7.5%) క్షీణించింది. 3,17,240కు పరిమితమైంది. 2022-23లో సిబ్బంది సంఖ్య 3,43,234గా నమోదైంది.
- ఉద్యోగ వలసల (అట్రిషన్) రేటు 12.6%గా నమోదైంది.

రూ. 4,000 కోట్లతో..

జర్మనీ సంస్థ ఇన్‌టెక్‌లో 100 శాతం వాటాను పూర్తి నగదు చెల్లింపు ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇందుకు 45 కోట్ల యూరోలు(రూ. 4,000 కోట్లు) వెచ్చించనుంది. ఈమొబిలిటీ, కనెక్టెడ్, అటానమస్ డ్రైవింగ్, ఈవీలు, ఆఫ్‌రోడ్ వాహనాల విభాగంలో కంపెనీ సొల్యూషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. ఈ కొనుగోలుతో జర్మన్ ఓఈఎం క్లయింట్లను పొందడంతోపాటు 2,200 మంది సుశిక్షిత సిబ్బందిని సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. ఈ ఏడాది తొలి అర్థభాగానికల్లా డీల్ పూర్తికాగలదని అంచనా వేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

19-4-2024 ఫామ్ ధర...

విశాఖ	430-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

బజాజ్ ఆటో లాభం హైజంప్

- క్యూ4లో రూ. 1,936 కోట్లు
- షేరుకి రూ. 80 డివిడెండ్

న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 35 శాతం జంప్‌చేసింది. రూ. 1,936 కోట్లను తాకింది. 2022-23 ఇదే కాలంలో రూ. 1,433 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 29% వృద్ధితో రూ. 11,485 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 33 శాతం ఎగసి రూ. 7,479 కోట్లయ్యింది. 2022-23లో కేవలం రూ. 5,628 కోట్లు ఆర్జించింది. మొత్తం టర్నోవర్ రూ. 36,248 కోట్ల నుంచి రూ. 44,685 కోట్లకు వృద్ధి చెందింది. వాటాదారులకు షేరుకి రూ. 80 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

వాహన విక్రయాలు జూమ్

క్యూ4లో బజాజ్ ఆటో మొత్తం వాహన విక్రయాలు 24 శాతం పెరిగి 10,68,576 యూనిట్లకు చేరాయి. వీటిలో ద్విచక్ర వాహనాలు 26 శాతం పుంజుకుని 9,16,817ను తాకగా.. 13 శాతం అధికంగా 1,51,759 వాణిజ్య వాహనాలు విక్రయించింది.

బజాజ్ ఆటో షేరు బీఎస్ఈలో 1.1 శాతం లాభంతో రూ. 9,018 వద్ద ముగిసింది.

ఐటీసీ ఇన్ఫోటెక్ చేతికి బ్లేజ్‌క్లాన్



న్యూఢిల్లీ: విభిన్న రంగాల్లో ఉన్న ఐటీసీ లిమిటెడ్‌కు చెందిన ఐటీసీ ఇన్ఫోటెక్ ఇండియా క్లౌడ్ సేవల్లో ఉన్న బ్లేజ్‌క్లాన్ టెక్నాలజీస్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువ రూ.485 కోట్లు. గురువారం ఈ మేరకు ఇరు సంస్థలు వాటా కొనుగోలు ఒప్పందం చేసుకున్నాయి. 6-8 వారాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అవుతుందని ఐటీసీ లిమిటెడ్ వెల్లడించింది. మల్టీ క్లౌడ్, హైబ్రిడ్ క్లౌడ్ విభాగాల్లో తమ క్లయింట్లకు సేవలకై సంస్థ సామర్థ్యం పెంపొందించేందుకు ఈ డీల్ దోహదం చేస్తుందని తెలిపింది.

గోగ్యాస్ ఎల్‌పీజీ ఏజెన్సీ అవకాశం

హైదరాబాద్: కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా గోగ్యాస్ బ్రాండ్‌తో ఎల్‌పీజీ ఏజెన్సీ ప్రారంభించే అవకాశం కల్పిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలో డిస్ట్రిబ్యూటర్ల నెట్‌వర్క్ ద్వారా వంట గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాపార అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోగ్యాస్ ఒక ప్రకటన ద్వారా తెలిపింది.

లాభాల్లోంచి నష్టాల్లోకి

- మిడ్ సెషన్‌లో ఒక్కసారిగా అమ్మకాలు
- సూచీలు నాలుగో రోజూ నేలచూపులు
- సెన్సెక్స్ 455 పాయింట్లు పతనం
- 22,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్ షేర్ల భారీ పతనం, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలతో స్టాక్ సూచీలు నాలుగోరోజూ నష్టాలు చవిచూశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీతో ఉదయం లాభాలతోనే మొదలయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో ఒక్కసారిగా అమ్మకాలు వెల్లువెత్తడంతో లాభాల్లోంచి నష్టాల్లోకి మళ్లాయి. ఇంట్రాడేలో 1,107 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 455 పాయింట్లు నష్టపోయి 72,489 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 72,366 వద్ద కనిష్టాన్ని 73,473 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 365 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 152 పాయింట్లు కోల్పోయి 21,996 వద్ద నిలిచింది. రోజంతా 21,962 – 22,327 పాయింట్ల మధ్య ట్రేడైంది. మీడియా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.39%, 0.06 శాతం చొప్పున నష్టపోయాయి. ఎఫ్‌పీఐలు రూ.4,260 ఈక్విటీలను విక్రయించగా, డీఐఐలు రూ.2,286 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.50%- ఒకశాతం వరకు లాభపడ్డాయి.

- సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 2,549 పాయింట్ల(3.39%) పతనంతో బీఎస్ఈలో రూ.9.30 లక్షల కోట్లు మాయమయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.392 లక్షల కోట్లకు దిగివచ్చింది.

'ఎండీ' డీప్‌ఫేక్ సిఫార్సులతో జాగ్రత్త

ఇన్వెస్టర్లకు బీఎస్ఈ సూచన

ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి పేరిట వస్తున్న డీప్‌ఫేక్ వీడియోలపై బీఎస్ఈ ఇన్వెస్టర్లను హెచ్చరించింది. ఆయన స్టాక్స్ సిఫార్సులను ఇస్తున్నట్లుగా ఉన్న ఆ వీడియోల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించింది. పెట్టుబడులు, స్టాక్స్ సిఫార్సులపై రామమూర్తి పేరుతో మోసపూరిత, అనధికారిక, ఫేక్ వీడియోలు, ఆడియోలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న విషయం తాము గుర్తించినట్లు బీఎస్ఈ వివరించింది.

ఈ నెల 24 నుంచి నిఫ్టీ నెక్స్ 50 డెరివేటివ్స్

ఎన్ఎస్ఈ ఏప్రిల్ 24 నుంచి నిఫ్టీ నెక్స్ 50 ఇండెక్స్‌కి సంబంధించిన డెరివేటివ్ కాంట్రాక్టులను ప్రారంభించనుంది. ఇందుకు సెబీ నుంచి అనుమతులు వచ్చినట్లు తెలిపింది. 10 లాట్ సైజుతో 3 నెలల ఇండెక్స్ ఫ్యూచర్స్, ఇండెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టనున్నట్లు, వీటి కాలవ్యవధి ఎక్స్‌పైరీ నెలలో చివరి శుక్రవారంతో ముగుస్తుందని పేర్కొంది. 2024 మార్చి నాటికి ఈ ఇండెక్స్‌లో ఆర్థిక సర్వీసుల రంగం స్టాక్స్ వాటా 23.76 శాతంగా, క్యాపిటల్ గూడ్స్ రంగం వాటా 11.91 శాతం, కన్జూమర్ సర్వీసెస్ వాటా 11.57 శాతంగా ఉంది. 1997 జనవరి 1న ఈ ఇండెక్స్‌ను ప్రవేశపెట్టారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ జోడీ

జీఎన్‌పీ సెగురోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ శుభారంభం చేశాడు. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో అనిరుధ్(భారత్)-హాన్స్ హచ్ వెర్డ్గో (మెక్సికో) ద్వయం 4-6, 6-4, 11-9తో చార్లెస్ బ్రూమ్ (బ్రిటన్)-ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో అనిరుధ్ జోడీ పైచేయి సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో నాలుగో సీడ్ జీవన్ నెడున్‌జెళియన్-అర్జున్ ఖడే (భారత్) ద్వయం 3-6, 6-3, 7-10తో ఆంటోని బెలిర్ (స్విట్జర్లాండ్)-లుకా సాంచెజ్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది.

హంపి, వైశాలి విజయం



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో పోటీపడుతున్న భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి 11వ రౌండ్‌లో విజయం సాధించారు. సలీమోవా నుర్గుయెల్ (బల్గేరియా)తో జరిగిన గేమ్‌లో హంపి 90 ఎత్తుల్లో... అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 70 ఎత్తుల్లో గెలిచారు. ఈ టోర్నీలోకి హంపికిది రెండో విజయంకాగా, వైశాలి ఖాతాలో మూడో గెలుపు చేరింది. 11వ రౌండ్ తర్వాత హంపి 5.5 పాయింట్లతో నాలుగో స్థానంలో, వైశాలి 4.5 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు. మరో వైపు ఓపెన్ విభాగంలో 11వ రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, విదిత్‌లకు ఓటమి ఎదురు కాగా, దొమ్మరాజు గుకేశ్ 'డ్రా' నమోదు చేశాడు. ప్రజ్ఞానంద 54 ఎత్తుల్లో హికారు నకముర (అమెరికా) చేతిలో, విదిత్ 67 ఎత్తుల్లో నిపోమ్‌నిషి (రష్యా) చేతిలో పరాజయం పాలయ్యారు. గుకేశ్, కరువానా (అమెరికా) గేమ్ 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. 11వ రౌండ్ తర్వాత గుకేశ్ 6.5 పాయింట్లతో రెండో స్థానంలో, ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో 5వ స్థానంలో, విదిత్ 5 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు శ్రీశంకర్ దూరం



న్యూఢిల్లీ: భారత స్టార్ లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ మోకాలి గాయంతో పారిస్ ఒలింపిక్స్ నుంచి వైదొలిగాడు. ప్రాక్టీస్ సమయంలో శ్రీశంకర్ మోకాలికి గాయమైంది. ఈ గాయానికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించడంతో ఈ ఏడాది మొత్తం శ్రీశంకర్ బరిలోకి దిగే అవకాశాలు కనిపించడం లేదు. కేరళకు చెందిన 25 ఏళ్ల శ్రీశంకర్ గత ఏడాది ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 8.37 మీటర్ల దూరం దూకి రజత పతకం సాధించాడు. ఈ క్రమంలో పారిస్ ఒలింపిక్ బెర్త్‌ను కూడా సంపాదించాడు. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం, 2023 ఆసియా క్రీడల్లో రజతం నెగ్గిన శ్రీశంకర్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడినా ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు.

వినేశ్‌పైనే దృష్టి

ఒలింపిక్ క్వాలిఫయింగ్ రెజ్లింగ్ టోర్నీ



బిష్కెక్ (కిర్గిస్తాన్): భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు సమాయత్తమైంది. నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో వినేశ్ బరిలోకి దిగనుంది. వినేశ్ రెగ్యులర్ వెయిట్ కేటగిరీ 53 కేజీలు అయినప్పటికీ ఈ విభాగంలో ఇప్పటికే భారత్ నుంచి అంతిమ్ పంఘాల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. దాంతో వినేశ్ 50 కేజీల విభాగంలో పోటీపడాలని నిర్ణయం తీసుకుంది. గత ఏడాది భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపులకు సంబంధించిన వివాదంలో సాక్షి మలిక్, బజరంగ్ పూనియాలతో కలిసి వినేశ్ పోరాడింది.

గట్టెక్కిన ముంబై

- 9 పరుగులతో పంజాబ్‌పై గెలుపు
- చెలరేగిన సూర్య, బుమ్రా, కొయెట్జీ
- అశుతోష్ మెరుపులు వృథా



ముల్లాన్‌పూర్: ముంబై ఇండియన్స్ నిర్దేశించిన పెద్ద లక్ష్యం ముందు పంజాబ్ కింగ్స్ 14/4 స్కోరుతో ఆరంభంలోనే మోకరిల్లింది. శశాంక్ సింగ్, అశుతోష్ శర్మల మెరుపులు కింగ్స్‌ను గెలుపు ట్రాక్‌లో పడేశాయి. కానీ వికెట్లు అందుబాటులో లేక 6 బంతుల్లో సులువైన 12 పరుగుల్ని చేయలేక చివరకు పంజాబ్ ఆలౌటైంది. దీంతో గురువారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై 9 పరుగులతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. తొలుత ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. సూర్యకుమార్ (53 బంతుల్లో 78; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (18 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. హర్షల్ పటేల్ 3, స్యామ్ కరన్ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ 19.1 ఓవర్లలో 183 పరుగులకు ఆలౌటైంది. అశుతోష్ శర్మ (28 బంతుల్లో 61; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), శశాంక్ (25 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆశలు రేపారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా, కొయెట్జీ చెరో 3 వికెట్లు తీశారు.

సూర్య ప్రతాపం...

ఆరంభంలోనే ఇషాన్ (8) అవుట్ కాగా... కెరీర్‌లో 250వ ఐపీఎల్ మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ (25 బంతుల్లో 36; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ పవర్ ప్లేలో జట్టు స్కోరును 54/1కు తీసుకెళ్లారు. తర్వాత సూర్య దూకుడు కొనసాగడంతో పరుగుల వేగం పెరిగింది. సగం ఓవర్లు ముగిసేసరికి ముంబై 86/1 స్కోరు చేసింది. ఆ మరుసటి ఓవర్లోనే సూర్యకుమార్ 34 బంతుల్లో అర్ధశతకాన్ని పూర్తిచేసుకున్నాడు. అయితే 12వ ఓవర్ వేసిన స్యామ్ కరన్... రోహిత్ ఆట ముగించడంతో రెండో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్లో ముంబై వంద పరుగులను చేరుకుంది. 14 ఓవర్లలో 115/2 స్కోరు చేసిన ముంబై... సూర్య, తిలక్ ధాటిగా ఆడటంతో మిగిలిన 6 ఓవర్లలో 77 పరుగుల్ని సాధించింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (10) తక్కువే చేసినా... తిలక్ మెరుపులు ముంబై జోరుకు దోహదం చేశాయి. హర్షల్ వేసిన ఆఖరి ఓవర్లో డేవిడ్ (14), షెఫర్డ్ (1), నబీ (0) అవుట్ కావడంతో కేవలం 7 పరుగులే వచ్చాయి.

14/4 అయినా... వణికించిన అశుతోష్!



పంజాబ్ ఇన్నింగ్స్ ఇలా మొదలైందో లేదో... అలా కుదేలైంది. 2.1 ఓవర్లలోనే 14/4 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడింది. అటు కొయెట్జీ, ఇటు బుమ్రా ధాటికి ఓపెనర్లు స్యామ్ కరన్ (6), ప్రభ్‌సిమ్రన్ (0), రోసో (1), లివింగ్‌స్టోన్ (1) పెవిలియన్‌కు దారి కట్టారు. ఈ దశలో శశాంక్, అశుతోష్ సిక్సర్లతో అలరించారు. కానీ 12.1 ఓవర్లలో 111/7 వద్ద శశాంక్ నిష్క్రమించడంతో పంజాబ్‌కు ఓటమి ఖాయమైంది. ఈ దశలో అశుతోష్, హర్‌ప్రీత్ బ్రార్ (20 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎనిమిదో వికెట్‌కు చకచకా 57 పరుగుల జోడించడంతో ఊహించని ఉత్కంఠ వచ్చేసింది. కానీ 168 పరుగుల వద్ద అశుతోష్ ఎనిమిదో వికెట్‌గా నిష్క్రమించడంతో పంజాబ్ గెలుపు ఆశలు ఆవిరయ్యాయి.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) హర్‌ప్రీత్ (బి) రబడ 8; రోహిత్ (సి) హర్‌ప్రీత్ (బి) స్యామ్ కరన్ 36; సూర్యకుమార్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) సామ్ కరన్ 78; తిలక్ వర్మ (నాటౌట్) 34; హార్దిక్ పాండ్యా (సి) హర్‌ప్రీత్ (బి) హర్షల్ 10; డేవిడ్ (సి) స్యామ్ కరన్ (బి) హర్షల్ 14; షెఫర్డ్ (సి) శశాంక్ (బి) హర్షల్ 1; నబీ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 192. వికెట్ల పతనం: 1-18, 2-99, 3-148, 4-167, 5-190, 6-192, 7-192. బౌలింగ్: లివింగ్‌స్టోన్ 2-0-16-0, అర్‌్షదీప్ 3-0-35-0, రబడ 4-0-42-1, హర్షల్ 4-0-31-3, స్యామ్ కరన్ 4-0-41-2, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-21-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: స్యామ్ కరన్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 6; ప్రభ్‌సిమ్రన్ (సి) ఇషాన్ (బి) కొయెట్జీ 0; రోసో (బి) బుమ్రా 1; లివింగ్‌స్టోన్ (సి అండ్ బి) కొయెట్జీ 1; హర్‌ప్రీత్ సింగ్ (సి అండ్ బి) గోపాల్ 13; శశాంక్ (సి) తిలక్ వర్మ (బి) బుమ్రా 41; జితేశ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆకాశ్ 9; అశుతోష్ (సి) నబీ (బి) కొయెట్జీ 61; హర్‌ప్రీత్ బ్రార్ (సి) నబీ (బి) పాండ్యా 21; హర్షల్ (నాటౌట్) 1; రబడ (రనౌట్) 8; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్) 183. వికెట్ల పతనం: 1-10, 2-13, 3-14, 4-14, 5-49, 6-77, 7-111, 8-168, 9-174, 10-183. బౌలింగ్: కొయెట్జీ 4-0-32-3, బుమ్రా 4-0-21-3, ఆకాశ్ మధ్వాల్ 3.1-0-46-1, పాండ్యా 4-0-33-1, శ్రేయస్ గోపాల్ 2-0-26-1, షెఫర్డ్ 2-0-20-0.

ఐపీఎల్‌లో నేడు

లక్నో × చెన్నై
వేదిక: లక్నో

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	6	4	2	8	0.726
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	6	3	3	6	0.038
ఢిల్లీ	7	3	4	6	-0.074
ముంబై	7	3	4	6	-0.195
గుజరాత్	7	3	4	6	-1.303
పంజాబ్	7	2	5	4	-0.198
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఛేజింగ్‌లో శ్రీలంక రికార్డు



చమరి అటపట్టు 195 నాటౌట్

పొచెఫ్‌స్ట్రూమ్: మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా శ్రీలంక రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో జరిగిన చివరిదైన మూడో వన్డేలో శ్రీలంక 302 పరుగుల లక్ష్యాన్ని అధిగమించింది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 301 పరుగులు చేసింది. ఓపెనర్ లౌరా వొల్వార్ట్ (147 బంతుల్లో 184 నాటౌట్; 23 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ శతకం సాధించింది. అనంతరం శ్రీలంక 44.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 305 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్, కెప్టెన్ చమరి అటపట్టు (139 బంతుల్లో 195 నాటౌట్; 26 ఫోర్లు, 5 సిక్స్‌లు) అసాధారణ ఆటతీరుతో అజేయ సెంచరీ సాధించి శ్రీలంకకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. స్కోరు 299/4 వద్ద చమరి సిక్స్ కొట్టి లంకను గెలిపించింది. ఈ క్రమంలో 2012 నుంచి ఆస్ట్రేలియా (289/6 న్యూజిలాండ్ జట్టుపై) పేరిట ఉన్న అత్యధిక పరుగుల ఛేజింగ్ రికార్డును కూడా శ్రీలంక బద్దలు కొట్టింది. మహిళల వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన మూడో బ్యాటర్‌గా చమరి గుర్తింపు పొందింది. ఈ జాబితాలో న్యూజిలాండ్ ప్లేయర్ అమెలియా కెర్ (232 నాటౌట్; 2018లో ఐర్లాండ్‌పై), ఆస్ట్రేలియా ప్లేయర్ బెలిండా క్లార్క్ (229 నాటౌట్; 1997లో డెన్మార్క్‌పై) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

సెమీస్‌లో యూకీ జోడీ



మ్యూనిక్: బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-ఒలివెట్టి ద్వయం 6-3, 6-3తో రాబర్ట్ గాలోవే-ఇవాన్ కింగ్ (అమెరికా) జంటపై విజయం సాధించింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-ఒలివెట్టి జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

45 డిగ్రీలు దాటేసింది

హాజిపూర్‌లో 45.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత

- రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికం
- నేడు, రేపు పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం
- అత్యవసరమైతే తప్ప మిట్టమధ్యాహ్నం బయటకు రావొద్దంటున్న వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం నుంచే మంట పుట్టిస్తున్న సూర్యుడి భగభగలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చండ ప్రచండ వేడితో ప్రజలు తల్లడిల్లుతున్నారు. గురువారం మంచిర్యాల జిల్లా హాజిపూర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 45.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అదే విధంగా నల్లగొండ జిల్లా మాడుగులపల్లిలో కూడా గరిష్ట ఉష్ణోగ్రత 45.2 డిగ్రీల సెల్సియస్, ములుగు జిల్లా మేడారంలో 45.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావొద్దని సూచించింది. ఎండల తీవ్రతకు తోడు వడగాల్పుల ప్రభావంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. కాగా, ఏప్రిల్‌లోనే గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటడంతో వచ్చే నెల మేలో పరిస్థితేంటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

సాధారణం కంటే 4 డిగ్రీలు అధికంగా...

రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. సగటున 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 43.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత దుండిగల్‌లో 24.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఖమ్మంలో గరిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 5.6 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కాగా, భద్రాచలం, నల్లగొండలో 4 డిగ్రీల సెల్సియస్, ఆదిలాబాద్, మెదక్, హనుమకొండ, నిజామాబాద్, రామగుండంలో 3 డిగ్రీల సెల్సియస్ మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లో 2 డిగ్రీల సెల్సియస్ మేర సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గురువారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
భద్రాచలం	43.4	28.5
ఆదిలాబాద్	43.0	29.2
ఖమ్మం	43.0	27.6
నల్లగొండ	43.0	25.0
విజయవాడ	43.0	28.0
నిజామాబాద్	42.4	27.9
రామగుండం	42.4	26.4
మెదక్	42.0	25.0
హనుమకొండ	41.5	26.5
మహబూబ్‌నగర్	41.2	30.1
హైదరాబాద్	40.8	27.7
విశాఖపట్నం	38.0	27.2

ద్రోణి ప్రభావంతో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. శుక్రవారం ఉత్తరాది జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

వడదెబ్బతో ఆరుగురి మృతి



కనకయ్య



ఎదునూరి మల్లయ్య



మట్కం గంగారాం



ఎల్లాగౌడ్

శంకరపట్నం(మానకొండూర్)/ రఘునాథపల్లి/చందుర్తి(వేములవాడ)/మంచిర్యాల క్రైం/డిచ్‌పల్లి: రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బకు గురై ఆరుగురు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన పూదరి కనకయ్య (67) బుధవారం జిల్లాలోని ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి కల్యాణానికి వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. అక్కడి భక్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి, ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోవడంతో అతన్ని కుటుంబ సభ్యులు గురువారం ఇంటికి తీసుకొచ్చిన కాసేపటికే కనకయ్య మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల పరిధి జాఫర్‌గూడానికి చెందిన రైతు ఎదునూరి మల్లయ్య (70) బుధవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి వచ్చాక తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మల్లయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లెకు చెందిన దినసరి కూలీ మట్కం గంగారాం (42) గురువారం మధ్యాహ్నం పనిపై చందుర్తికి మరొకరితో కలిసి వెళ్లి వచ్చాడు. బైక్ దిగుతుండగా కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య సరవ్వ, కుమారుడు స్వామి, కూతురు ఉన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎక్బాల్ హైమద్‌నగర్‌కు చెందిన ఎస్‌కే ఫరీద్ పాష (40) గురువారం, కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ పరిధి జనగాం గ్రామానికి చెందిన వేలాది మధుకర్ (24) వడదెబ్బకు గురై బుధవారం రాత్రి మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రం శివారులోని గాయత్రి ఎన్‌క్లేవ్ సమీపంలో ఆలూరు గ్రామానికి చెందిన కొత్తూరు ఎల్లాగౌడ్ (74)కు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 16న సైకిల్ తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సైకిల్‌పై తిరుగుతూ డిచ్‌పల్లికి చేరుకున్నాడు. సరిగ్గా తిండి లేకపోవడం, ఎండ వేడి బాగా ఉండటంతో వడదెబ్బకు గురై బుధవారం రాత్రి చనిపోయాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.